www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 19-1-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 274 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ. 7.31 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఉత్తర సా. 5.30 తదుపరి హస్త; వర్జ్యం: రా.2.57-4.45; దుర్ముహూర్తం: సా.4.30-5.14; అమృతఘడియలు: ఉ.9.30-11.16; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.59 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఏపీకి 'ఎయిర్‌బస్ హెలికాప్టర్'!?

హెచ్125 హెలికాప్టర్ల ప్లాంటు ఏర్పాటు యోచన

4 రాష్ట్రాలను ఎంచుకున్న ఎయిర్‌బస్

అందులో ఏపీ వైపే ఎక్కువ మొగ్గు

అన్నీ కుదిరితే అనంతపురం జిల్లాలో ఏర్పాటు



అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెచ్125 హెలికాప్టర్ల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని 'ఎయిర్ బస్' సంస్థ యోచిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రాథమిక దశలోనే ఉంది. భారత్‌లో హెలికాప్టర్ల ఉత్పత్తి ప్రారంభించాలని ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఇప్పటికే నిర్ణయించుకుంది. ఇందుకు కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్ తోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను పరిశీలిస్తోంది. ఈ నాలుగు రాష్ట్రాలతో ఎయిర్ బస్ ప్రతినిధులు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో... ఏపీ వైపే ఎయిర్‌బస్ మొగ్గు చూపే అవకాశముందని అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే

మిగతా 14వ పేజీలో...

జగన్ జల్సా భవన్‌లు!

ప్యాలెస్‌లపై ఆరా తీసిన అమిత్‌షా

విలాసాల భవంతులపై ఆశ్చర్యం

బెంగళూరులో 36 ఎకరాల్లో..

హైదరాబాద్‌లో వంద గదులతో..

రుషికొండపై 500 కోట్ల ప్రజాధనంతో

హరిత ట్రైబ్యునల్ జరిమానా కూడా వేసింది

షాకు వివరించిన బాబు, లోకేశ్ తదితరులు

ఎన్టీఆర్‌కు 'భారత రత్న'పై చర్చ

ఆయన అర్హుడని అమిత్ షా అభిప్రాయం

ఎయిర్‌పోర్టులో అమిత్‌కు ఘన స్వాగతం

భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు, నేతల రాక

పూలవర్షంతో స్వాగతించిన మహిళలు

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఘన స్వాగతం లభించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం జాతీయ విపత్తు సంస్థలను ప్రారంభించడానికి విజయవాడకు అమిత్‌షా చేరుకున్నారు. ఆయన కోసం శనివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. చంద్రబాబు ఇంటి ఆవరణలో కృష్ణా నది పక్కన నిర్మించిన తాత్కాలిక హాల్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులతో కలిసి అమిత్‌షా విందు ఆరగించారు. కృష్ణా తరంగాల మీదుగా... ఇంద్రకీలాద్రి పైనున్న కనకదుర్గమ్మ గుడి అలంకరణ కనిపించేలా అమిత్‌షాను కూర్చోబెట్టారు. ఎదురుగా గుడి చూస్తూ... 'నది పక్కన మీ ఇల్లు చాలా బాగుంది' అని అమిత్‌షా అన్నారు. అదే సమయంలో అనూహ్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్యాలెస్‌ల గురించి అమిత్‌షా ఆరా తీసినట్లు తెలిసింది. జగన్‌కు ఎన్ని ప్యాలెస్‌లు

మిగతా 2వ పేజీలో...



సీఎం నివాసంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ 13

ఏపీలో అభివృద్ధిని పట్టాలెక్కించాం.. కష్టాలన్నీ తీరిపోయే పరిస్థితికి వస్తున్నాం

రాజధాని అమరావతిని గట్టెక్కించాం.. పోలవరం ప్రాజెక్టుకు ప్రాణం పోశాం

కేంద్రం విశాఖ రైల్వే జోన్ ఇచ్చింది.. స్టీల్ ప్లాంట్‌కు రూ.13 వేల కోట్ల నిధులు

ప్రధాని మోదీ నేతృత్వంలో ప్రపంచంలో భారత్ నంబర్ వన్‌గా ఎదుగుతుంది

నదుల అనుసంధానంతోనే సీమ సస్యశ్యామలం.. మైదుకూరు సభలో సీఎం

మారీచులతో జాగ్రత్త!



ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకుని బలపడాలంటే కేంద్ర సహకారం పూర్తిగా అవసరం. ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువిడుపులతో వ్యవహరిస్తున్నారు. కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నారు.

కేంద్రంలో మోదీ సర్కార్ మూడవ పర్యాయం అధికారం చేపట్టడంలో తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకం. అలా అని తనకు లభించిన అవకాశాన్ని కేంద్రంపై పెత్తనం చేయడానికి కాకుండా రాష్ట్రానికి ప్రయోజనాలు పొందడానికి ఉపయోగించాలని చంద్రబాబు నిర్ణయించుకోవడం ఆయన పరిపక్వతకు నిదర్శనం.

ప్రస్తుతానికి చంద్రబాబు అవసరం ప్రధాని మోదీకి, మోదీ అవసరం చంద్రబాబుకు ఉంది. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నందున మూడు పార్టీల మధ్య సఖ్యత సజావుగా సాగుతోంది. ఈ సఖ్యత మునుముందు కూడా ఇలాగే కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించవచ్చు.

పొత్తులో ఉన్న భాగస్వామ్య పార్టీలు సొంతంగా ఎదగాలని ప్రయత్నించడం సహజం. ఈ ప్రయత్నంలో భాగస్వామ్య పక్షాల మధ్య పొరపొచ్చాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయి. భాగస్వామ్య పక్షాల మధ్యనే కాదు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య అపోహలు సృష్టించే ప్రయత్నాలు కూడా జరుగుతాయి.

వివిధ రూపాలలో ఉన్న మారీచులు రాజధాని అమరావతిపై విషం చిమ్మడం మొదలుపెట్టారు. లక్ష కోట్లతో రాజధాని నిర్మించడం అవసరమా? అని అసంబద్ధ వాదనలు మళ్లీ తెర మీదకు తెస్తున్నారు. ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ఏమిటి? అని విష ప్రచారాన్ని మళ్లీ మొదలెట్టారు. ఈ క్రమంలో వాస్తవాలకు పాతర వేస్తున్నారు.

హైదరాబాద్ నగరం వల్ల వస్తున్న ఆదాయంతోనే తెలంగాణలోని ఇతర జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయగలుగుతోంది. భవిష్యత్తులో అమరావతి కూడా హైదరాబాద్ స్థాయిలో కాకపోయినా గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అప్పుడు ఆ ఫలాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలూ అనుభవిస్తారు.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



3

ప్రతి 100 మందిలో ఒకరికి 'క్యాన్సర్'!

రాష్ట్రంలో 53 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు

52,221 మంది క్యాన్సర్ అనుమానితులు

2019-20లో చికిత్స కోసం ఖర్చు 217 కోట్లు

2023-24 నాటికి 624 కోట్లకు పెరిగిన ఖర్చు

సంపూర్ణ నివారణే లక్ష్యంగా స్క్రీనింగ్

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో.. మృతుల సంఖ్య 18

12 మంది చనిపోయినట్లు పోలీసుల ప్రకటన

18 మంది మృతిచెందారంటూ నక్సల్స్ లేఖ

మృతుల్లో తెలంగాణ కార్యదర్శి చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నట్లు వెల్లడి 12

ధ్రువీకరించని తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు

మృతుల్లో పెద్ద నాయకులెవరూ లేరని ఉద్ఘాటన

మీ ఈపీఎఫ్ వ్యక్తిగత వివరాల్లో మార్పులు మీరే చేసుకోవచ్చు!

ఖాతా బదిలీ కూడా.. యజమాని ప్రమేయం లేకుండా ఆన్‌లైన్‌లోనే.. 2

ఈ-కేవైసీ, ఆధార్‌తో అనుసంధానం పూర్తయిన సభ్యులకే వర్తింపు

'అభయ' కేసులో దోషి సంజయ్ రాయ్ 2

జూ. డాక్టర్‌పై హత్యాచారం చేసింది అతడే

ఆర్‌జీ కర్ ఘటనపై కోల్‌కతా కోర్టు తీర్పు

రేపు శిక్షను ప్రకటించనున్న న్యాయస్థానం

తీర్పుపై కుటుంబీకులు, మెడికోల అసంతృప్తి

కుట్రపై లోతైన దర్యాప్తునకు డిమాండ్



మైదుకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పుష్పాంజలి



గుంటూరు జిల్లా నంబూరులో చెత్త సేకరణ ట్రాక్టర్‌ను ప్రారంభించి, నడుపుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

దావోస్‌లో 'బ్రాండ్ ఏపీ'

3 రోజులపాటు చంద్రబాబు పర్యటన.. దిగ్గజ సంస్థల ప్రతినిధులతో భేటీలు

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యం.. నేటి అర్ధరాత్రి దావోస్‌కు పయనం 13

ఎన్టీఆర్.. తెలుగువారి ఆత్మగౌరవం

పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం.. తెలుగుజాతి ఉన్నంత వరకూ ఆ స్థానం సుస్థిరం

ఎన్టీఆర్ వర్ధంతి సభలో చంద్రబాబు.. ఎన్టీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శం: పవన్

ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర'లో పాల్గొనాలి: సీఎం

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత: డిప్యూటీ సీఎం పవన్

పోలవరం @ 2027

డయాఫ్రమ్ వాల్ పనులకు శ్రీకారం

నిరాడంబరంగా ప్రారంభించిన జల వనరుల శాఖ అధికారులు

ఈ ఏడాది ఆఖరుకు పనులు పూర్తి

జూలై నుంచి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు కూడా ప్రారంభం

26న ప్రాజెక్టు వద్దకు చంద్రబాబు



డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం తెచ్చిన ట్రెంచ్ కట్టర్

అమరావతి/ఏలూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జల-జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2027 జూలై నాటికి పూర్తి చేయాలన్న లక్ష్య సాధన దిశగా కీలక అడుగు పడింది. ప్రధాన ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రమ్‌వాల్ పనులు శనివారం మొదలయ్యాయి. 2018 నాటికే పూర్తయిన డయాఫ్రమ్‌వాల్ నాటి జగన్ సర్కారు 'రివర్స్ టెండరింగ్' నిర్వాకంతో దెబ్బతింది. దీంతో పాత డయాఫ్రమ్‌వాల్‌కు సమాంతరంగా కొత్తగా మళ్లీ నిర్మించాల్సి వస్తోంది. శనివారం ఉదయం 10.19 గంటలకు పూజలు చేసిన ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్. రామచంద్రరావు, బావర్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హాసన్ పర్హాత్, మేఘా ఇంజనీరింగ్ జీఎం గంగాధర్ తదితరులు పనులకు శ్రీకారం చుట్టారు. కొత్త డయాఫ్రమ్‌వాల్‌కు టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగించాలని కేంద్ర జల సంఘం బావర్ సంస్థను ఆదేశించింది. వాస్తవానికి అంతర్జాతీయ నిపుణుల సంఘం 'టీ-16' ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వాడాలని సూచించింది. అయితే, ఈ టీ-16 మిశ్రమం పెళుసుగా ఉంటుందని, వంపుల వద్ద బీటలు వస్తాయని జాతీయ పరిశోధన సంస్థలు సహా నిపుణులు


మిగతా 12వ పేజీలో...

టీటీడీలో కల్తీ నెయ్యికి కళ్లెం!

100% కల్తీని గుర్తించే నూతన పరికరాలు సిద్ధం

జర్మనీ నుంచి 70 లక్షల విలువైన 2 యంత్రాలు

తిరుమల ల్యాబ్‌కు విరాళంగా ఇచ్చిన ఎన్డీడీబీ



తిరుమల ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన హై పెర్ఫార్మన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రాఫ్ 14

'విపత్తు' అధికారి అతి!

తిరుమల పర్యటన కోసం హల్‌చల్

అమిత్‌షా పర్యటనకు వచ్చి హైడ్రామా

టీటీడీ అధికారులతో సమీక్ష అంటూ లేఖ

ఛైర్మన్ బీఆర్ నాయుడుకు సమాచారం

కేంద్రం రంగంలోకి దిగుతామనడంపై రాష్ట్ర ప్రభుత్వ విస్మయం 13

కేంద్ర హోం శాఖకు అభ్యంతరం

తమకే సంబంధం లేదన్న అధికారులు

విపత్తు అధికారి పర్యటన రద్దు



సిద్ధమైన ఎన్ఐడీఎం కార్యాలయం

నాడు జగన్ పగబట్టారు బాబు పూర్తిచేయించారు 12

గన్నవరంలోని కొండపావులూరులో ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్‌ల ఏర్పాటు

ఢిల్లీ తర్వాత జాతీయ విపత్తు కేంద్రం ఇక్కడే.. నేడు ప్రారంభించనున్న అమిత్‌షా

నాడు టీడీపీ హయాంలో శంకుస్థాపన.. వైసీపీ సర్కారులో సహాయ నిరాకరణ

అమరావతితోపాటు కేంద్ర సంస్థలకూ మోకాలడ్డు.. కేంద్ర లేఖలూ బుట్టదాఖలు

ధాన్యం కొనుగోళ్లు నిలిచాయ్!

సమస్య సాంకేతికమా.. నిధుల లేమా?

సేకరణ లక్ష్యం 37 లక్షల టన్నులు

సేకరించింది 29.26 లక్షల టన్నులు

దళారుల రంగప్రవేశం.. రైతుకు పాట్లు

తిప్పలు పెట్టిన ఆర్ఎస్‌కే సిబ్బంది



అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. గోదావరి జిల్లాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకున్నామంటూ కొనుగోళ్లను ఆపేశారు. కృష్ణా-గుంటూరు జిల్లాల్లో టార్గెట్ పూర్తి కాకున్నా ఆపేశారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 37 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటి వరకు 29.26 లక్షల టన్నులు మాత్రమే సేకరించింది. 4.62 లక్షల మంది రైతుల నుంచి రూ.6,740 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌర సరఫరాల పోర్టల్‌లో చూపుతున్నారు. ధాన్యం రైతులకు సొమ్ము చెల్లించేందుకు ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా సివిల్ సప్లయిస్ సంస్థ

మిగతా 12వ పేజీలో...

మీ ఈపీఎఫ్ వ్యక్తిగత వివరాల్లో మార్పులు మీరే చేసుకోవచ్చు!

» ఖాతా బదిలీ కూడా యజమాని ప్రమేయం లేకుండా ఆన్‌లైన్‌లోనే

» ఈ-కేవైసీ, ఆధార్‌తో అనుసంధానం పూర్తయిన సభ్యులకే వర్తింపు

న్యూఢిల్లీ, జనవరి 18: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) సభ్యులు ఇక మీదట తమ ఈపీఎఫ్ ఖాతాలో ఉన్న వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో తమంతట తామే మార్చుకోవచ్చు. యజమాని ధ్రువీకరణగానీ, ఈపీఎఫ్‌ఓ ఆమోదంగానీ అవసరం లేదు. అంతేకాదు, యజమాని ప్రమేయం లేకుండానే ఈపీఎఫ్ ఖాతా బదిలీకి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఈపీఎఫ్‌ఓలో కొత్త సేవలు శనివారం నుండి అందుబాటులోకి వచ్చాయి. వీటిని కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేరు, పుట్టినతేదీ, లింగం, జాతీయత, తల్లి/తండ్రి పేరు, భార్య/భర్త పేరు, ఈపీఎఫ్‌లో చేరిన తేదీ, వైదొలిగే తేదీ వంటి వ్యక్తిగత వివరాల నమోదులో దొర్లే తప్పులను ఇక మీదట సభ్యులే స్వయంగా సరిదిద్దుకోవచ్చన్నారు. అయితే, ఆధార్ నెంబర్‌తో అనుసంధానిస్తూ 2017 అక్టోబరు 1వ తేదీ తర్వాత యూఏఎన్ (యూనివర్సల్ అకౌంట్ నెంబర్) జారీ అయిన సభ్యులకే ఇది వర్తిస్తుందని చెప్పారు. ఈ తేదీ కంటే ముందు యూఏఎన్ జారీ అయిన సభ్యుల వ్యక్తిగత వివరాల్లో సవరణలను.. వారు పని చేసే కంపెనీలే చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈపీఎఫ్‌ఓ ఆమోదం అవసరం లేకుండానే ఈ మార్పులు జరుపుకోవచ్చని తెలిపారు. ఆధార్‌తో అనుసంధానించని ఖాతాల విషయంలో మాత్రం.. వ్యక్తిగత వివరాల్లో మార్పుల కోసం సంబంధిత ధ్రువీకరణ పత్రాలను యజమానికి అందజేస్తే, వాటిని యజమాని పరిశీలించి ఈపీఎఫ్‌ఓకు పంపించాల్సి ఉంటుందని.. ఈపీఎఫ్‌ఓ ఆమోదం తర్వాత మార్పులు నమోదవుతాయని మాండవీయ వెల్లడించారు. ఈపీఎఫ్ ఖాతా బదిలీ అంశంపై స్పందిస్తూ.. ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్న ఈపీఎఫ్ ఖాతాదారులు యజమాని ప్రమేయం లేకుండానే ఆధార్ ఓటీపీతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వ్యక్తిగత వివరాల్లో మార్పుల కోసంగానీ, ఖాతా బదిలీ కోసం గానీ ఇప్పటికే యజమానికి దరఖాస్తు చేసుకున్న వారు దానిని ఉపసంహరించుకొని, ఆన్‌లైన్‌లో తామే స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

జేఈఈ మెయిన్స్ అడ్మిట్ కార్డుల విడుదల

» 22 నుంచి 24 వరకు మొదటి దశ పరీక్షలు

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దేశంలోని ఐఐటీల్లో ప్రవేశం కోసం జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్ పరీక్షలకు సంబంధించి అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) శనివారం విడుదల చేసింది. ఈ నెల 22 నుంచి జరగనున్న జేఈఈ మెయిన్ పరీక్షలను రెండు దశల్లో నిర్వహిస్తున్నారు. మొదటి దశ పరీక్షలు ఈ నెల 22 నుంచి 24 వరకు, రెండో దశ పరీక్షలు 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రస్తుతం మొదటి దశ పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. రోజూ రెండు సెషన్ల చొప్పున ఈ పరీక్షలు నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా 15 పట్టణాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి.

లోకం తీరు



1.65 కోట్ల ఎకరాల్లో డ్రోన్ల సర్వే పూర్తి

» 'స్వమిత్వ' కింద పూర్తి చేసిన మోదీ సర్కారు

» 65 లక్షలమందికి శాశ్వత భూహక్కు దఖలు

» వారికి స్వమిత్వ కార్డులు పంపిణీ చేసిన ప్రధాని



న్యూఢిల్లీ, జనవరి 18: డ్రోన్లను ఉపయోగించి భూముల సర్వేలో మోదీ ప్రభుత్వం అద్భుతం చేసింది. రికార్డుస్థాయిలో గ్రామీణ ప్రాంతంలో 67 వేల చదరపు కిలోమీటర్ల (1.65 కోట్ల ఎకరాలు) భూముల సర్వేను పూర్తిచేసింది. దాదాపు రూ.132 లక్షల కోట్ల విలువైన భూసంబంధ వివాదాలను ఐదేళ్లలో పరిష్కరించింది. భూసర్వేను పూర్తిచేసుకున్న చోట 65 లక్షల మందికి శాశ్వత భూయాజమాన్య ధ్రువీకరణ (స్వమిత్వ) కార్డులను శనివారం ప్రధాని మోదీ పంపిణీ చేశారు. అనంతరం కొందరు లబ్ధిదారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పల్లె సీమల్లో ఆర్థిక జీవనం మెరుగుపడటానికీ, పేదరికం నుంచి బయటపడటానికి లబ్ధిదారులకు స్వమిత్వ కార్డులు ఉపకరిస్తాయని ఆయన తెలిపారు. విలువైన ఆస్తులను కలిగిఉన్నా, వాటిని ధ్రువీకరించే సరైన పత్రాలు లేకపోవడం గ్రామసీమలు ఎదుర్కొంటున్న పెద్ద సవాల్ అనీ, దానివల్ల రుణం ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావడం లేదన్నారు. స్వమిత్వ కార్డులను ఉపయోగించి బ్యాంకు నుంచి రుణం తీసుకోవచ్చునని, ఆ డబ్బులతో కొత్తగా వ్యాపారాలు మొదలుపెట్టవచ్చునని మోదీ సూచించారు. కాగా, ఇవే వివరాలతో కేంద్ర పంచాయతీ రాజ్ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. స్వమిత్వ పథకం కింద ఇప్పటివరకు 3.17 లక్షల గ్రామాల (92శాతం) పరిధిలో సర్వే పనులు పూర్తిచేశామని పేర్కొంది. మొత్తం 3.44 లక్షల గ్రామాలను ఈ పథకంలోకి తీసుకురావాలనే లక్ష్యాన్ని 2026నాటికి చేరుకుంటామని పేర్కొంది. పది రాష్ట్రాల పరిధిలో కార్డుల పంపిణీ జరిగినట్టు వివరించింది. కాగా, స్వమిత్వ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం 2020 ఏప్రిల్‌లో ప్రారంభించింది.

సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసు.. ఛత్తీస్‌గఢ్‌లో నిందితుడి పట్టివేత

» రైలులో వెళ్తుండగా గుర్తించిన ఆర్పీఎఫ్



ఆకాశ్

ముంబై/రాయ్‌పూర్, జనవరి 18: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి చేసిన దుండగుడు అరెస్టయ్యాడు. ముంబై నుంచి జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో బిలాస్‌పూర్ వెళ్తున్న నిందితుడిని శనివారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తించి, అరెస్టు చేసినట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ సంజీవ్ సిన్హా తెలిపారు. నిందితుడిని ముంబైకి చెందిన ఆకాశ్ కైలాష్ కనోజియాగా గుర్తించామని వివరించారు. దాడికి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ముంబై పోలీసులు చెప్పారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోనూ రాజేంద్ర కోడేప్ అనే అనుమానితుడిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. సైఫ్ భార్య కరీనా ఇచ్చిన వాంగ్మూలం మేరకు అతణ్ని విచారిస్తున్నట్లు సమాచారం. సైఫ్ అలీఖాన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన నడవగలుగుతున్నారని లీలావతి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ నితిన్ డాంగే తెలిపారు.

బందీల జాబితా ఇస్తేనే ఒప్పందం: నెతన్యాహు

టెల్ అవీవ్, జనవరి 18: కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం హమాస్ 33 మంది బందీల పేర్లతో జాబితాను విడుదల చేసేవరకు ముందుకెళ్లబోమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. ఒప్పందం ఉల్లంఘిస్తే పూర్తి బాధ్యత హమాస్‌దే అవుతుందని ఆయన హెచ్చరించారు. వాస్తవానికి కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి రావాలి. దీని ప్రకారం 33 మంది బందీలను హమాస్, 737 మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేయాలి.

బడ్జెట్ సమావేశాల్లో కొత్త ఆదాయ పన్ను బిల్లు!

న్యూఢిల్లీ, జనవరి 18: దేశంలో త్వరలోనే నూతన ఆదాయపన్ను చట్టం రానుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 63 ఏళ్ల కిందటి ఆదాయ పన్ను చట్టం స్థానంలో నూతన చట్టం తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే ఈ కొత్త బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రధానంగా ప్రస్తుతం ఉన్న నిబంధనలను సరళీకరించడంతోపాటు, అందరికీ అర్థమయ్యే భాషలో దీనిని తీసుకురానున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

ఆర్జేడీ పగ్గాలు తేజస్వీయాదవ్‌కు



పట్నా, జనవరి 18: ఆర్జేడీ అధ్యక్షుడిగా తేజస్వీయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. శనివారం ఆర్జేడీ జాతీయ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కాగా, అనారోగ్య కారణాల దృష్ట్యా లాలూప్రసాద్ యాదవ్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు.

'అభయ' కేసులో దోషి సంజయ్ రాయ్

» జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసింది అతడే

» ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఘటనపై కోల్‌కతా కోర్టు తీర్పు..రేపు శిక్ష ప్రకటన



నిందితుడు సంజయ్‌ను తీసుకువస్తున్న సమయంలో కోల్‌కతా కోర్టు వద్ద భారీ బందోబస్తు

కోల్‌కతా, జనవరి 18: దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన జూనియర్ డాక్టర్ 'అభయ' దారుణ హత్య కేసుపై శనివారం కోల్‌కతా నగర న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే ఆమెపై అత్యాచారం, ఆపై హత్య చేసిన కేసులో అక్కడి పనిచేసే సంజయ్ రాయ్ దోషి అని ప్రకటించింది. ఇందుకు విధించే శిక్షను సోమవారం వెల్లడించనుంది. 162 రోజుల పాటు రహస్య విచారణ జరిపిన అనంతరం సేల్దాలోని అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ ఈ మేరకు నిర్ణయాన్ని వెలువరించారు. నేర తీవ్రతను పరిశీలిస్తే మరణశిక్షగానీ, యావజ్జీవ కారాగార శిక్షగానీ విధించే అవకాశం ఉంది. గత ఏడాది ఆగస్టు 9న ఆస్పత్రిలో ఆన్ డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వర్తించి రాత్రి సెమినార్ హాల్‌లో నిద్రిస్తున్న 31 ఏళ్ల ఆ మెడికోపై వేకువజాము నాలుగు గంటల సమయంలో సంజయ్ రాయ్ అత్యాచారం చేసి, అనంతరం గొంతు పిసికి హత్య చేసినట్టు రుజువయిందని జడ్జి తెలిపారు. అతడు సమీప పోలీసు స్టేషన్‌లో 'సివిక్ వాలంటీర్'గా పనిచేసేవాడు. బందోబస్తు నిమిత్తం ఆ ఆస్పత్రిలో నియమించగా ఈ దారుణానికి పాల్పడ్డాడు. అతడిపై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 64 (రేప్), 66 (మరణానికి కారణమయినందుకు శిక్ష), సెక్షన్ 103(1) (హత్య)ల కింద కేసు నమోదయింది. ఈ అభియోగాలను కేసు దర్యాప్తు చేసిన సీబీఐ నిరూపించిందని జడ్జి తెలిపారు. ముద్దాయి తన వాదనను వినిపించేందుకు సోమవారం ఉదయం 12.30 గంటలకు అవకాశం ఇస్తారు. తర్వాత తీర్పు ప్రకటిస్తారు.

నేను నేరం చేయలేదు

తాను ఎలాంటి నేరం చేయలేదని రాయ్ విచారణ సందర్భంగా చెప్పాడు. "నేను రుద్రాక్ష మాల ధరిస్తాను. ఒక వేళ నేరం చేసి ఉంటే ఆ మాల తెగిపడిపోయి ఉండేది కదా! పవిత్ర రుద్రాక్షలు ధరించి అలాంటి నేరం చేయగలనా?" అని వాదించాడు. ఆ వాదనతో జడ్జి ఏకీభవించలేదు. కోర్టుకు కూడా రుద్రాక్ష మాల వేసుకొని, కాషాయం కోటు ధరించి వచ్చాడు. ఈ దారుణానికి నిరసనగా కోల్‌కతా నగరంలో పెద్దయెత్తున ఆందోళనలు జరిగాయి. బాధితురాలిని కొందరు 'అభయ', ఇంకొందరు 'తిలోత్తమ' అని పిలుచుకొని ప్లకార్డులు, కొవ్వొత్తులు పట్టుకొని నిరసనలు తెలిపారు. ఈ తీర్పును బాధితురాలి తల్లిదండ్రులు స్వాగతించినా పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేయలేదు. ఆమె తల్లి మాట్లాడుతూ "సంజయ్ రాయ్ దోషి అని నిరూపితమయింది. అయితే అతడొక్కడే నేరస్తుడు కాదు. మిగిలిన వారిని కూడా చట్టం ముందు నిలబెట్టాలి. ఇందుకోసం తుది శ్వాస వరకు పోరాడుతాం" అని చెప్పారు. ఈ దుర్ఘటనపై ఆందోళన చేసి దేశం దృష్టిని ఆకర్షించిన జూనియర్ డాక్టర్లు.. దీని వెనుక ఉన్న కుట్రపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని కోరారు. చాలా ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉందని ఓ జూనియర్ డాక్టర్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో ప్రముఖ వ్యక్తుల పాత్రపై దర్యాప్తు జరగాల్సి ఉందని అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు సువేందు అధికారి మాట్లాడుతూ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, కలకత్తా మాజీ పోలీసు కమిషనర్ వినీత్ గోయల్‌లకు కూడా ప్రస్తుతం శిక్ష పడి ఉంటే బాగుండేదని చెప్పారు.

టెల్కోల ఏజీఆర్ బకాయిల మాఫీకి కేంద్రం యోచన

న్యూఢిల్లీ, జనవరి 18: దేశీయ టెలికాం కంపెనీలపై ఉన్న కొండంత ఆర్థిక భారాన్ని దించే దిశగా కేంద్రం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా పలు టెలికాం సంస్థలు చెల్లించాల్సి ఉన్న సర్దుబాటు చేసిన స్థూల రాబడి (ఏజీఆర్) బకాయిల్లో పెద్ద మొత్తాన్నే మాఫీ చేసే ఆలోచన చేస్తున్నట్టు కథనాలు వెలువడ్డాయి. ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంటే టెలికాం కంపెనీలకు భారీ ఊరట లభిస్తుంది. క్రితం స్పెక్ట్రమ్ బకాయిలకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సిన అవసరం లేదని గతేడాది డిసెంబరులో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో టెలికాం కంపెనీలు ఊపిరి పీల్చుకున్నాయి. ఇప్పుడు ఏజీఆర్ బకాయిలను తగ్గించే ఆలోచన చేస్తున్నట్టు వస్తున్న కథనాలతో ఆ కంపెనీల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 50% వడ్డీ తోసహా పెనాల్టీలు, పెనాల్టీలపై వడ్డీని 100% మేర మాఫీ చేయాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే టెలికాం ఆపరేటర్లకు రూ.లక్ష కోట్లకు పైగా ఆర్థిక ఊరట లభించనుందని సమాచారం. అయితే ఇందులో సగానికి పైగా వొడాఫోన్ ఐడియా (వీఐ)కే ప్రయోజనం కలగడానికి అవకాశం ఉంది. వీఐ ఏజీఆర్ బకాయిలను దాదాపు రూ.52వేల కోట్లకు పైగా, ఎయిర్‌టెల్ బకాయిలు దాదాపు రూ.38వేల కోట్లు, టాటా టెలీ సర్వీసెస్ బకాయిలు రూ.14వేల కోట్ల మేర తగ్గవచ్చన్న అంచనాలు వస్తున్నాయి. 2019లో సుప్రీంకోర్టు తీర్పుతో టెలికాం కంపెనీలపై దాదాపు రూ.1.47 లక్షల కోట్ల ఏజీఆర్ బకాయిల భారం పడింది.

జగన్ జల్సా భవన్‌లు!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని అమిత్‌షా అడగ్గా... బెంగళూరులో ఆరు ఎకరాల్లో ఒక పెద్ద ప్యాలెస్ ఉన్నట్లుందని సీఎం చంద్రబాబు చెప్పారు. 'ఆరు కాదు..... మొత్తం 32 ఎకరాలు. అందులో పెద్ద ప్యాలెస్ కట్టుకొన్నారు. హైదరాబాద్‌లో కూడా ఆయన భవనంలో వంద గదులు ఉన్నాయి' అని మంత్రి లోకేశ్ వివరించారు. ముప్పై రెండు ఎకరాలా అని అమిత్ షా ఆశ్చర్యపోయారు. 'ఇవి చాలవని విశాఖపట్నంలో రూ. ఐదు వందల కోట్ల ప్రభుత్వ ధనం ఖర్చు పెట్టి తాను ఉండటం కోసం భారీ భవనాలు నిర్మించారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టారని హరిత ట్రైబ్యునల్ ఆ నిర్మాణాలపై రూ. రెండు వందల కోట్లు జరిమానా విధించింది" అని చంద్రబాబు చెప్పారు. ఆ డబ్బులు జగన్ కట్టారా? అని అమిత్ షా అడిగారు. ఇంకా చెల్లించలేదని చంద్రబాబు బదులిచ్చారు. "హరిత ట్రిబ్యునల్ చాలా శక్తివంతమైంది. మేం గతంలో అండమాన్‌లో పర్యాటకుల కోసం ఒక భవనం కడితే ఇలాగే భారీ జరిమానా వేశారు. దాని కోసం అనేకసార్లు మాట్లాడి కొంత తగ్గించగలిగాం. జరిమానా కట్టడం తప్ప వేరే మార్గం లేదు" అని అమిత్ షా తన అనుభవం వివరించారు. జగన్ ఏం చేస్తున్నారు... తిరుగుతున్నారా.. అని అమిత్‌షా అడిగారు. ప్రకటనలు ఇవ్వడం తప్ప ఇంతవరకూ పెద్దగా తిరుగుతోంది లేదని, సుదీర్ఘ యాత్రలు చేయబోతున్నానని లీకులు మాత్రం ఇస్తున్నారని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఎన్టీఆర్ భారతరత్న ఇవ్వదగ్గ వ్యక్తి : అమిత్‌షా

టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను సీఎం చంద్రబాబు కోరారు. ఆయన తప్పనిసరిగా ఇవ్వాల్సిన వ్యక్తి అని అమిత్ షా వ్యాఖ్యానించారు. తాను దానిపై ఒక లేఖను కూడా ఇచ్చానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి ఆయనకు చెప్పారు. తెలుగు ప్రధాని పీవీ నర్సింహారావును గుర్తు చేసుకొన్న ఆయన... పీవీ ఎన్నిసార్లు ముఖ్యమంత్రిగా చేశారు... ఎంత కాలం ఉన్నారని అడిగారు. "ఆయన కేవలం పదిహేను నెలలు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం అప్పట్లో పదేపదే ముఖ్యమంత్రులను మార్చేది" అని చంద్రబాబు తెలిపారు. ఆ పార్టీ తరఫున ఎక్కువ కాలం ఎవరు ముఖ్యమంత్రిగా చేశారని అమిత్ షా అడిగారు. "వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరేళ్లు చేశారు. కాసు బ్రహ్మానంద రెడ్డి ఆయన కంటే కొంత ఎక్కువ కాలం చేసినట్లు గుర్తు" అని చెప్పారు. ఈ ప్రాంతంలో పండుతున్న పంటల గురించి కూడా అమిత్ షా అడిగారు. "ఈ ప్రాంతం రాష్ట్ర ధాన్యాగారంగా ప్రసిద్ధి. రాయలసీమ ప్రాంతంలో ఉద్యానవన పంటలు పెరుగుతున్నాయి. గత కాలంలో ఈ ప్రాంతంలో ఒక ఎకరం అమ్మితే తెలంగాణలో ఐదెకరాల భూమి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్ పక్కన ఒక ఎకరం అమ్మితే ఇక్కడ ఏభై ఎకరాలు వచ్చేలా పరిస్థితులు మారిపోయాయి. హైదరాబాద్ అంత ఎదిగిపోయింది" అని చంద్రబాబు వివరించారు. అమరావతికి కూడా మంచి భవిష్యత్తు ఉంటుందని అమిత్ షా వ్యాఖ్యానించారు. మిర్చి, పొగాకు కూడా ఈ ప్రాంతంలో బాగా పండుతాయని పురందేశ్వరి చెప్పారు.

షాకు బాబు కృతజ్ఞతలు..

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తిరిగి కోలుకోవడానికి కేంద్రం ఉదారంగా సాయం చేయడం పట్ల అమిత్‌షాకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు పూలు జల్లుతూ స్వాగతం పలుకుతున్న మహిళలు

అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పురోగతిని ఆయనకు వివరించారు. రాష్ట్రంలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర బాగా వెనకబడిన ప్రాంతాలని, వాటిని అభివృద్ధి పథంలోకి తేవడానికి పోలవరం- బనకచర్ల అంతర్గత నదుల అనుసంధానం ప్రాజెక్టు ఎంతో కీలకమని ఆయనకు చంద్రబాబు వివరించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా దీనికి సాయం చేయాలని కోరారు. విభజన చట్టంలో పెండింగ్‌లో ఉన్న అంశాలను ఆయనకు వివరించి త్వరగా సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. తెలంగాణలో రాజకీయ పరిస్థితి గురించి వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ఆ రాష్ట్రానికి సంబంధించి తమ రాజకీయ ఆలోచన గురించి వివరించిన అమిత్ షా... అక్కడ కూడా బీజేపీ, టీడీపీ కలిసి పనిచేయడంపై చంద్రబాబుతో చర్చించారు. జమిలి ఎన్నికలు, మహిళల రిజర్వేషన్ కోసం పార్లమెంటు సీట్లు అదనంగా పెంచడం, ఎన్డీయే పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలు కూడా వారి మధ్య చర్చకు వచ్చాయని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

> "ఉండవల్లిలోని నా నివాసం వద్ద ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సగౌరవంగా స్వాగతం పలికాం. ఆయనతో జరిగిన సమావేశంలో రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించాం' - ఎక్స్‌లో చంద్రబాబు

అమిత్‌షాకు భారీ స్వాగతం..

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాష్ట్ర పర్యటనలో మునుపెన్నడూ లేని స్థాయిలో భారీ స్వాగతం లభించింది. విశాఖ ఉక్కుకు కేంద్రం ఉదారంగా సాయం ప్రకటించిన నేపథ్యంలో తమ కృతజ్ఞత వ్యక్తం చేయడానికి సీఎం చంద్రబాబు ఆయనకు స్వాగత ఏర్పాట్లు ఈసారి కొంత భారీగా చేశారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు విమానాశ్రయానికి వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. వందల సంఖ్యలో మహిళలు కూడా విమానాశ్రయానికి వచ్చి కేంద్ర హోం మంత్రికి జయజయ ధ్వానాలు పలికారు. మార్గమధ్యంలో ప్రకాశం బ్యారేజీ వద్ద... ఆ తర్వాత కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్ద కూడా వందల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు నిలబడి ఆయనకు స్వాగతం పలికారు. భద్రతా కారణాల రీత్యా అమిత్ షా మార్గమధ్యంలో ఎక్కడా ఆగకుండా అభివాదం చేస్తూ సాగిపోయారు. మరి కొన్ని చోట్ల కూడా స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకత్వం అనుకొన్నా భద్రత అధికారులు వారించడంతో ఆగిపోయింది. ఆయన నేరుగా చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. ఆయన రావడానికి కొంత ముందు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అక్కడకు వచ్చారు. అమిత్ షాకు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఆ తర్వాత అమిత్ షా, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి చంద్రబాబు నివాసంలో పై అంతస్థుకు వెళ్లారు. అమిత్ షా, చంద్రబాబు సుమారు అరగంట పాటు విడిగా సమావేశం అయ్యారు.



సీఎం నివాసంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్



నా కూనను కాపాడరా..!

» ప్రాణాపాయ స్థితిలో ఉన్న పిల్లను ఆస్పత్రికి తెచ్చిన వీధి కుక్క

» తుర్కియేలో ఘటన.. శునకం కన్నప్రేమకు జనం ఫిదా

ఇస్తాంబుల్, జనవరి 18: కన్నబిడ్డల పట్ల తల్లి చూపించే ప్రేమకు కొలమానం ఉండదు. మనుషులైనా, మూగజీవాలైనా కన్నప్రేమ విషయంలో ఎలాంటి తేడా ఉండదు. ఇది నిజమని నిరూపించే ఘటన ఒకటి జనవరి 13న తుర్కియేలో జరిగింది. ప్రాణాపాయంలో ఉండి అచేతనంగా పడిపోయిన ఓ కుక్క పిల్లను దాని తల్లైన వీధి శునకం నోట కరిచి వర్షంలో తడుస్తూ స్థానికంగా ఓ జంతువుల ఆస్పత్రికి తీసుకొచ్చింది. తన పిల్లను అక్కడి సిబ్బంది ముందు పడేసి.. 'నా బిడ్డను కాపాడండి' అన్నట్టు వారి వైపు దీనంగా చూసింది. ఒక్క క్షణం ఏం జరుగుతుందో అర్థం కాక గందరగోళానికి గురైన ఆ ఆస్పత్రి సిబ్బంది.. వెంటనే తేరుకుని కొన ఊపిరితో ఉన్న ఆ పిల్లను పరీక్షించి అవసరమైన వైద్య సాయం అందించి ప్రాణాన్ని నిలిపారు. ఆస్పత్రి బల్లపై ఆ పిల్లకు చికిత్స చేస్తున్నంత సేపు తల్లి శునకం కూడా అక్కడే కంగారుగా తిరుగుతూ కనిపించింది. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీ వీడియోలు సోషల్ మీడియాలో వైరలవ్వగా.. ఆ వీధి శునకం కన్నప్రేమకు జనం ఫిదా అయిపోతున్నారు.

12 జ్యోతిర్లింగాలు 7 కోట్ల రుద్రాక్షలతో

» మహా కుంభమేళాలో పలు ప్రత్యేక ఆకర్షణలు



మహాకుంభ్ నగర్, జనవరి 18: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా వైభవంగా కొనసాగుతోంది. రోజూ లక్షలాదిగా సాధువులు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. సెక్టార్ 6లో 7.51 కోట్లకు పైగా రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన 12 జ్యోతిర్లింగాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ రుద్రాక్షలను 10 వేల గ్రామాల్లో యాత్ర ద్వారా సేకరించారు. మరోవైపు, రష్యాకు చెందిన ఆత్మ ప్రేమ్ గిరి మహారాజ్ బాబా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 7 అడుగుల ఎత్తు, కండలు తిరిగిన శరీరంతో ఉన్న ఆయన్ను 'కండల బాబా' అని కూడా అంటుంటారు. రష్యా పౌరుడు అయిన ఆత్మ ప్రేమ్ గిరి మహారాజ్ 30 ఏళ్ల క్రితం సనాతన ధర్మాన్ని స్వీకరించాడు. అధ్యాపక వృత్తిని వదిలేసి ఆధ్యాత్మికం వైపు మళ్లాడు. జునా అఖాడా సభ్యుడైన ఆయన.. నేపాల్‌లో ఉంటారు.

అద్దెకు ఉండే వారికి ఉచిత విద్యుత్తు, నీరు

» మళ్లీ అధికారంలోకి రాగానే అమలు: కేజ్రీవాల్



న్యూఢిల్లీ, జనవరి 18: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఢిల్లీ ప్రజలపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వరాల జల్లు కురిపిస్తోంది. తాము మళ్లీ అధికారంలోకి వస్తే అద్దె ఇళ్లలో ఉండేవారికి ఉచిత కరెంట్, నీరు అందజేస్తామని ఆ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ ప్రకటించారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను ఎక్కడికి వెళ్లినా అద్దెకుండే ప్రజలు కలుస్తున్నారని.. తమకు ఉచిత బస్సు, పాఠశాలలు, ఆస్పత్రుల నుంచి ప్రయోజనాలను పొందుతున్నా ఉచిత కరెంట్, నీరు పొందలేకపోతున్నామని చెబుతున్నారన్నారు. వారి సమస్యను పరిష్కరించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ కారులో వెళ్తుండగా ఆయన కాన్వాయ్‌పై కొందరు రాళ్లు విసిరారు. ఇది బీజేపీ కుట్రేనంటూ ఆప్ ఆరోపించింది.

ఇరాన్‌లో ఇద్దరు జడ్జిల కాల్చివేత

టెహ్రాన్, జనవరి 18: ఇరాన్‌లో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను గుర్తు తెలియని సాయుధుడు కాల్చి చంపాడు. తర్వాత తానూ కాల్చి చంపుకొన్నాడు. కోర్టు భవనంలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. గతంలో ఆ జడ్జీలు అసమ్మతివాదులకు సామూహిక ఉరిశిక్షలు విధించారన్న కక్షతోనే ఈ పని చేసి ఉంటాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం ఆ 'చొరబాటుదారుడు' హ్యాండ్‌గన్ పట్టుకొని సెంట్రల్ టెహ్రాన్‌లో ఉన్న ఇరాన్ సుప్రీంకోర్టులోకి ప్రవేశించాడు. సుప్రీంకోర్టు 39వ బ్రాంచ్ అధిపతి అయిన హొజ్జత్ అల్ ఇస్లాం అలీ రజిని (71), సుప్రీంకోర్టు 53వ బ్రాంచ్ అధిపతి హొజ్జత్ అల్ ఇస్లాం వల్ ముసల్మీన్ మహమ్మద్ మొఖిసెహ్ (68)లను గురిపెట్టి కాల్పులు జరపగా వారు ప్రాణాలు కోల్పోయారు. ఈ కాల్పుల్లో ఒక బాడీ గార్డు తీవ్రంగా గాయపడ్డాడు.

ఫుట్‌బాల్ కోసం 30లక్షల వీధి కుక్కల హతం

రబాట్, జనవరి 18: 2030లో మొరాకో దేశం స్పెయిన్, పోర్చుగల్‌లతో కలిసి ఫుట్‌బాల్ ప్రపంచ కప్ పోటీలను నిర్వహించనుంది. దానికి సన్నాహాల్లో భాగంగా 30 లక్షల వీధికుక్కలను నిర్మూలించాలని ప్రతిపాదించింది. ఇప్పటి నుంచే వాటికి విషపదార్థాలు ఇవ్వడం, కాల్చి చంపడం, ఇనుప రాడ్లతో తీవ్రంగా కొట్టడం ద్వారా చంపడం ప్రారంభించింది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా జంతుప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కొలికపూడికి పార్టీ తాఖీదు

» రేపు క్రమ శిక్షణ సంఘం ముందు హాజరు కావాలని ఆదేశం

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు ఆ పార్టీ నాయకత్వం తాఖీదు జారీ చేసింది. సోమవారం పార్టీ క్రమ శిక్షణ సంఘం ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఈనెల 11న తన నియోజకవర్గంలోని ఒక ఎస్టీ కుటుంబంపై ఎమ్మెల్యే దాడి చేసిన ఘటనను అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఎ.కొండూరు మండలం గోపాలపురం గ్రామంలో ఒక అంతర్గత రహదారి విషయంలో కొన్ని గిరిజన కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. ఆ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆ వివాదంలో జోక్యం చేసుకొని ఓ వ్యక్తిపై చేయి చేసుకొన్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ వ్యక్తి భార్య పురుగు మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆ రోజే సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసి ఎమ్మెల్యే వివరణ తీసుకోవాలని పార్టీ నాయకులను ఆదేశించారు. ఆయన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో క్రమ శిక్షణ సంఘం ముందుకు పిలిపించాలని నిర్ణయించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ ఈ సంఘం అధ్యక్షులుగా ఉన్నారు. వర్ల రామయ్య, ఎంఏ షరీఫ్, పంచుమర్తి అనురాధ, బీదా రవిచంద్ర ఈ సంఘంలో ఇతర సభ్యులు. కొలికపూడి తరచూ ఏదో ఒక వివాదంలో చిక్కుకొంటుండటంతో పార్టీ నాయకత్వం ఆయన పట్ల అసంతృప్తిగా ఉంది. గతంలో కూడా ఆయన వైఖరిని నిరసిస్తూ ఆ నియోజకవర్గ నేతలు కొందరు విజయవాడలో ధర్నాలు చేశారు. అప్పుడు కూడా కొలికపూడిని పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. ఈ ఏడు నెలల్లోనే ఇప్పుడు రెండోసారి ఆయన తన వివాదాలపై పార్టీ కార్యాలయం మెట్లు ఎక్కుతున్నారు. కొందరు కొత్త ఎమ్మెల్యేలు తప్పులు చేసి వివాదాల్లో చిక్కుకొంటున్నారని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఈ వివాదాలు మసకబారుస్తున్నాయని శుక్రవారం ఇక్కడ తన నివాసంలో జరిగిన మంత్రులు, ఎంపీల సమావేశంలో చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసిన మర్నాడే కొలికపూడికి తాఖీదు జారీ అయింది.

రేపటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్టు వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించి పోస్టర్లు, కరపత్రాలను శనివారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి విడుదల చేశారు. 11 రోజుల పాటు పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశుయాజమాన్యంపై శాస్త్రీయ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు మంత్రి వివరించారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సులో మంటలు.. త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దగ్ధమైన బస్సు

ఉలవపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు వెళుతున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు శనివారం వేకువజామున అగ్ని ప్రమాదానికి గురయింది. ముందుగానే గుర్తించడంతో 19 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం మేరకు, శనివారం వేకువజామున ఉలవపాడు జాతీయ రహదారి మన్నేటికోట అడ్డరోడ్డు వద్దకు రాగానే డ్రైవర్ రాము బస్సు నిలిపి టీ తాగడానికి వెళ్లాడు. ఓ మహిళ బస్సు వెనుక భాగంలో పొగలు రావడం గమనించి పెద్దగా కేకలు వేసింది. ప్రయాణికులు అప్రమత్తమై కిందకు దిగగానే, అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. చూస్తుండగా బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా బస్సు దగ్ధమైందని ప్రయాణికులను మరో బస్సులో గమ్య స్థానాలకు చేర్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు మృతి

» 20 మందికి గాయాలు.. ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మినీ బస్



ప్రమాద దృశ్యం

గజపతినగరం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మదుపాడ గ్రామ సమీపంలో ఆగి ఉన్న లారీని మినీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బావనపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. 20 మంది గాయపడ్డారు. గజపతినగరం ఎస్ఐ కె.లక్ష్మణరావు కథనం మేరకు.. విశాఖ జిల్లా తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నేత్ర పరీక్షలు చేయించుకొనేందుకు ఒడిశా నుంచి సుమారు 40మంది శుక్రవారం రాత్రి బయలుదేరారు. బస్సు శనివారం వేకువజాము 3 గంటల సమయంలో విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మదుపాడ గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో మల్కన్‌గిరి జిల్లా బావనపల్లి గ్రామానికి చెందిన సుబ్రత్‌రాయ్(30), కుమార్తె మొహిక్‌రాయ్(3) అక్కడికక్కడే మృతి చెందారు. సుబ్రత్‌రాయ్ భార్య మీరారాయ్ సహా 20 మంది గాయపడ్డారు.





అటవీశాఖ అతిథిగృహం నుంచి పాడెపై రమేష్ కుమార్ మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం.. వెనుక భార్య, కుమార్తెలు

ఆయన ఎంతటివాడైతే నాకేంటి?
మృతదేహం ఇంటికి తేవద్దు.. అంతే!

» ఇంటి యజమాని ఆంక్షలు

» విధి నిర్వహణలో గుండెపోటుతో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మృతి

» అటవీశాఖ అతిథిగృహం నుంచే అంతిమ యాత్ర

గుంటూరు సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీశాఖ కీలక అధికారి విధి నిర్వహణలో గుండెపోటుతో మరణించగా, మృతదేహాన్ని ఇంటికి తీసుకునీయరాకుండా ఇంటి యజమాని అడ్డుకున్నారు. ఈ ఘటన కుటుంబసభ్యులు, బంధువులతోపాటు తోటి అధికారులను, సిబ్బందినీ తీవ్ర వేదనకు గురిచేసింది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇండియన్ ఫారెస్టు సర్వీసు అధికారి రమేష్ కుమార్ సుమన్(59) ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ మంగళగిరి సమీపంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆయన జీవిత కాలమంతా ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పరిరక్షణ కోసమే పాటుపడ్డారు. మడ అడవుల పెంపకం కోసం పగలూరాత్రి ప్రయాసపడ్డారు. రాష్ట్రంలోని అడవుల అభివృద్ధి, జీవవైవిధ్య పార్కులకు సంబంధించి శిక్షణ నిమిత్తం కొద్దిరోజుల క్రితం ఆయన కేరళలోని కొచ్చికి వెళ్లారు. అక్కడ శిక్షణలో ఉండగానే గుండెపోటుతో ఈ నెల 16న ఆయన మరణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శ్రద్ధాంజలి ఘటించారు. కొచ్చి నుంచి మృతదేహాన్ని మంగళగిరిలోని ఇంటికి తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, ఇంటి యజమాని అందుకు ఒప్పుకోలేదు. 'ఆయన ఎంతటివాడైతే నాకేంటి?' అని కరాఖండిగా చెప్పేశారు. దీంతో చేసేది లేక అధికారులు గుంటూరులోని అటవీశాఖ అతిథి గృహానికి మృతదేహాన్ని తరలించారు. కుటుంబ సభ్యులను, బంధువులను కూడా అతిథి గృహానికే రప్పించారు. అతిథి గృహం ఆవరణలోనే టెంటు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతదేహం వద్ద నిశ్చేష్టులుగా నిలబడిన రమేష్ భార్య, ఇద్దరు కుమార్తెల దీన స్థితిని చూసి అటవీశాఖ ఉద్యోగులు కన్నీటిపర్యంతమయ్యారు. శనివారం అక్కడి నుంచే అంతిమయాత్ర మొదలైంది. కృష్ణా నది సమీపంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రతి 100 మందిలో ఒకరికి 'క్యాన్సర్'!

» 53.07 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు

» 52,221 మంది క్యాన్సర్ అనుమానితులు

» 2019-20లో చికిత్స కోసం పెట్టిన ఖర్చు 217 కోట్లు

» 2023-24 నాటికి 624 కోట్లకు పెరిగిన ఖర్చు

» సంపూర్ణ నివారణే లక్ష్యంగా స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ సంపూర్ణ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తోంది. ఈ పరీక్షల్లో ప్రతి 100 మందిలో ఒకరు క్యాన్సర్ అనుమానితులుగా తేలారు. కార్యక్రమంలో ఇప్పటివరకూ 53,07,448 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 52,221 మంది క్యాన్సర్ అనుమానితులను ఆరోగ్యశాఖ గుర్తించింది. రాష్ట్రంలో గత ఏడాది నవంబరు 14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. పది నెలల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకూ 19,447 మంది నోటి క్యాన్సర్, 15,401 మంది రొమ్ము క్యాన్సర్, 17,373 మంది గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ అనుమానితులను ఆరోగ్య శాఖ గుర్తించింది. రాష్ట్రంలో ఏటా దాదాపు 40 వేల మందికి పైగా ఈ మహమ్మారికి బలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా క్యాన్సర్ చికిత్సలకు 2019-20లో రూ.217 కోట్లు ఖర్చు పెట్టగా 2023-24లో రూ.624 కోట్లకు పెరిగిందని ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఈ వ్యాధిని కట్టడి చేసేందుకు వీలుగా ప్రజలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 18 ఏళ్ల పైబడిన వారికి నోటి, రొమ్ము క్యాన్సర్, 30 సంవత్సరాలు పైబడిన మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ జరుగుతోంది. విస్తృత స్థాయిలో చేపడుతున్న స్క్రీనింగ్‌లో 155 మంది ప్రత్యేక వైద్యులు, 238 జిల్లా ఆసుపత్రుల నిపుణులు, 3,944 మంది వైద్యాధికారులు, 10,032 మంది సామాజిక ఆరోగ్య అధికారులు భాగస్వాములయ్యారు. ముందుగా ఆశా కార్యకర్తలు కరపత్రాలతో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఏఎన్ఎం, సీహెచ్‌వోలు... మహిళలు సర్వైకల్ పరీక్షలు చేయించుకొనేలా ప్రోత్సహించారు. ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రం స్థాయిలో జరిపే స్క్రీనింగ్‌లో వైద్యులు అనుమానిత కేసులను పరిశీలిస్తున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. అనుమానిత క్యాన్సర్ కేసులను ఉన్నతస్థాయి వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారు. ఇక్కడ, రోగ నిర్ధారణ కోసం వైరల్ మార్కర్స్‌తో పాటు మరిన్ని పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిర్ధారణ అయిన వారిని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌కు రిఫర్ చేస్తున్నారు. అంకాలజీ యూనిట్ స్థాయిలో సూపర్ స్పెషలిస్ట్ సమక్షంలో రోగ నిర్ధారణ, చికిత్స అందిస్తున్నారు. వివిధ దశల్లో జరిగే ఈ స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలందరూ ఉపయోగించుకొని, క్యాన్సర్ రహిత సమాజం కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి సహకారాన్ని అందించాలని ఆరోగ్య శాఖ అధికారులు పిలుపునిచ్చారు.

బతికుండగానే డెత్ సర్టిఫికెట్!

» భర్త తీరుపై టీడీపీ గ్రీవెన్స్‌లో భార్య ఫిర్యాదు



టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్సీ అశోక్‌బాబు

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అండతో తన స్థలంలోని ఇంటి గోడను కూలగొట్టడంపై ప్రశ్నించిన తనపైనే వైసీపీ గూండాలు దాడి చేశారని బాపట్ల జిల్లా గోకరాజునల్లిబోయిన వారిపాలేనికి చెందిన వెంకట్రావు హోం మంత్రి ఎదుట తన ఆవేదన వెళ్లబోసుకున్నారు. తనను కులం పేరుతో దూషిస్తున్నారని వాపోయారు. తనను కొట్టిన వారిపై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని కోరారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో హోంమంత్రి అనిత, ఎమ్మెల్సీ అశోక్‌బాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గుంటూరుకు చెందిన టి.మాధవి తాను బతికుండగానే తన భర్త చనిపోయినట్టు డెత్ సర్టిఫికెట్ సృష్టించి, తన పేరుతో ఉన్న స్థలాన్ని ఆయన అక్క పేరుమీదకు మార్చి, తన పిల్లలకు ఏ ఆధారమూ లేకుండా చేశాడని వాపోయింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. తన కుమారులు తనను పట్టించుకోవడం లేదని బాపట్ల జిల్లా కారుమూరివారిపాలేనికి చెందిన కె.విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. కుమారులకు తాను రాసిచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయాలని కోరారు. మురళీమోహన్‌రావు అనే వ్యక్తి.. తన ఆస్తి బ్యాంకులో ఉందని చెప్పి రూ.కోటిపైగా తీసుకుని, డాక్యుమెంట్లు తెచ్చి ఇవ్వమంటే ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని విజయవాడకు చెందిన రాజ్‌కుమార్ మొరపెట్టుకున్నారు. తన కుమార్తెను భర్త, బంధువులు హతమార్చి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, పోలీసులను మేనేజ్ చేసి, కేసును తప్పుదారి పట్టిస్తున్నారని నెల్లూరు రూరల్‌కు చెందిన చల్లా శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు చేశారు. తమ పొలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేసి, పొలంలోకి వెళ్లకుండా ఇబ్బంది పెడుతున్నారని తిరుపతి జిల్లా పాలమంగళంకు చెందిన ప్రమీలా రాణి వాపోయారు. 70ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇంటిని అధికారులు కూల్చే ప్రయత్నం చేస్తే.. కోర్టు స్టే ఆర్డర్ తెచ్చినా తహసీల్దార్ బలవంతంగా తమను బయటకు లాగి, ఇంటిని కూల్చి, తమకు నీడ లేకుండా చేసి, రూ.లక్షలు నష్టం చేశారని అన్నమయ్య జిల్లా గోరంచెర్వుకు చెందిన ఖాజాపీర్ గోడు వెళ్లబోసుకున్నారు.

వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లుండవ్

» 9 గంటల ఉచిత విద్యుత్తులో రాజీలేదు: మంత్రి గొట్టిపాటి

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంప్ సెట్లకు స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం బిగించబోదని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. వ్యవసాయానికి ఉచితంగా 9గంటల విద్యుత్తు సరఫరాలో ఎలాంటి రాజీ లేదని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'వైసీపీ అధ్యక్షుడు జగన్ నడుపుతున్న నీలి పత్రికలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకంపై అసత్య కథనాలు ప్రచురిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి అండగా నిలిచిన రైతాంగంలో అపోహలు సృష్టించాలని జగన్ ప్రయత్నిస్తున్నారు' అని మండిపడ్డారు. వాస్తవానికి వ్యవసాయ పంప్ సెట్లకు స్మార్ట్‌మీటర్లు బిగించి రైతుకు ఉరితాడు వేయాలని జగన్ చర్యలు చేపడితే .. కూటమి ప్రభుత్వం ఆ ఆలోచనను పూర్తిగా పక్కనపడేసిందని గొట్టిపాటి పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగిపోయింది అందుకే మొక్కు చెల్లించుకున్నా: ఎంపీ సీఎం రమేష్



తిరుమల ఆలయం ముందు సీఎం రమేష్

తిరుమల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వందశాతం ఆగిపోయిందని, అందుకే స్వామికి మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమలకు వచ్చానని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో తాను చాలా ఇంటర్వ్యూల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపడంతో పాటు ఆధునికీకరణకు కృషిచేస్తానని ప్రకటించానన్నారు. అనకాపల్లి సీటు వచ్చినప్పుడు ప్రైవేటీకరణను అడ్డుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే ప్రధాని మోదీ, అమిత్‌షా, నడ్డాతో మాట్లాడానన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ఇప్పటికే 36 మంది మరణించారని, ఇది ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమనే విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లానన్నారు. కేంద్ర క్యాబినెట్‌లో సానుకూలంగా నిర్ణయం తీసుకున్న క్రమంలో స్వామికి మొక్కులు చెల్లించానని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ మళ్లీ లాభాల బాటలో ముందుకు సాగి ఉపాధి అవకాశాలు కల్పించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

» ఒకేషనల్ ట్రైనర్ల నియామకాలపై సమగ్ర శిక్ష ఎస్పీడీ

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సుల బోధకుల (ఒకేషనల్ ట్రైనర్లు) నియామకాల కోసం దళారులకు డబ్బులిచ్చి మోసపోవద్దని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు అభ్యర్థులకు సూచించారు. ఈ నియామకాలను థర్డ్ పార్టీ ఏజెన్సీలైన ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్ నిర్వహిస్తున్నారని, ఈ పోస్టులు పరిమిత కాలం మాత్రమే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఇవి సమగ్ర శిక్షాలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పోస్టులు కావని తెలిపారు. ఈ నియామకాలు ప్రతిభ ఆధారంగా, పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ నిర్వహించాలని, అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేయకూడదని ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్‌కు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

మారీచులతో జాగ్రత్త!

అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో తెలుగుదేశం–బీజేపీ–జనసేన చేయి చేయి కలిపి నడవడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకుని బలపడాలంటే కేంద్ర సహకారం పూర్తిగా అవసరం. ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువిడుపులతో వ్యవహరిస్తున్నారు. కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నారు. ఫలితంగా రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చింది. తాజాగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టడానికి 11 వేల కోట్లకు పైగా ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు కూడా సజావుగా పూర్తికావడానికి అవసరమైన ఆర్థిక సహాయం చేయడానికి కేంద్రం ముందుకు వచ్చింది. ఈ మూడు అంశాలకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉదారంగా వ్యవహరించారని చెప్పవచ్చు. కేంద్రంలో మోదీ సర్కార్ మూడవ పర్యాయం అధికారం చేపట్టడంలో తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకం. అలా అని తనకు లభించిన

> **తెలుగుదేశం పార్టీకి లోక్‌సభలో 16 మంది సభ్యులు ఉన్నారు. ఈ మాత్రం సంఖ్యా బలాన్ని సమకూర్చుకోవడం మోదీ ప్రభుత్వానికి కష్టం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకునే చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి తన విధేయతను ప్రకటించారు. ప్రస్తుతానికి చంద్రబాబు అవసరం ప్రధాని మోదీకి, మోదీ అవసరం చంద్రబాబుకు ఉంది. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నందున మూడు పార్టీల మధ్య సఖ్యత సజావుగా సాగుతోంది. ఈ సఖ్యత మునుముందు కూడా ఇలాగే కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించవచ్చు. ఇప్పుడు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కూడా భారీ ఆర్థిక ప్యాకేజీ లభిస్తున్నందున ఇందులో సందేహపడాల్సింది ఏమీ లేదు. అయితే ఈ సఖ్యతను చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్న శక్తులను విస్మరించకూడదు.**

అవకాశాన్ని కేంద్రంపై పెత్తనం చేయడానికి కాకుండా రాష్ట్రానికి ప్రయోజనాలు పొందడానికి ఉపయోగించాలని చంద్రబాబు నిర్ణయించుకోవడం ఆయన పరిపక్వతకు నిదర్శనం. గతంలో కేంద్రంతో విభేదించినందున ఏం జరిగిందో ఆయనకు తెలుసు కనుక వాజపేయి సర్కారుకు బేషరతుగా మద్దతు ఇచ్చినట్టుగానే ఇప్పుడు మోదీ సర్కారుకు కూడా మద్దతు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి లోక్‌సభలో 16 మంది సభ్యులు ఉన్నారు. ఈ మాత్రం సంఖ్యా బలాన్ని సమకూర్చుకోవడం మోదీ ప్రభుత్వానికి కష్టం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకునే చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వానికి తన విధేయతను ప్రకటించారు. ప్రస్తుతానికి చంద్రబాబు అవసరం ప్రధాని మోదీకి, మోదీ అవసరం చంద్రబాబుకు ఉంది. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నందున మూడు పార్టీల మధ్య సఖ్యత సజావుగా సాగుతోంది. ఈ సఖ్యత మునుముందు కూడా ఇలాగే కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించవచ్చు. ఇప్పుడు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కూడా భారీ ఆర్థిక ప్యాకేజీ లభిస్తున్నందున ఇందులో సందేహపడాల్సింది ఏమీ లేదు. అయితే ఈ సఖ్యతను చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్న శక్తులను విస్మరించకూడదు. పొత్తులో ఉన్న భాగస్వామ్య పార్టీలు సొంతంగా ఎదగాలని ప్రయత్నించడం సహజం. ఈ ప్రయత్నంలో భాగస్వామ్య పక్షాల మధ్య పొరపొచ్చాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయి. భాగస్వామ్య పక్షాల మధ్యనే కాదు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య అపోహలు సృష్టించే ప్రయత్నాలు కూడా జరుగుతాయి. 2019కి పూర్వం చంద్రబాబు ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణం కోసమే డబ్బంతా ఖర్చు చేస్తోందని ప్రచారం చేసి ఇతర ప్రాంతాల ప్రజల్లో అమరావతిపై వ్యతిరేకతను పెంచారు. ఇప్పుడు మళ్లీ అవే ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. వివిధ రూపాలలో ఉన్న మారీచులు రాజధాని అమరావతిపై విషం చిమ్మడం మొదలుపెట్టారు. లక్ష కోట్లతో రాజధాని నిర్మించడం అవసరమా? అని అసంబద్ధ వాదనలు మళ్లీ తెర మీదకు తెస్తున్నారు. ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ఏమిటి? అని విష ప్రచారాన్ని మళ్లీ మొదలెట్టారు. ఈ క్రమంలో వాస్తవాలకు పాతర వేస్తున్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర బడ్జెట్ నుంచి ఒక్క పైసా కూడా కేటాయించలేదు. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పూలింగ్ కింద ఇచ్చిన భూములే పెట్టుబడిగా అమరావతి నిర్మాణం జరుగుతోంది. ఇప్పుడు కేంద్రం కూడా పది వేల కోట్లకు పైగా గ్రాంట్‌గా ఇవ్వబోతోంది. తన నిర్మాణానికి అవసరమైన నిధులను తానే సమకూర్చుకోగల శక్తి రాజధాని అమరావతికి ఉంది. ఈ మోడల్‌ను రూపొందించిన చంద్రబాబును అభినందించాల్సిందే. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను అంతర్జాతీయ కంపెనీలకు కేటాయించడం ద్వారా సైబరాబాద్ నగరానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తదుపరి ముఖ్యమంత్రులు కూడా అదే పని చేశారు. ఫలితంగా ఇప్పుడు హైదరాబాద్ దేశంలోనే అతి పెద్ద నగరాలలో ఒకటిగా నిలబడింది. ఈ నగరం వల్ల వస్తున్న ఆదాయంతోనే తెలంగాణలోని ఇతర జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయగలుగుతోంది. భవిష్యత్తులో అమరావతి కూడా హైదరాబాద్ స్థాయిలో కాకపోయినా గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అప్పుడు ఆ ఫలాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలూ అనుభవిస్తారు. మూడు రాజధానులు అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రానికి చేసిన నష్టం ఎంతో అందరికీ తెలిసిందే. కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేస్తానని ప్రకటించి విశాఖపట్టణాన్ని చెరబట్టారు. ప్రైవేట్ కంపెనీలు, సంస్థలను హస్తగతం చేసుకున్నారు. భూములు కొల్లగొట్టారు. ఇప్పుడు రాజధాని అమరావతిలో కబ్జాలకు తావుండదు. ప్రతి సెంటు భూమికీ పక్కాగా లెక్క ఉంటుంది. భూములు ఇచ్చిన రైతులకు పద్ధతి ప్రకారం ప్లాట్లు కేటాయిస్తున్నారు. మిగిలిన భూమిని గ్యారంటీగా చూపించి నిధులు సమకూర్చుకొని నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నారు. రాజధానిపై విషం చిమ్ముతున్న వారికి ఈ విషయం తెలియదా? తెలిసి కూడా విష ప్రచారం చేస్తున్నారంటే రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారనే భావించాలి. ఆర్థిక భారం లేనప్పుడు రాజధాని ఎలా ఉండాలో చెప్పే అధికారం వారికి ఏముంటుంది? పెద్ద నగరాన్ని నిర్మించడం వల్ల రాష్ట్ర ప్రజలపై భారం పడనప్పుడు ఈ మారీచులకు కడుపుమంట ఎందుకు? రాష్ట్రం విడిపోయి పదేళ్లు దాటింది. ఇప్పటికీ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోవాల్సి రావడాన్ని మించిన విషాదం ఏమిటి? అమరావతి నిర్మాణానికి అడ్డుపుల్లలు వేస్తున్నవారి అంతరంగాన్ని రాష్ట్ర ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలి. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమం అందాలన్నా మహా నగరాల నుంచి లభించే ఆదాయమే ప్రధానం. అమరావతి నిర్మాణం కోసం ఖర్చు చేసే ప్రతి పైసా నుంచి ప్రభుత్వానికి 20 శాతం వరకు పన్నుల రూపంలో వెనక్కు వస్తోంది. రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిర్మితమవుతున్న నగరాన్ని అడ్డుకునే వారు ఎవరైనా ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పాలి. ఈ కుటిల యత్నాలను తిప్పికొట్టని పక్షంలో కేంద్ర సహకారం ఉన్నా రాష్ట్రం బలపడలేదు. ఇదివరకు ఒకసారి మాయలో పడి నష్టపోయారు. మళ్లీ అదే పొరపాటు చేయవద్దు. తస్మాత్ జాగ్రత్త!

> **గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమం అందాలన్నా మహా నగరాల నుంచి లభించే ఆదాయమే ప్రధానం. అమరావతి నిర్మాణం కోసం ఖర్చు చేసే ప్రతి పైసా నుంచి ప్రభుత్వానికి 20 శాతం వరకు పన్నుల రూపంలో వెనక్కు వస్తోంది.**



> **రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పూలింగ్ కింద ఇచ్చిన భూములే పెట్టుబడిగా అమరావతి నిర్మాణం జరుగుతోంది. ఇప్పుడు కేంద్రం కూడా పది వేల కోట్లకు పైగా గ్రాంట్‌గా ఇవ్వబోతోంది. తన నిర్మాణానికి అవసరమైన నిధులను తానే సమకూర్చుకోగల శక్తి రాజధాని అమరావతికి ఉంది. ఈ మోడల్‌ను రూపొందించిన చంద్రబాబును అభినందించాల్సిందే. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను అంతర్జాతీయ కంపెనీలకు కేటాయించడం ద్వారా సైబరాబాద్ నగరానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తదుపరి ముఖ్యమంత్రులు కూడా అదే పని చేశారు. ఫలితంగా ఇప్పుడు హైదరాబాద్ దేశంలోనే అతి పెద్ద నగరాలలో ఒకటిగా నిలబడింది. ఈ నగరం వల్ల వస్తున్న ఆదాయంతోనే తెలంగాణలోని ఇతర జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయగలుగుతోంది. భవిష్యత్తులో అమరావతి కూడా హైదరాబాద్ స్థాయిలో కాకపోయినా గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అప్పుడు ఆ ఫలాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలూ అనుభవిస్తారు.**

రేవంత్ 'ఫార్ములా' ఏమిటో..!

ఇప్పుడు తెలంగాణ విషయానికి వద్దాం. ఫార్ములా–ఈ రేసు కంపెనీ కేసులో ఏమి జరగబోతోంది? మాజీ మంత్రి కేటీఆర్ ఈ కేసులో ఇరుక్కున్నారా? ఆయనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తుందా? చేస్తే ఎప్పుడు? ఇదే కేసులో మరో నిందితుడిగా ఉన్న హెచ్ఎండీఏ మాజీ కమిషనర్ అర్వింద్ కుమార్ అప్రూవర్‌గా మారబోతున్నారా? తెలంగాణలో గత కొన్ని వారాలుగా ఈ ప్రశ్నలు చక్కర్లు కొడుతున్నాయి. కేటీఆర్‌ను ఇప్పుడు అరెస్టు చేస్తారు.. అప్పుడు అరెస్టు చేస్తారు అని మీడియాలో ఊహాగానాలు చేస్తున్నారు. అయితే కేసు మాత్రం జీడి పాకంలా సాగుతోంది. ఫార్ములా–ఈ వ్యవహారంలో కేటీఆర్ అడ్డంగా బుక్కయ్యారని ప్రభుత్వ వర్గాలు చెబుతుండగా, అసలు అవినీతే జరగనప్పుడు కేసు ఎక్కడ ఉంది? అని కేటీఆర్ ఎదురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎంత బలంగా తన వాదన వినిపిస్తున్నదో.. కేటీఆర్ కూడా అంతే బలంగా తన వాదన వినిపిస్తున్నారు. దీంతో అసలు ఇందులో కేసు ఉందా? ఉంటే కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు? అన్న అనుమానాలు ఏర్పడుతున్నాయి. ఫార్ములా–ఈ వ్యవహారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలగా ఉన్నారు. ఈ వ్యవహారంలో కేటీఆర్‌పై కేసు కట్టి విచారణ చేయడానికి అనుమతి ఇవ్వవలసిందిగా గవర్నర్ జిష్ణుదేవ్‌కు ప్రభుత్వం ఫైల్ పంపింది. ప్రభుత్వం అడిగింది కదా అని గవర్నర్ వెంటనే అనుమతి ఇవ్వలేదు. మొత్తం ఫైల్‌ను కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు పంపి అభిప్రాయం చెప్పవలసిందిగా గవర్నర్ కోరారు. తుషార్ మెహతా సూచన మేరకు కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి అప్పటి అధికారులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డితో పాటు కేటీఆర్‌ను కూడా విడివిడిగా విచారించారు. ఏసీబీ కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కేసు నమోదు చేసుకొని ఈ ముగ్గురినీ విచారించారు. ఈ విచారణలో ఏం తేలింది? కేటీఆర్‌ను కేసులో ఇరికించే ఆధారాలు లభించాయా? లేదా? అన్నది సస్పెన్స్‌గానే ఉంది. ప్రభుత్వం చెల్లించిన 55 కోట్లు తమకు అందాయని ఫార్ములా–ఈ కంపెనీ అంగీకరిస్తున్నందున ఇందులో అవినీతి జరిగిందని ఎలా చెబుతారు? అని తాను విచారణ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు కేటీఆర్ చెబుతున్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో కేసీఆర్ సర్కార్ రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయించి ఇబ్బందుల పాల్జేసింది. నాడు తనను వేధించినందుకు ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చినందున ఫార్ములా–ఈ రేసు కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేస్తారన్న అభిప్రాయం బలంగా వ్యాపించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టు కూడా కొట్టివేశాయి. ఈ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని హైకోర్టు కొంత కాలంపాటు ఆయనకు రక్షణ కల్పించింది. దీంతో పిటిషన్లు డిస్మిస్ అయిన తర్వాత ఆయనను అరెస్టు చేస్తారని అందరూ భావించారు. ఇలాంటి కేసులలో నిందితులు వెంటనే హైకోర్టుకు వెళ్లి బెయిలు కోరే అవకాశం లేకుండా శుక్రవారంనాడు అరెస్టు చేయడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలో హైకోర్టుకు సంక్రాంతి సెలవులు ప్రారంభమైనప్పుడు కేటీఆర్‌ను అరెస్టు చేస్తారని భావించారు. సెలవులు ముగిశాయి. కేటీఆర్ ఈడీ విచారణకు కూడా వెళ్లి వచ్చారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఎప్పుడైనా కేటీఆర్‌ను అరెస్టు చేయవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆయన లండన్ పర్యటనకు వెళ్లిన తర్వాత చంద్రబాబును అరెస్టు చేశారు. దీంతో సదరు అరెస్టుతో తనకు సంబంధం లేదని, చట్టం తన పని తాను చేసిందని, పోలీసులు చట్ట ప్రకారం చంద్రబాబును ఎత్తారని జగన్‌రెడ్డి అప్పుడు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీంతో తెలంగాణలో ఈ సంఘటనను గుర్తుచేసుకొని ప్రస్తుతం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నందున కేటీఆర్‌ను కూడా రేపో మాపో అరెస్టు చేస్తారని ప్రచారం మొదలైంది. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లి రెండు రోజులు దాటింది. దీంతో అసలు కేటీఆర్ అరెస్టు ఉంటుందా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ప్రభుత్వం కేటీఆర్‌ను అరెస్టు చేయిస్తే రాజకీయంగా తమకు లాభిస్తుందని భారత రాష్ట్ర సమితి నాయకులు మరోవైపు లెక్కలు వేసుకుంటున్నారు. కేటీఆర్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనసులో ఏముందో తెలియడం లేదు. ఆయన గుంభనంగా ఉంటున్నారు. మంత్రులు మాత్రం జైలుకు వెళ్లడానికి కేటీఆర్ సిద్ధంగా ఉండాలని అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. దీంతో మొత్తం వ్యవహారం ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్టుగా తయారవుతోంది.

'క్విడ్ ప్రో కో'లో బలమెంత?

కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు కేసులు కట్టి నెల రోజులు అయిపోయినా తదుపరి చర్యలు లేకపోవడంతో అసలు కేసులో బలం ఉందా? అన్న అనుమానాలు సహజంగానే తలెత్తుతాయి. సంబంధిత ఫైలును సొలిసిటర్ జనరల్ క్షుణ్ణంగా పరిశీలించి ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వవచ్చునని గవర్నర్‌కు సూచించినందున కేసులో బలం లేకుండా ఉంటుందా? అనే అనుమానం కూడా అదే సమయంలో ఉత్పన్నమవుతోంది. అవినీతి జరిగింది అనడానికి తగిన ఆధారాలు లేకపోతే ప్రభుత్వం ఇంత హడావిడి ఎందుకు చేస్తుంది? కేటీఆర్‌ను అరెస్టు చేయలేని పరిస్థితి ఉంటే ప్రభుత్వం అభాసుపాలవుతుంది కదా! ఈ నేపథ్యంలో కేసు పూర్వాపరాల్లోకి వెళదాం. ఫార్ములా–ఈ రేసు నిర్వహణకు తొలుత త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఫార్ములా–ఈ కంపెనీతో పాటు గ్రీన్‌కో కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్నవారు ఏర్పాటు చేసిన ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ, ప్రభుత్వం ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. కారు రేసు నిర్వహణ కోసం తగిన రోడ్లను అభివృద్ధి చేయడం, ఇతర ఏర్పాట్లను చేయడం మాత్రమే ప్రభుత్వం బాధ్యత. రేసు నిర్వహణకు అయ్యే ఖర్చును ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ భరించాలి. ఈ ఖర్చును రాబట్టుకోవడం కోసం స్పాన్సర్స్‌ను వెదుక్కోవడం కూడా ఏస్ నెక్స్‌జెన్ బాధ్యత. అయితే స్పాన్సర్లు లభించకపోవడంతో ఏస్ నెక్స్‌జెన్ నష్టపోయింది. దీంతో ఫార్ములా–ఈ కంపెనీకి ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన సొమ్మును ఈ కంపెనీ చెల్లించలేదు. ఈ క్రమంలో త్రైపాక్షిక ఒప్పందం అమలులో ఉండగానే ఫార్ములా–ఈ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యవహారంలో ఇది మొదటి తప్పు. ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం హెచ్ఎండీఏ ద్వారా 55 కోట్లు ఫార్ములా–ఈ కంపెనీకి చెల్లించింది. ఈ చెల్లింపుల విషయంలో హెచ్ఎండీఏ పాలక మండలి ఆమోదం పొందలేదు. పాలక మండలి చైర్మన్‌గా ముఖ్యమంత్రి ఉంటారు. అదే సమయంలో ఆర్థిక శాఖ అనుమతి కూడా పొందలేదు. మున్సిపల్ శాఖ ఒప్పందం కుదుర్చుకుంటే హెచ్ఎండీఏ ఎందుకు డబ్బులు చెల్లించాల్సి వచ్చిందనేది మరో ప్రశ్న. ఇవన్నీ పాలనాపరమైన లోపాలు. నిబంధనలు, బిజినెస్ రూల్స్ పాటించకపోవడం వల్ల ఇదంతా జరిగింది. నాటి మంత్రి కేటీఆర్ మౌఖికంగా ఆదేశించడంతో తాము చెల్లింపులు చేశామని నిందితులైన అధికారులు విచారణ అధికారుల వద్ద చెప్పారు. ఇదే నిజమైతే మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌ను ఈ కేసులో ఇరికించడం కష్టం. మంత్రులు, ఆ మాటకొస్తే ముఖ్యమంత్రి.. నోటి మాటగా ఎన్ని చెప్పినా నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత అధికారులదే. ముఖ్యమంత్రి లేదా మంత్రులను సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తే అందుకు బాధ్యులైన అధికారులే మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఫార్ములా–ఈ కంపెనీకి డాలర్ల రూపంలో చెల్లించినందున ఫెమా చట్టం వర్తిస్తుంది. డాలర్ల చెల్లింపులో నిబంధనలు పాటించలేదన్నది మరో ఆరోపణ. ఈ కారణంగానే ఈడీ రంగంలోకి దిగింది. సవరించిన చట్టాల ప్రకారం విదేశాలలో చెల్లింపులు చేయాలంటే అందుకు సంబంధించిన పత్రాలు సవ్యంగా ఉన్నాయా? లేవా? అని బ్యాంకులు నిర్ధారించుకోవాలి. ప్రైవేటు కంపెనీలు విదేశీ మారకద్రవ్య రూపంలో చెల్లింపులు చేయాలన్నా కూడా బ్యాంకులు అన్ని పత్రాలనూ పరిశీలించిన మీదటే సొమ్ము బదలాయిస్తాయి. ఈ లెక్కన చూసుకుంటే విదేశీ మారకద్రవ్యం చెల్లింపుల్లో అవకతవకలు జరిగి ఉంటే అందుకు సంబంధిత బ్యాంకులు లేదా ఆథరైజ్డ్ బ్యాంక్ బ్రాంచీలు బాధ్యత తీసుకోవాలి. ఈ కారణంగానే హైదరాబాద్ ఇమేజ్‌ను కాపాడటం కోసం తాను చెల్లింపులు చేయాల్సిందిగా ఆదేశించానని, అయితే నిబంధనల ప్రకారం చేయడం అధికారుల బాధ్యత అని కేటీఆర్ సమర్థించుకుంటున్నారు. ఫార్ములా–ఈ కంపెనీకి లభించిన సొమ్ము తిరిగి తనకు వేరే రూపంలో అందినట్టు ఆధారాలు లేనప్పుడు అవినీతి కేసు ఎక్కడిదని కేటీఆర్ దబాయిస్తున్నారు. అయితే ప్రభుత్వం వాదన మరో విధంగా ఉంది. త్రైపాక్షిక ఒప్పందంలో భాగస్వామిగా ఏస్ నెక్స్‌జెన్ కంపెనీని ఎంపిక చేయడంలో కూడా అవకతవకలు జరిగాయని, కేవలం రెండు లక్షల ఈక్విటీతో ప్రారంభించిన కంపెనీ ఒక్క సీజన్‌కు 200 కోట్లు చెల్లించగలదని ఎలా నిర్ణయించారు? ఈ విషయంలో అప్పటి మంత్రి కేటీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెబుతోంది. ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ భాగస్వాములు అందరూ కేటీఆర్‌కు వ్యక్తిగతంగా సన్నిహితులు అని, వారిని కాపాడడానికే త్రైపాక్షిక ఒప్పందం అమలులో ఉండగానే ద్వైపాక్షిక ఒప్పందాన్ని తెర మీదకు తెచ్చారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రేసు విషయంలో ఏస్ నెక్స్‌జెన్‌ను భాగస్వామిని చేయడానికి అంగీకరించినందునే గ్రీన్‌కో కంపెనీ నుంచి బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు అందాయని ప్రభుత్వం చెబుతోంది. మొత్తం 41 కోట్ల రూపాయలను బాండ్ల రూపంలో గ్రీన్ కో కంపెనీ భారత రాష్ట్ర సమితి ఖాతాలో జమ చేసింది. ఇది క్విడ్ ప్రో కో కిందికే వస్తుందని ప్రభుత్వం వాదిస్తోంది. ఫార్ములా–ఈ కంపెనీ నుంచి కేటీఆర్‌కు నేరుగా ముడుపులు ముట్టకపోయినా క్విడ్ ప్రో కో రూపంలో గ్రీన్‌కో కంపెనీ నుంచి బీఆర్ఎస్ పార్టీకి నిధులు అందినందున కేటీఆర్ అవినీతికి, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టేనని ప్రభుత్వ వర్గాల అభిప్రాయంగా ఉంది. ఈ వాదనలో హేతుబద్ధత ఉన్నప్పటికీ న్యాయ సమీక్షలో

> **ఫార్ములా–ఈ వ్యవహారంలో కేటీఆర్‌పై కేసు కట్టి విచారణ చేయడానికి అనుమతి ఇవ్వవలసిందిగా గవర్నర్ జిష్ణుదేవ్‌కు ప్రభుత్వం ఫైల్ పంపింది. మొత్తం ఫైల్‌ను కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు పంపి అభిప్రాయం చెప్పవలసిందిగా గవర్నర్ కోరారు. తుషార్ మెహతా సూచన మేరకు కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి అప్పటి అధికారులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డితో పాటు కేటీఆర్‌ను కూడా విడివిడిగా విచారించారు. ఏసీబీ కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కేసు నమోదు చేసుకొని ఈ ముగ్గురినీ విచారించారు. ఈ విచారణలో ఏం తేలింది? కేటీఆర్‌ను కేసులో ఇరికించే ఆధారాలు లభించాయా? లేదా? అన్నది సస్పెన్స్‌గానే ఉంది.**

నిలబడుతుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. కేసులో మొదటి భాగమైన చెల్లింపులు, నిబంధనల ఉల్లంఘనలో కేటీఆర్‌ను నేరుగా ఇరికించడం సాధ్యమా? అన్న సందేహం కలుగుతోంది. మౌఖిక ఆదేశాలు ఇచ్చినంత మాత్రాన నేరుగా బాధ్యులను చేయలేమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో అంతా ఒక పథకం ప్రకారం జరిగిందని ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ ఎంపికకు, భారత రాష్ట్ర సమితికి సంబంధం ఉందని, ఇందులో క్విడ్ ప్రో కో జరిగిందని రుజువు చేయగల పరిస్థితి ఉంటేనే కేటీఆర్‌ను కేసులో ఇరికించవచ్చు. ఈ కారణంగానే కేటీఆర్ అరెస్టులో జాప్యం జరుగుతూ ఉండవచ్చు. కేటీఆర్ తప్పు చేశారని నిరూపించడానికి అవసరమైన బలమైన ఆధారాలు సేకరించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలన్న ఆలోచనలో ఏసీబీ అధికారులు ఉన్నట్టు చెబుతున్నారు. త్రైపాక్షిక ఒప్పందం గడువు ముగియక ముందే ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఏస్ నెక్స్‌జెన్ కంపెనీకి భారీ ఉపశమనం కలిగించడం తప్పిదమే. ఈ కంపెనీ బదులు హెచ్ఎండీఏ ద్వారా చెల్లింపులు చేయడం కూడా నేరమే. అయితే ఈ రెండు సందర్భాలలో కేటీఆర్‌కు ప్రత్యక్ష సంబంధం ఉందని రుజువు చేయాల్సి ఉంటుంది. అధికారులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి మాత్రం కచ్చితంగా ఇరుక్కుంటారు. ఇక కేటీఆర్ కూడా ఇరుక్కుంటారా? ఆయన అరెస్టు అవుతారా? అన్నవి ప్రస్తుతానికి శేష ప్రశ్నలు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనను ముగించుకొని వచ్చేసరికి ఏమి జరుగుతుందో చూద్దాం!

భారతీయులమన్న భావనే భవితకు భరోసా

ప్రజలందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతాయి. రాజ్యాంగ విలువలు నిలుస్తాయి. పాలకుల ఆకర్షణీయ నినాదాల మాటున సృష్టిస్తున్న అడ్డంకులను ఛేదించి, ఒక్కటిగా సాగడమే మెరుగైన భారత్ నిర్మాణానికి అవసరం.

కలసి ఉంటే కలదు సుఖం, ఐకమత్యమే మహా బలం వంటివి ప్రాచుర్యం పొందిన నినాదాలు. "చెట్టా పట్టాల్ కట్టుకుని దేశస్థులంతా నడవవలెనోయ్" అన్నాడు గురజాడ. 'ఆవాజ్ దో– హమ్ ఏక్ హై' అనే నినాదం శ్రామికులు ఇస్తూ ఉంటారు. దీనర్థం మేమంతా ఒక్కటే అని గట్టిగా నినదించడం. ఇటువంటివన్నీ దేశ ప్రజలలో ఐక్యతభావాన్ని పెంపొందించి, దేశాన్ని ముందుకు నడిపించే నినాదాలు. ఇటువంటి ఐక్యతే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించింది.

ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఒక నినాదం ఇచ్చారు. అదేమిటంటే 'ఏక్ హైతో సేఫ్ హై'. దీనర్థం– ఒకటిగా ఉంటే సురక్షితంగా ఉంటామని. ఇది కూడా పైకి మంచి నినాదంలానే కనపడుతుంది. కానీ దేశ ప్రజలను విడగొట్టడమే ఈ నినాదం లక్ష్యం. హిందువులందరూ ఒకటిగా ఉండాలి అనే రెచ్చగొట్టే నినాదమిది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మరో అడుగు ముందుకు వేసి 'బటేంగే తో కటేంగే' (విడిపోతే నాశనం అవుతాం) అన్నారు. హిందువుల్లో భయాలను కల్పించడం ఈ నినాదం ఉద్దేశం.

నిజంగా వీరికి హిందువులందరినీ ఏకం చేసే ఉద్దేశం ఉంటే డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చెప్పినట్టు దేశంలో కుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి. అలాగే పురుషులతో సమానమైన హక్కులు ఆచరణలో మహిళలకు ఉండాలి. ఈ రెండూ లేకుండా ఏకం చేయడం అసాధ్యం. మనదేశంలో నేడున్న కుల వ్యవస్థకు పునాది వర్ణ వ్యవస్థ. శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధిస్తున్న పురోగతి గానీ, ఆర్థికాభివృద్ధి వంటివి గానీ ఈ కుల వ్యవస్థను నిర్మూలించలేకపోయాయి. మన దేశాన్ని పాలించిన స్థానిక పాలకులు, తరువాత వచ్చిన మొగలులు, యూరోపియన్ పాలకులు దేశంలో అనేక మార్పులు ప్రవేశపెట్టినా ఎవరూ కూడా ఈ కుల వ్యవస్థను తాకలేకపోయారు. ప్రజలను పుట్టుకతోనే వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా విభజించే ఈ కుల వ్యవస్థ భారతదేశ సనాతన ధర్మంలో భాగం. ఎన్నికలలో గెలుపునకు బ్రహ్మాస్త్రంలా సోషల్ ఇంజనీరింగ్ అనే నేటి రాజకీయ నేతల ప్రోద్బలంతో మరింత బలోపేతమయ్యే దిశలో సాగుతోంది. తాజాగా అస్సాం ముఖ్యమంత్రి మూడు అగ్రవర్ణాల సేవకే శూద్రులు అని బహిరంగంగానే కుండబద్దలు కొట్టారు. ఇటీవల వీరు 'కులం ఇంట్లోనే– బయటకొస్తే హిందువులం' అనే కొత్త నినాదం ఇచ్చారు. ఇది కులవ్యవస్థను మతం ముసుగులో కప్పిపుచ్చడానికే. వాస్తవంగా 'ఇంట్లోనే మతం– బయటకొస్తే మనమంతా భారతీయులం' అనే భావనే దేశానికి రక్షగా నిలుస్తుంది.

దీనితో పాటే మన దేశంలో మరొక అతిపెద్ద సామాజిక రుగ్మత మహిళల పట్ల వివక్షత. 'ప్రపంచ ఆర్థిక నివేదిక 2024' ప్రకారం లింగ వివక్షత సూచీలో 144 దేశాలకు గాను మన దేశ స్థానం 127. మన పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్ వంటివి లింగ సమానత్వంలో మన కంటే మెరుగ్గా ఉన్నాయి. 'జార్జిటౌన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఉమెన్' సంస్థ నివేదిక ప్రకారం శాంతి, సంరక్షణ వంటి అంశాలలో మన దేశం 128వ స్థానంలో నిలిచింది. మహిళలపై లైంగిక హింస, వేధింపులు, అక్రమ రవాణా వంటి అంశాలలో ఆసియా ఖండంలో ప్రమాదకర దేశం ఇండియా అని ఆ నివేదిక పేర్కొంది. పురిట్లోనే ఆడ శిశువులను చంపేసిన చరిత్రా మనకుంది. వరకట్న దురాచారం నేటికీ కొనసాగుతూనే ఉంది. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళల పట్ల సమానత్వం సాధించకుండా 'ఏక్ హైతో సేఫ్ హై' అనే నినాదం ఎలా సాధ్యమవుతుంది?

నేడు మహిళల మీద అత్యాచారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ అత్యాచారాలకు పాల్పడుతున్నది అత్యధికంగా ఆ మహిళలకు సన్నిహితంగా ఉన్నవారే. అంటే మోదీ చెప్పిన ఏక్ హై అనేది వీరికి పూర్తిగా వర్తిస్తుంది. అయితే మహిళకు మాత్రం మోదీ చెప్పిన సేఫ్ అంటే రక్షణ మాత్రం లేకుండా పోయింది. ఆశ్చర్యకరంగా ఈ నినాదాలిచ్చిన వారే ఇటువంటి రాబందుల కొమ్ము కాస్తున్నారు. అందువల్ల మహిళా సమానత్వం, మనుధర్మవాదుల ద్వారా సాధ్యం కాదు. అసలు సనాతనమంటేనే సమానత్వానికి వ్యతిరేకం. "మహిళలకు పురుషులపై అధిపత్యం ఉండనక్కర లేదు– వారిపై వారికి ఉంటే చాలు" అన్నారు మేరీ వోల్‌స్టోన్‌క్రాఫ్ట్ అనే 18వ శతాబ్దపు ప్రముఖ బ్రిటిష్ తత్వవేత్త. నేడు మన దేశంలో సరిగ్గా అదే కరువైంది.




మనుధర్మానికి పునాది అయిన ప్రజలను చీల్చి ఉంచే కుల వ్యవస్థను, మహిళల పట్ల వివక్షతను పెంచి పోషిస్తూ... మరోపక్క ఏకం కండి అనే నినాదం ఇవ్వడం... విద్వేషపూరిత, రాజకీయ ప్రయోజనాలతో కూడుకున్నదే. మతం పేరున ప్రజలను మభ్యపెట్టి నిరుద్యోగం, పేదరికం, అసమానతలు, ధరల పెరుగుదల, మహిళలపై అత్యాచారాలు, విద్వేష దాడులు, తెగల మధ్య చిచ్చులు వంటి సమస్యల నుంచి ప్రజలను పక్కదారిపట్టించడానికే ఈ నినాదం. "ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు" అన్నది లెనిన్ చెప్పిన అక్షర సత్యం.

మోదీ చెప్పిన కోణం నుంచి కాకుండా మరో కోణం నుంచి చూస్తే ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న సకల సమస్యల పరిష్కారానికి అదే నినాదం ఉపయోగపడుతుంది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలందరూ ఐక్యమైతేనే నేటి దేశ సమస్యలను పరిష్కారం చేసుకోగలం. రైతులందరూ ఐక్యంగా ఉద్యమిస్తేనే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర సాధించుకోవచ్చు. కార్మికులందరూ ఐక్యంగా పోరాడితేనే హక్కులు నిలుపుకోవడం, దేశ సంపదను, ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవచ్చు. దేశ ప్రజలందరూ ఐక్యంగా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తేనే ఉపాధి లేమి, ఆర్థిక అసమానతలు, దారిద్ర్యం వంటి సమస్యల పరిష్కారం సాధ్యమవుతుంది. కుల మతాలకతీతంగా ప్రజలందరూ చైతన్యం ప్రదర్శిస్తేనే మహిళల పట్ల వివక్షత, అత్యాచారాలు నిలవరించగలం. గొప్ప సామాజిక చైతన్యం, సోదరభావం పెంపొందిస్తేనే కుల వ్యవస్థ నిర్మూలించడం సాధ్యం. వాస్తవంగా ఇటువంటి ఐక్యత మన స్వాతంత్ర్యోద్యమ వారసత్వం. ప్రజలందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతాయి. రాజ్యాంగ విలువలు పరిరక్షించబడతాయి. ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించకపోతే, ప్రభుత్వం నేడు ప్రజలపై వేస్తున్న భారాలను మరింత పెంచుతుంది. అందువల్ల ఇక్కడ కూడా యోగి ఆదిత్యనాథ్ ఇచ్చిన 'విడిపోతే నశిస్తాం' అనే నినాదం మరో కోణంలో వర్తిస్తుంది. పాలకుల ఆకర్షణీయ నినాదాల మాటున సృష్టిస్తున్న అడ్డంకులను ఛేదించి, మనమంతా భారతీయులమనే భావనతో ముందుకు సాగడమే మెరుగైన భారత్ నిర్మాణానికి నేడు అత్యవసరం.

■ ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక





ఎయిర్‌పోర్టులో అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అమిత్‌షాకు ఆత్మీయ స్వాగతం

గన్నవరం విమానాశ్రయం నుంచి గ్రాండ్ వెల్‌కమ్

కాన్వాయ్‌పై పూలవర్షం కురిపించిన నగరవాసులు



రామవరప్పాడు రింగ్ వద్ద అమిత్ షా కాన్వాయ్‌పై పూలు చల్లుతున్న మహిళలు

- టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఘన స్వాగతం
- ప్రత్యేక కాన్వాయ్‌లో చంద్రబాబు ఇంటికి పయనం
- కారులో నుంచే అందరికీ అభివాదం
- నేడు కొండపావులూరులోని ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్ భవనాల ప్రారంభం
- సిద్ధమైన సభా వేదిక.. భారీ పోలీసు బందోబస్తు

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కొండపావులూరులో కేంద్ర సంస్థలను ప్రారంభించడానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై జిల్లా ప్రజలు అభిమానాన్ని చూపించారు. ఆయన వాహనశ్రేణిపై పూలవర్షం కురిపించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన తర్వాత తొలిసారిగా అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వచ్చారు. గన్నవరం విమానాశ్రయంలో దిగిన ఆయనకు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, మంత్రులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి అమిత్‌షా కాన్వాయ్‌లో చంద్రబాబు ఇంటికి వెళ్లారు. మార్గమధ్యలో గూడవల్లి, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు రింగ్, మహానాడు, రమేశ్ ఆసుపత్రి, నిర్మలా కాన్వెంట్, బెంజిసర్కిల్ జంక్షన్లలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు వరుసగా నిలబడి ఆయన వాహనంపై పూలు చల్లారు. వారికి ఆయన కారులో నుంచి అభివాదం చేశారు. అనంతరం రాత్రి 11 గంటలకు అమిత్‌షా నోవాటెల్ హోటల్‌కు చేరుకున్నారు.

పటిష్ట బందోబస్తు

అమిత్‌షా పర్యటనలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 1,200 మంది పోలీసులు ఆయన రక్షణలో ఉన్నారు. కొండపావులూరులోని ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్ సంస్థలను ఆదివారం ఆయన ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభావేదికను సిద్ధం చేశారు.



ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు.



స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా గొల్లపూడిలో శనివారం చేపట్టిన కార్యక్రమంలో చీపురుతో రోడ్డు శుభ్రం చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కూడా పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణాలో నవోదయ ప్రవేశ పరీక్ష

24 కేంద్రాల్లో 2,470 మంది హాజరు

6లో

3, 4, 5 తరగతులపై నివేదిక ఇవ్వండి

సెట్ కాన్ఫరెన్స్‌లో డీఈవో రామారావు


దారి మార్చి

తూర్పు బైపాస్‌కు ప్రత్యామ్నాయంగా అమరావతి ఇన్నర్ రింగురోడ్డు

ఇన్నర్ అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం

- ఈ దిశగా ఆలోచన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే పశ్చిమ బైపాస్‌లో మార్పునకు నోటిఫికేషన్
- ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని కేంద్రానికే అప్పగించే ప్రతిపాదన

విజయవాడ తూర్పు బైపాస్ స్థానాన్ని భర్తీ చేసేందుకు అమరావతి ఇన్నర్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దాని నిర్మాణ బాధ్యతలు కూడా కేంద్ర ప్రభుత్వమే చూసుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. తూర్పు బైపాస్ అవసరం లేదన్న కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే ఆ ప్రాజెక్టు లోటును తీర్చేందుకు కీలక మార్పులు చేస్తోంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ తూర్పు బైపాస్‌కు ప్రత్యామ్నాయంగా ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఇన్నర్ రింగ్‌రోడ్డును విజయవాడ పశ్చిమ బైపాస్ వైపు మార్చేందుకు వీలుగా సీఆర్‌డీఏ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే క్రమంలో తూర్పు బైపాస్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని అలైన్‌మెంట్ మార్పు దిశగా ఆలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

మోర్తు నిర్ణయంతో తూర్పు బైపాస్‌పై సందిగ్ధం

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్), అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)కు సమాంతరంగా తూర్పు బైపాస్ వెళ్తుంది. అయితే, ఈ రెండు రహదారులు, తూర్పు బైపాస్ ఉద్దేశం వేరు. తూర్పు బైపాస్ అనేది విజయవాడ నగర అంతర్గత ట్రాఫిక్ రద్దీని, గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలు, తూర్పు కృష్ణాలోని పలు ప్రాంతాల సత్వర రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్దేశించింది. రెండు దశాబ్దాల కిందటి ప్రతిపాదనలు తెరమీదకు వస్తున్నా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇది కార్యరూపంలోకి వచ్చింది. ఈ బైపాస్‌కు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కూడా పూర్తయింది. రూ.4 వేల కోట్లతో నిర్మించేందుకు అంచనాలు రూపొందించారు. మొత్తం మూడు అలైన్‌మెంట్లు ఇవ్వగా, ఇందులో రెండో ఆప్షన్‌ను జాతీయ రహదారుల సంస్థ అధికారులు ఎంపిక చేసి కేంద్రానికి పంపారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకునే దశలో కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్తు) 'అవసరం లేదు..' అని నిర్ణయించింది. రాష్ట్ర

మిగతా 6లో..

నగరానికి ఉపయోగం

విజయవాడ నగరానికి, గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలకు కూడా తూర్పు బైపాస్ అవసరం. నగరంలో అంతర్గత ట్రాఫిక్‌ను కూడా ఇది తగ్గిస్తుంది. ఇక టెండర్లు పిలవటమే తరువాయి అనుకున్న తరుణంలో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తూర్పు బైపాస్ లేని లోటును తీర్చేందుకు ఇన్నర్ రింగ్‌రోడ్డును ఆ దిశగా అలైన్‌మెంట్ మార్చాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. తూర్పు బైపాస్ ప్రాంతంలో కూడా ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పునకు త్వరలో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో పాటు ఇన్నర్ రింగ్‌రోడ్డును శరవేగంగా పూర్తిచేసేందుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యతలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.



ఆర్తులకు అండగా.. హీల్ ప్యారడైజ్

అనాథలు, పేద పిల్లలకు ఇదో విద్యాలయం

- కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా వసతులు
- స్కూల్ డ్రాపవుట్లు ఉండకూడదన్న డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ ఆలోచనలకు ప్రతిరూపం

8లో

కన్నవారు కాదనుకున్నా.. ఆర్థికంగా అభాగ్యులైనా.. ఏమీ సాధించలేమని డీలా పడినా.. మేమున్నామంటూ ఆత్మీయ హస్తాన్ని అందిస్తోంది 'హీల్ ప్యారడైజ్'. నుదిటిరాతను గేలి చేసి వదిలేసిన తల్లిదండ్రుల కాఠిన్యాన్ని మరిచిపోయేలా ఇక్కడ ప్రత్యేక వసతులతో కూడిన దేవాలయంలో వసతి కల్పించి అనాథలను సొంతబిడ్డల్లా చూసుకుంటారు. ఎల్‌కేజీ నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా విద్యాదానం చేస్తూ వారి భవితకు బంగారు బాట వేస్తున్నారు. స్కూల్ డ్రాపవుట్లు, బాలకార్మికులు లేకుండా చూడాలనే సత్సంకల్పంతో వ్యవస్థాపకుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ అధ్వర్యంలో ఈ సంస్థ నడుస్తోంది. కేవలం అనాథ బిడ్డలకు అండగానే కాకుండా ఉచిత వైద్య శిబిరాలు, కృత్రిమ కాళ్ల అమరికతో ఆర్తులను కూడా ఆదుకుంటోంది. కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దున ఉన్న తోటపల్లి గ్రామంలో 2012లో ఏర్పాటుచేసిన ఈ సేవాసంస్థ అంచెలంచెలుగా ఎదిగి 13వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ప్రత్యేక కథనం.

జలవనరుల శాఖ ఎస్ఈగా మోహనరావు

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ ఎస్ఈగా ఆర్.మోహనరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న ఆయన్ను రెగ్యులర్ చేశారు. జలవనరుల శాఖలో ఎస్ఈలను బదిలీ చేస్తూ ఆ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఎస్ఈగా జీఎస్ శివకుమార్‌రెడ్డిని నియమించారు. విజయవాడ పరిపాలనా విభాగం డిప్యూటీ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా ఎన్.వీరప్రతాప్, విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయంలోని పీ అండ్ ఎం విభాగం ఎస్ఈగా ఎ.సూర్య భాస్కర్‌శర్మ, కమిషనర్ ఆఫ్ టెండర్స్ విభాగ ఎస్ఈగా కె.శేషుబాబు, హైడ్రాలజీ విభాగం ఎస్ఈగా ఎ.వి జయ భాస్కర్, కాడా ఎస్ఈగా ఎల్వీ రమణమూర్తి, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ క్వాలిటీ ఎస్యూరెన్స్ సర్కిల్ ఎస్ఈగా ఎస్.తిరుమలరావును నియమించారు.

లక్కీ మీనాక్షి



బందరురోడ్డులోని ఓ జ్యూయెలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి నటి మీనాక్షి చౌదరి శనివారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

తప్పిన ముప్పు

మన్నేటికోట బస్సు ప్రమాదంలో జిల్లాకు చెందిన 11మంది సురక్షితం

లగేజీని కాదనుకోవడంతో తప్పిన ప్రాణాపాయం

ప్రయాణికులంతా జగ్గయ్యపేట, అనిగండ్లపాడు, నందిగామకు చెందినవారు

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నుంచి విజయవాడకు వస్తున్న సూపర్ లగ్జరీ అద్దె బస్సు (తిరువూరు డిపో పరిధి) ప్రకాశం జిల్లా మన్నేటికోటలో శనివారం తెల్లవారుజామున 3 గంటలకు దగ్ధమైంది. ఈ ఘటనలో జిల్లాకు చెందిన ప్రయాణికులు క్షణాల వ్యవధిలో తమ ప్రాణాలు కాపాడుకున్నారు. లగేజీని వదిలేయడంతో వారు రెప్పపాటులో ప్రాణాలతో బయటపడ్డారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ బస్సులో మొత్తం 19 మంది ప్రయాణికులుండగా, 11 మంది జగ్గయ్యపేట, నందిగామ, అనిగండ్లపాడుకు చెందినవారే. కాగా, బస్సు మన్నేటికోటకు రాగానే డ్రైవర్ కొద్దిసేపు బస్సును ఆపి నిద్రపోయాడు. ఒకరిద్దరు మాత్రం బస్సు దిగారు. బస్సు వెనుక భాగం నుంచి స్వల్పంగా పొగలు రావటాన్ని వారు గమనించారు. ఇద్దరు ప్రయాణికులు బస్సులోకి వెళ్లి మిగిలిన వారిని అప్రమత్తం చేశారు. మిగిలిన ప్రయాణికులు లగేజీ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుండగా, పొగలు బస్సు మొత్తం వ్యాపించాయి. అందరూ బయటకు రాగానే మొత్తం అగ్నికీలలు వ్యాపించి బస్సు దగ్ధమైంది. ఈ విషయాన్ని డ్రైవర్.. ఉన్నతాధికారులకు తెలియజేశాడు. అయితే, చివరి నిమిషంలో లగేజీ కోసం వెళ్లిన ప్రయాణికుడు నాగేశ్వరరావు ఆ ప్రమాదాన్ని చూసి కుప్పకూలిపోయాడు. వెంటనే స్పందించిన ఆర్టీసీ అధికారులు.. సర్వీసు బస్సులో ప్రయాణికులందరినీ విజయవాడ తరలించారు. ఆర్ఎం ఎంవై దానం ఆదేశాల మేరకు పీఎన్‌బీఎస్ డీసీటీఎం నర్రా శ్రీనివాసరావు ప్రయాణికులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వచ్చిన వారికి మంచినీరు, స్నాక్స్ వంటివి సిద్ధం చేశారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం 11 మంది ప్రయాణికులను ప్రత్యేక బస్సులో జగ్గయ్యపేట పంపించారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారి

ప్రయాణికులకు నష్టం

11 మంది ప్రయాణికులు తిరుపతి దర్శనానికి వెళ్లొస్తుండగా ఈ ఘటన జరిగింది. వీరంతా కుటుంబ సభ్యులు, బంధువులే. ఈ ప్రమాదంలో వారంతా లగేజీని పోగొట్టుకున్నారు. రూ.లక్ష వరకు నష్టం జరిగింది. సెల్‌ఫోన్లు కూడా అగ్నిలో ఆహుతయ్యాయి. బస్సు దిగే క్రమంలో ఓ మహిళ బంగారు పోగులు బస్సులో పడిపోయాయి. తిరువూరు డిపోలో అద్దె ప్రాతిపదికన ఈ సూపర్ లగ్జరీ బస్సును తీసుకున్నారు. ఇది కొత్త బస్సు కావటం విశేషం. కాగా, ఈ ఘటన వెనుక కారణాలను తెలుసుకోవడానికి టెక్నికల్ టీమ్‌ను రంగంలోకి దింపారు.



ప్రత్యేక బస్సులో ప్రయాణికుల తరలింపు

విద్యుత్ వర్సెస్ ట్రాఫిక్

- వీఐపీ రాకపోకల సమయంలో విద్యుత్ శాఖ మరమ్మతులు
- పాలిక్లినిక్ రోడ్డులో భారీగా స్తంభించిన ట్రాఫిక్
- ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసిన పోలీసులు

8లో

24 కేంద్రాల్లో 2,470 మంది హాజరు

• ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మచిలీపట్నం టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. కృష్ణాజిల్లాలో 12, ఎన్టీఆర్ జిల్లాలో 12 కేంద్రాల్లో జరిగిన పరీక్షా కేంద్రాల్లో 5,788 మంది అభ్యర్థులకు గాను 2,470 మంది హాజరయ్యారు. 43 శాతం నమోదైంది. పరీక్షా కేంద్రాలను వేలేరు నవోదయ ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు, కృష్ణా డీఈవో పి.వి.జె.రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు సందర్శించారు.

3, 4, 5 తరగతులపై నివేదిక ఇవ్వండి

• సెట్ కాన్ఫరెన్స్‌లో డీఈవో రామారావు



మచిలీపట్నం టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో గతంలో విలీనమైన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు తీసుకువచ్చేందుకు సత్వరం నివేదికలు తయారు చేయాలని డీఈవో పి.వి.జె. రామారావు ఆదేశించారు. శనివారం కృష్ణా జిల్లాలోని డిప్యూటీఈవోలు, ఎంఈవోలతో డీఈవో రామారావు సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 117 జీవో రద్దు చేశారని, ప్రస్తుతం ప్రభుత్వం జనవరి 14న విడుదల చేసిన జీవో 1 ప్రకారం నాలుగు విధాల పాఠశాలలు ఉంటాయన్నారు. ప్రీ ప్రైమరీ 1, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా ఉంటాయని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయవలసి ఉంటుందన్నారు. మండలంలో 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులుండే పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జీవోను అనుసరించి స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వాహకులు, సీఆర్‌పీల సాయంతో వెంటనే గణాంక వివరాలను సేకరించి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ తరహాలో నూతన పద్ధతులను రానున్న విద్యా సంవత్సరంలో ప్రవేశపెడతామన్నారు.

దేవుని గోవు మృతి

• గ్రామంలో ఊరేగించి ఖననం చేసిన గ్రామస్తులు



జి.కొండూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై దేవుని గోవు మృతి చెందిన ఘటన జి.కొండూరులో శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే.. నాగేంద్రస్వామి ఆలయానికి చెందిన ఓ గోవు గ్రామంలో సంచరిస్తుంది. దీనికి గ్రామస్తులే ఆహారం సమకూరుస్తున్నారు. అయితే దేవుని గుడి సెంటర్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పచ్చగడ్డి ఉండటంతో అది తినడానికి వెళ్లిన గోవు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం గోవును చూసి గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు. గోవును ఓ ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించి ఖననం చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుడివాడలో బ్యానర్ల హల్‌చల్

గుడివాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో జైలుపాలైన కామేపల్లి తులసీబాబును ఉద్దేశించి గుడివాడ పట్టణంలో ఫ్లెక్సీలు హల్‌చల్ చేశాయి. ఆర్ఆర్ఆర్ పలు సందర్భాల్లో పేర్కొన్న తులసీబాబు అలియాస్ గంజాయి మొక్క పేరుతో ఫ్లెక్సీలు వెలవడం సంచలనం కలిగించింది. వైసీపీ రంగులతో "గుడివాడ గంజాయి మొక్కని శాశ్వతంగా పెకలించి గుడివాడకి ఊపిరి పోసిన వినోద్ అన్నకు ధన్యవాదాలు" అంటూ బ్యానర్లు పలుచోట్ల వెలిశాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేశారు. బ్యానర్‌లో పేర్కొన్న వినోద్ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానికి ముఖ్య అనుచరుడు, ఇప్పటికే పలుమార్లు క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో అరెస్టయ్యాడు. తన పేరు, ఫొటోతో బ్యానర్లు వెలిసిన విషయం తెలుసుకున్న వినోద్ హుటాహుటిన వాటిని తొలగించారు. అయితే వీటిని ఏర్పాటు చేసింది ఎవరన్నదానిపై చర్చ జరుగుతోంది. వైసీపీ వాళ్లా లేక టీడీపీలోని తులసీబాబు బాధితులా అన్నది చర్చనీయాంశమైంది.



గుడివాడలో వెలిసిన బ్యానర్

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. నియోజకవర్గంలోని మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లోని 50 డివిజన్‌లు, బందరు మండలంలోని 34 పంచాయతీలను ఉత్తర, దక్షిణ తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు అప్పట్లో ప్రకటించారు. ప్రభుత్వ రికార్డుల్లో రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజన జరిగినట్లుగా చూపుతున్నా, అధికారులు, సిబ్బంది కేటాయింపు, దక్షిణ మండల కార్యాలయానికి భవనం ఏర్పాటు నేటికీ జరగలేదు.

తీవ్ర జాప్యం

దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుపై అధికారుల నిర్వాకం



మచిలీపట్నం డివిజన్ నీటిపారుదలశాఖ అతిథిగృహం భవనానికి దక్షిణ తహసీల్దార్ కార్యాలయం పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

- రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా మచిలీపట్నం టౌన్, రూరల్ విభజన
- 2023లో జీవో జారీ చేసిన నాటి వైసీపీ ప్రభుత్వం
- నేటి వరకు ఏర్పాటు కాని కార్యాలయ భవనం, సిబ్బంది, అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించి పరిపాలన కొనసాగించాలని 2023 ఫిబ్రవరి 28వతేదీన అప్పటి ప్రభుత్వం జీవోఆర్‌టీ నంబరు 213ను జారీ చే సింది. ఈ అంశంపై అభ్యంతరాలు ఉంటే నెల రోజుల్లోపు తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రజలు రెండు తహసీల్దార్ కార్యాలయాలు కావాలని ఎప్పటి నుంచో కోరుతుండటంతో దీనిపై అభ్యంతరాలు రాలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో మచిలీపట్నం నియోజకవర్గంలో రెండు మండలాలు, ఇద్దరు తహసీల్దార్లు పనిచేస్తున్నట్లుగా చూపారు. అయినా రెండో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయలేదు. ఎన్నికల సంఘానికి మచిలీపట్నంలోని పాత కార్యాలయంలో ఉత్తర తహసీల్దార్ కార్యాలయం ఉన్నట్లుగా చూపి, దక్షిణ తహసీల్దార్ కార్యాలయం మచిలీపట్నంలోని నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న బందరు కిళ్లీ, సోడా అండ్ బీడీ వర్తక సంఘం భవనంలో ఉన్నట్లుగా చూపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కూడా దక్షిణ తహసీల్దార్ కార్యాలయానికి మచిలీపట్నం డివిజన్ నీటిపారుదలశాఖ కార్యాలయం ఆవరణలో ఆ శాఖకు చెందిన అతిథిగృహంలో దక్షిణ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పి బోర్డు ఏర్పాటు చేశారు, కానీ కార్యాలయానికి అవసరమైన కంప్యూటర్‌లు, ఫర్నిచర్, ఇతరత్రా సౌకర్యాలు కల్పించలేదు. భవనానికి కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఎప్పుడు ఈ భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి.

ఉత్తర తహసీల్దార్ పరిధిలో..

ఉత్తర తహసీల్దార్ కార్యాలయం పరిధిలో పెదపట్నం, కానూరు, తాళ్లపాలెం, గోకవరం, మంగినపూడి, బుద్దాలపాలెం, తపసిపూడి, పొట్లపాలెం, బొర్రపోతుపాలెం, పోతేపల్లి, గోపువానిపాలెం, అరిసేపల్లి, కరగ్రహారం పంచాయతీలను చేర్చారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1 నుంచి 19 డివిజన్లు, 40 నుంచి 50 డివిజన్‌లను కలిపారు.

దక్షిణ తహసీల్దార్ పరిధిలోకి ప్రాంతాలు ఇవీ

దక్షిణ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ఎస్ఎన్ గొల్లపాలెం, గుండుపాలెం, రుద్రవరం, కోన, పోలాటితిప్ప, చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి, పెదయాదర, నెలకుర్రు, పల్లెతుమ్మలపాలెం, కొత్తపల్లెతుమ్మలపాలెం, తుమ్మలచెరువు, ఎన్.గొల్లపాలెం పంచాయతీలు, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20 నుంచి 39 డివిజన్‌లను చేర్చారు. ఈ ప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా కాలేఖాన్‌పేట, చిన్నాపురంలో అద్దె భవనంలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో అధికారులు చెప్పారు. నూతన తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే తహసీల్దార్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని కేటాయించాలి. వీరి కేటాయింపు నేటికీ పూర్తిగా జరగలేదు. ప్రభుత్వ లెక్కల్లో మాత్రం ఉత్తర, దక్షిణ తహసీల్దార్ కార్యాలయాలు పనిచేస్తున్నట్లుగా చూపుతున్నారు. ఎన్నికల అనంతరం తహసీల్దార్ల బదిలీలు జరిగిన సమయంలో ఉత్తర తహసీల్దార్‌గా ఎ.శ్రీనివాసరావును నియమించారు. ఆయన రెండు నెలలకు పదవీ విరమణ చేశారు. దీంతో ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. దక్షిణ తహసీల్దార్ ఉత్తర తహసీల్దార్ కార్యాలయం ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధిద్దాం

- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర
- మచిలీపట్నంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహణ



మచిలీపట్నంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నేత రామకృష్ణ తదితరులు



కాటూరులో చీపురుతో రోడ్డు శుభ్రం చేస్తున్న సీఎస్ విజయానంద్, కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

మచిలీపట్నం టౌన్ , జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌తో ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం నగరపాలకసంస్థ 3వ డివిజన్ మాచవరంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. బీసీ హాస్టల్‌ను సందర్శించారు. చీపురు పట్టి ఊడ్చారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు. జ్యోస్యులవారితోటలో మొక్కలు నాటారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చీపురు పట్టుకుని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు రాష్ట్రాన్ని స్వచ్ఛతవైపు నడిపించాలన్నారు. చంద్రబాబు మచిలీపట్నం వచ్చినప్పుడు డంపింగ్ యార్డును పరిశీలించారని, ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.13 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు మాట్లాడుతూ స్వచ్ఛతా కార్యక్రమాలపై దృష్టి సారిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మునిసిపల్ కమిషనరు బాపిరాజు, తెలుగు మహిళ కరెడ్ల సుశీల పాల్గొన్నారు.

కాటూరులో రోడ్డు ఊడ్చిన సీఎస్ విజయానంద్

ఉయ్యూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత పాటిస్తూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధిద్దామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పిలుపునిచ్చారు. కాటూరులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలసి పాల్గొన్న సీఎస్ విజయానంద్ మొక్కలు నాటారు. చీపురు చేతపట్టి రోడ్డు శుభ్రపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తుందని, దీనిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తొలుత రోడ్డు పక్కన మొక్కలు నాటి, ప్రజలకు చెత్త డబ్బాలు పంపిణీ చేశారు. ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. జేసీ గీతాంజలి శర్మ, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో జె.అరుణ, సర్పంచ్ కాటూరు ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ మన లక్ష్యం: ఎంపీ కేశినేని



గొల్లపూడిలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నేత బొమ్మసాని

గొల్లపూడి / మైలవరం / వీరులపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. గొల్లపూడిలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశలతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బుడమేరు వరద ముంపునకు ప్లాస్టిక్ వ్యర్థాలు కారణమయ్యాయని తెలిపారు. వీటిని పూర్తిగా నివారిద్దామని పిలుపునిచ్చారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాధ్యతారహిత్యంగా బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేయడం వల డ్రెయిన్లు పూడిపోయి దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో జి.ఎల్.ఎస్.రాఘవన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, తహసీల్దార్ బి.సుగుణకుమారి, ఎంపీడీవో విగ్గిన్స్, నేతలు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య, ధర్మారావు పాల్గొన్నారు. కాగా, మైలవరం, వీరులపాడు మండలం జుజ్జూరులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ నిర్వహించారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

» రూ.84.5 లక్షల విలువైన 1.206 కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల దొంగలను అరెస్ట్ చేసిన శ్రీకాకుళం పోలీసులు రూ.84.44 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఈ వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబు విజయవాడలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. క్రికెట్ కోచింగ్ తీసుకుని రంజీలోకి ఎంపిక కాక, చెడువ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో విజయవాడ, గుంటూరు, ఎస్.కోట, రాజాం, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరుతో పాటు రాష్ట్రంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో 30 పైగా కేసుల్లో జైలుకు వెళ్లాడు. 2022 జూన్‌లో అరెస్టై గతేడాది జనవరి 10న విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి విడుదలైన రాంబాబు, జైలులో పరిచయమైన శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గెడ్డ కంచరాం గ్రామానికి చెందిన గిడిజాల కోటేశ్వరరావుతో కలిసి నేరాలకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఐదున్నర తులాల బంగారు కాసుల పేరు, ఒక తులం బంగారు చైన్ పోయినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 17న ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస కూడలిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాంబాబు, కోటేశ్వరరావును విచారించగా అసలు విషయం బట్టబయలైంది. జిల్లాలో ఏకంగా 32 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు వారిద్దరూ అంగీకరించారు. వీరి నుంచి రూ.84,44,800 విలువ చేసే 1.206 కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఇంకా మరో 250 గ్రాముల బంగారం బ్యాంకులో తాకట్టులో ఉందని, వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ వివరించారు.

రైతుల కష్టం తెలిసిన నాయకుడు ఎన్టీఆర్





ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు, పామర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు
- హనుమాన్‌జంక్షన్, వీరవల్లి పాల ఫ్యాక్టరీల్లో రామారావు వర్ధంతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): పాడి రైతు కష్టాన్ని గుర్తించి రైతుకే లాభాలు అందాలని భావించి మ్యాక్స్ చట్టాన్ని అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. హనుమాన్‌జంక్షన్, వీరవల్లి పాల ఫ్యాక్టరీల్లో శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ముఖ్యమంత్రిగా పాడిరైతులకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. విజయవాడ పాల ఫ్యాక్టరీలో నిర్మాణం పూర్తి చేసుకున్న 3వ బ్లాక్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టామని, అలాగే వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(విజయ పాలఫ్యాక్టరీ) ఆవరణను నందమూరి తారక రామారావు పాల ప్రాంగణంగా నామకరణం చేసినట్లు తెలిపారు. రైతు చేతిలోనే వ్యవస్థ ఉండాలని, రైతులకే నేరుగా లాభాలు అందాలనే సదుద్దేశంతో అన్ని రాష్ట్రప్రభుత్వాలు అమలు చేయడానికి సంకోచించే మ్యాక్స్ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెట్టి అమలు చేసిన ఘనత రామారావుదే అన్నారు.

నిమ్మకూరులో ఎన్టీఆర్‌కు ఘన నివాళి

పామర్రు, జనవరి18(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్వగ్రామమైన నిమ్మకూరులో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరై ఎన్టీఆర్, బసవతారకం దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమ పథకాల ఆరాధ్యుడు ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పడమట శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ నందమూరి జయ కృష్ణ ప్రసాద్, నాయకులు శివరామకృష్ణ, రఘురామయ్య, సూరపనేని అంకినీడు, తాతినేని అశోక్ చక్రవర్తి, మాజీ సర్పంచ్ జంపాన వేంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే పామర్రు పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద పార్టీ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ప్రతిమలకు కూటమి నేతలతో కలసి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ అత్తాగారి గ్రామమైన కోమరవోలు, జమీగోల్వేపల్లి, బల్లిపర్రు గ్రామాల్లో వర్ధంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఎన్టీఆర్ విగ్రహ కమిటీ చైర్మన్ చలపతిరావు, మండపాక శంకర్‌బాబు, మాజీ ఎంపీపీ గొట్టిపాటి లక్ష్మీదాస్ తదితరులు పాల్గొన్నారు.

సినీ, రాజకీయ రంగాల్లో రికార్డులు సృష్టించారు

పటమట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో నందమూరి తారక రామారావు రికార్డులు సృష్టించారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేపట్టి రికార్డు సృష్టించారన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. నారా లోకేష్ సారథ్యంలో ఒక ప్రాంతీయ పార్టీ కోటి సభ్యత్వాలు నమోదు చేసుకోవడం రికార్డు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బొప్పన భవకుమార్, చెన్నుపాటి గాంధీ, కోనేరు శ్రీధర్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి క్రాంతిశ్రీ, అడ్డూరి శ్రీరామ్, అడపా నాగేంద్ర, గరికపాటి బద్రీ, నర్రా కిషోర్, గాదిరెడ్డి అమ్ములు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నందిగామ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నందిగామ మండలం పల్లగిరి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పల్లగిరి గ్రామస్థుడు నాగుల్ మీరా(30) గ్రామానికి చెంది నరేష్, నూరుద్దీన్ అనే యువకులతో కలసి శనివారం తెల్లవారుజామున దొనబండ కంకర కోసం ట్రాక్టర్‌పై వెళ్లారు. నరేష్ డ్రైవింగ్ చేస్తుండగా నాగుల్‌మీరా, నూరుద్దీన్‌లు చెరొక వైపు కూర్చున్నారు. పల్లగిరి సమీపంలో నాగుల్‌మీరా నిద్రమత్తులో ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. ఆయనపై ట్రక్కు ఎక్కడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. నాగుల్‌మీరా చనిపోయాడని నిర్ధారించుకున్న నరేష్, నూరుద్దీన్‌లు భయంతో అతని మృతదేహాన్ని అదృశ్యం చేయాలని గోళ్లమూడి సమీపంలోని బావిలో పడేసి వెళ్లిపోయారు. నాగుల్‌మీరా ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు నరేష్, నూరుద్దీన్‌లను నిలదీశారు. తొలుత తమకు తెలియదని చెప్పిన ఇరువురూ ఆ తర్వాత జరిగిన విషయం చెప్పారు. దీంతో బావి నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసిన సీఐ నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రఫీ అవార్డుల ప్రదానం

విజయవాడ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అమరావతి అభివృద్ధిపై ఫొటోగ్రఫీ పోటీలు-2025 అవార్డుల ప్రదానం బాలోత్సవ భవన్లో శనివారం ఘనంగా నిర్వహించారు. అమరావతి ఫెస్టివల్ సొసైటీ, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గౌరవ అతిథిగా డాక్టర్ జి.సురేంద్ర హాజరయ్యారు. ప్రతిభ చూపిన ఫొటో గ్రాఫర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి గోళ్ల నారాయణరావు, అమరావతి ఫెస్టివల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.పట్టాభిరామయ్య పాల్గొన్నారు.

దారి మార్చి

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం కూడా ఈ అంశంపై సీరియస్‌గానే దృష్టి సారిస్తోంది.

తూర్పు కృష్ణాలో వ్యతిరేకత

మోర్తు నిర్ణయంపై తూర్పు కృష్ణా ప్రాంతంలో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. విజయవాడ నగరంతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలు కూడా ఈ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇది కేవలం ఉమ్మడి కృష్ణాజిల్లాకే కాకుండా గుంటూరు జిల్లా ప్రజలకు కూడా అవసరం. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరంలో ఉంది. విజయవాడ పశ్చిమ బైపాస్ త్వరలో అందుబాటులోకి వస్తున్నప్పటికీ తూర్పు బైపాస్ అలైన్‌మెంట్‌తో పోల్చుకుంటే అది చాలా ఎక్కువ దూరం. చిన అవుటపల్లికి వెళ్లి అక్కడి నుంచి మళ్లీ విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా మంగళగిరి నియోజకవర్గ ప్రజలైతే ఎప్పటినుంచో తూర్పు బైపాస్ కోసం ఎదురుచూస్తున్నారు. దీని అలైన్‌మెంట్ విమానాశ్రయానికి సమీపంగా వెళ్తుంది. కాబట్టి నేరుగా, త్వరగా విమానాశ్రయానికి చేరుకోవచ్చు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143,152, 163
చికెన్ విత్ స్కిన్	276
చికెన్ స్కిన్‌లెస్	286

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

శివరామకృష్ణక్షేత్రంలో 24 నుంచి విశిష్ట కార్యక్రమాలు

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా శివరామ కృష్ణక్షేత్రంలో ఈనెల 24 నుంచి ఏప్రిల్ 8 వరకు విశిష్ట కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ధర్మాధారి శిష్టా హనుమత్ ప్రసాద్ తెలిపారు. సత్యనారాయణపురంలోని శివరామకోటి క్షేత్రంలో శనివారం విలేకరుల సమావేశంలో కరపత్రాలను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్య నవ చండీహోమం, చండీ పారాయణం, పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతీ రోజూ సాయంత్రం ఆధ్యాత్మికవేత్తల పురాణ ప్రవచన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, చంద్రమౌళి పాల్గొన్నారు.



5వ డివిజన్‌లో మహిళకు చీర అందజేస్తున్న గద్దె క్రాంతి



17వ డివిజన్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



7వ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద ..



నిమ్మతోట సెంటర్లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గన్నే ప్రసాద్

ప్రజల మదిలో నిలిచిన నేత ఎన్టీఆర్

భారతీనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు.శనివారం రమేష్‌బాబు ఆసుపత్రి సమీపంలోని నాల్గవ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు కార్యాలయం వద్ద ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేద మహిళల కు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గన్నే వెంకటనారాయణ ప్రసాద్, దేవరపల్లి ఆంజనేయులు, వడ్లపట్ల గోపాలకృష్ణ, సురేంద్ర, గొల్లపూడి నాగేశ్వరరావు, కొనసాగి నాగమణి, దాసరి నాగశ్రీ, నాయకులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ కాలనీలో ...

ఏపీఐఐసీ కాలనీలోని నూతన రైతుబజార్ వద్ద టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి కోడూరు ఆంజనేయ వాసు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిలకు చీరలు, కూరగాయలను పంపిణీ చేశారు.

పటమట: అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకుడు సయ్యద్ ఇబ్రహీం ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. 100 మంది రక్తదానం చేశారు. 12వ డివిజన్లో 300 మందికి దుప్పట్లు, టవల్స్‌ను ఆయన పంపిణీ చేశారు. బొప్పన భవకుమార్, షేక్ ఫిరోజ్, డాక్టర్ ఎస్.డి శ్రీనివాస్, ముమ్మనేని ప్రసాద్, పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి: 2వ డివిజన్‌లో పార్టీ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు ముత్యాల కృష్ణ, టీడీపీ జనరల్ సెక్రటరీ కృష్ణ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ● 6వ డివిజన్ నిమ్మతోట సెంటర్ మెట్రో ఎదురుగా ఎన్టీఆర్ వర్ధంతిని డివిజన్ అధ్యక్షుడు పడాల యుగంధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), నాగమోతు రాజా పాల్గొన్నారు.

రాణిగారితోట: రాణిగారితోట 17, 18 డివిజన్లలో కొప్పుల శ్రీనివాస్ చౌదరి బ్రదర్స్ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు ఆవిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొప్పన భవకుమార్, రాయి రంగమ్మ, మొకర ఆదిబాబు, పోలిపల్లి ముని, వీరాస్వామి, పల్లా సాగర్, దుర్గారావు, పీరుబాబు, గోగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ● 19వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గెద్దె క్రాంతి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం: స్థానిక ఏడో డిజన్‌లో టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ నేతలు ఎన్టీయార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సతీష్ చంద్ర, నాగమోతు రాజా, పెనుగొండ శ్రీను, దోమకొండ జ్యోతి రత్నాకర్, అన్నే వసంత రాయుడు పాల్గొన్నారు.● ఎనిమిదో డివిజన్ మదర్ థెరెస్సా జంక్షన్ వద్ద కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి ఆధ్వర్యంలో ఎన్టీయార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. **గుణదల:** స్థానిక 5వ డివిజన్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్ పాల్గొన్నారు. ● స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే వెంకట నారాయణ ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు పాల్గొన్నారు. ● చుట్టుగుంట వద్ద జరిగిన కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ముందుగా ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చందా కిరణ్, వడ్లమూడి సంపత్, లంకా అబ్బినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



26వ డివిజన్లో రోడ్లను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ రాజేశ్వరి

గుణదల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశు భ్రతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్రా, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని స్థానిక 26వ డివిజన్లోని 29, 30, 31 సచివాల యాల పరిసరాల్లో శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి పారిశుధ్య సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, కడియం ప్రకాష్, విజ్జి శశి, డేవిడ్, సింహాచలం, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్



టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, టీడీపీ నేతలు

వన్‌టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్య మంత్రి, నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని విజయవాడలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేద వ్యాస్‌లు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. అనంతరం రఘురామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహావ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తూమాటి ప్రేమనాథ్, లుక్కా సాయిరాం గౌడ్, గన్నే ప్రసాద్, కొత్త నాగేంద్ర కుమార్, మరకా శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో...

గురునానక్ కాలనీలోని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించిన చిన్ని మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో మంత్రి నారా లోకేష్ రికార్డులను బద్దలకొడుతున్నారని చెప్పారు. రాజకీయ రంగంలో అలుపెరగని పోరాట యోధుడిగా ఎన్టీఆర్‌ను అభివర్ణించారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, నాయకులు ఎంఎస్ బేగ్, ఫతావుల్లా, చెన్నుపాటి గాంధీ, ఆషా, పరుచూరి ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, బొప్పన భవకుమార్, పలువురు నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

మొగల్రాజపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో నైపుణ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి బయటకు తీయడానికి జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి విద్యాకోర్సులు ఉపయోగించుకోవాలని భూమిక ఉమెన్ కలెక్టివ్ కౌన్సిలర్ దారా బిందు, ఫీల్డు కో-ఆర్డినేటర్ హెచ్. శ్యామల అన్నారు. జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో శనివారం కార్యాలయంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతవాసులకు, నగర నిరుద్యోగ యువతకు తెలిసేలా జనశిక్షణా సంస్థాన్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

టీడీపీ నేత గోగుల రమేష్ మృతి



రాణిగారితోట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, 17, 18 డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జ్ గోగుల రమేష్ గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కొంతసేపటికే మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. 17, 18 డివిజన్లలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో, 18వ డివిజన్‌లో పాత టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు వెళ్లారు. సినిమా చూస్తుండగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలపడంతో భౌతికకాయాన్ని బాలాజీ నగర్‌లోని నివాసానికి తరలించారు. గోగుల రమేష్ మృతితో టీడీపీ శ్రేణులు విషాదంలో మునిగారు. భౌతికకాయానికి స్థానిక టీడీపీ నేతలు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సడక్ సురక్ష.. జీవన్ రక్ష పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సింగ్ తదితరులు

పాయకాపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వాహన వినియోగదారులు తప్పనిసరిగా రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ ఆర్‌కే సింగ్ అన్నారు. రోడ్డు భద్రత అవగాహన సదస్సులో భాగంగా విజయవాడ కార్యాలయంలో శనివారం సడక్ సురక్ష.. జీవన్ రక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడు బేతు రామమోహన్ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రచార సామగ్రి కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆర్‌కే సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నేతృత్వంలో రోడ్డు ప్రమాదాలు నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. రామమోహన్ మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీపై నెల నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. కనకదుర్గ పద్మజ, సభ్యులు బంగారయ్య, కొటేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాలికను ప్రేమ పేరుతో మోసగించిన ఓ యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతానికి చెందిన బాలిక(13) ఏడో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన యువకుడు బాలికకు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకెళ్లి శారీరకంగా లోబరచుకున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు అజిత్‌సింగ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.













అమిత్ షాకు ఆహ్వానం





కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్, నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య

ఎన్డీఆర్‌ఎఫ్ రైజింగ్ డే వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు గన్నవరం విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలితో సహా పలువురు మంత్రులు, శాసనసభ్యులు, కూటమి నేతలు పాల్గొని అమిత్ షాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్





కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

విద్యుత్ వెర్సస్ ట్రాఫిక్

- వీఐపీ రాకపోకల సమయంలో విద్యుత్ శాఖ మరమ్మతులు
- పాలిక్లినిక్ రోడ్డులో భారీగా స్తంభించిన ట్రాఫిక్
- ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసిన పోలీసులు

విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఓపక్క రాజ్‌భవన్ నుంచి గవర్నర్ అబ్దుల్ నజీర్ గన్నవరం విమానాశ్రయానికి బయల్దేరుతున్నారు. అదే సమయంలో ఉండవల్లి నుంచి సీఎం చంద్రబాబు కాన్వాయ్ బయల్దేరుతుంది. ఈ సమయంలో ట్రాఫిక్, విద్యుత్ అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా నిర్మల్ కాన్వెంట్ కూడలిలో భారీగా ట్రాఫిక్ ఆగిపోయింది. ఇది ఇరు శాఖల మధ్య వివాదానికి దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఉదయం 10 గంటలకు గవర్నర్ కాన్వాయ్ విమానాశ్రయానికి బయల్దేరింది. తర్వాత సీఎం కాన్వాయ్ సిద్ధమైంది. ఇంతలో బెంజిసర్కిల్ వద్ద నుంచి రామవరప్పాడు వరకు ట్రాఫిక్ పోలీసులు గ్రీన్‌ఛానల్ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలను సర్వీసు రహదారుల్లోకి మళ్లిస్తున్నారు. ఇంతలో పాలిక్లినిక్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీన్ని గమనించిన ఇన్‌స్పెక్టర్ రవి ఆరా తీశారు. సిద్ధార్థ అకాడమీ గేటు వద్ద విద్యుత్ శాఖ ఏఈ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని తీయిస్తున్నారు. ఎక్స్‌కవేటర్‌తో ఈ పనులు చేయిస్తుండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలతో పాటు డీవీ మనార్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. దీనిపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి అక్కడున్న ఏఈని ప్రశ్నించారు. పనులు చేసేటప్పుడు సమాచారమిస్తే తాము సిబ్బందిని నియమించుకుంటామని చెప్పారు. రవి ఎంత మాట్లాడినా ఏఈ నుంచి స్పందన కనిపించలేదు. తాము చేసే పనుల గురించి ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదని ఏఈ పేర్కొన్నారు. దీంతో ఆగ్రహించిన ఇన్‌స్పెక్టర్ రవి అక్కడున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసి బెంజిసర్కిల్‌కు తీసుకొచ్చారు. తర్వాత ఆ ప్రాంత కార్పొరేటర్, మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ ఫోన్ చేయడంతో రవి ఎక్స్‌కవేటర్‌ను విడుదల చేశారు.



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, తదితరులు

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ

వన్‌టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పశ్చిమలోని 52వ డివిజన్ బ్రాహ్మణ వీధి, రావిచెట్టు సెంటర్ దగ్గర ఎన్టీఆర్ 29వ వర్థంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి అధికారంలోకి వచ్చాకే పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి చంటి, డివిజన్ అధ్యక్షుడు ఈగల సాంబ, క్లస్టర్ ఇన్‌చార్జులు భవానీ ప్రసాద్, గంగాధర్, గణప రాము, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోలి శ్రీనివాస్ రావు, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజుతో పాటు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




అధికారులు స్వాధీనం చేసుకున్న రా పౌడర్, పౌడర్ తయారీ మిషన్

మత్తు మందుల రా మెటీరియల్ స్వాధీనం

విస్సన్నపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కలగర రామచంద్రాపురం గ్రామంలో భీమిరెడ్డి వెంకట రెడ్డి నివాసంలో శనివారం విజయవాడ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.విద్యా సుధాకర్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. ఈ దాడుల్లో గడ్డివామిలో దాచిన మత్తు మందులు తయారీకి వినియోగించే 100 కిలోల ఇంటర్‌మీడియట్ రా మెటీరియల్, తయారీ మిషన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మిరియాలగూడలో డ్రగ్స్ కేసులో రాజశేఖర్ రెడ్డి అనే ముద్దాయిని అదుపులోకి తీసుకొని అతడి వద్ద ఆల్‌ప్రాజోలం అనే డ్రగ్‌ను స్వాధీనం చేసుకొని విచారణ చేయగా అతడిచ్చిన సమాచారంతో రామచంద్రాపురం గ్రామంలో వెంకట రెడ్డి నివాసంలో సోదాలు నిర్వహించినట్టు తెలిపారు. మెటీరియల్స్‌ను గుంటూరు ల్యాబ్‌కు పంపించామని, ఫలితాలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

పచ్చని కుటుంబంలో చిచ్చుపెట్టాడనే చంపేశా!

- దివ్యాంగుడు యర్రంశెట్టి హత్య కేసులో నరేష్ అరెస్టు

జగ్గయ్యపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పచ్చని కుటుంబంలో చిచ్చుపెట్టి కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసినందుకు తట్టుకోలేక దివ్యాంగుడు యర్రంశెట్టి ఆంజనేయులును చంపేసినట్టు ముద్దాయి బెల్లంకొండ నరేష్ నేరం అంగీకరించినట్టు జగ్గయ్యపేట సీఐ వీ.వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం అతడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరగా, కోర్టు 14రోజుల రిమాండ్ విధించిందన్నారు. తల్లిని తమతో విడదీసి సహజీవనం చేయటంతో తండ్రి, తాను, సోదరి అనాథల్లా మిగిలిపోయామని, ఆ కోపంతోనే ఆంజనేయులును హత్యచేస్తే కుటుంబం కలిసిపోతుందనే ఉద్దేశంతో చేసినట్టు నేరం అంగీకరించాడని సీఐ చెప్పారు.

నకాసిబజార్‌లో బీభత్సం

- పిచ్చికుక్క కరవటంతో ఆవు మృతి



జగ్గయ్యపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధి కుక్కల బెడద పౌరులకే కాదు మూగజీవాలకు తప్ప టం లేదు. నకాసిబజార్‌లో ఇటీవల ఒక ఆవును పిచ్చికుక్క కరవటంతో ఆ ఆవు శనివారం వింతగా ప్రవర్తించింది. ఆ బజార్‌లో ఒక ఇంట్లోకి, కిరాణా షాపులోకి వెళ్లి పిచ్చిపిచ్చిగా ప్రవర్తించింది. బలవంతంగా బయటకు తేగా ఆ రోడ్డులో వాహనాలను కుమ్మటంతో అవి పడిపోయాయి. కొద్దిసేపటికి ఆ వీధి వాసులంతా కలిసి తాడుతో కట్టేశారు. కొద్దిసేపటికి ఆ ఆవు చనిపోయిందని వాసవీక్లబ్ ప్రతినిధి గోనుగుంట్ల ధనుంజయ్ చెప్పారు. కుక్కల బెడదతో పాటు కుక్క కరవటం వల్ల ఆవులు, మూగజీవాలు బలైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలను నియంత్రించాలని, పిల్లలు, పెద్దలు బయటకు రాలేకపోతున్నారని చెప్పారు.

ఎక్సైజ్ శాఖలో స్వచ్ఛ దివస్



విజయవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ అధికారులు, సి బ్బంది శనివారం స్వచ్ఛ దివస్ పాటించారు. మారుతీ నగర్‌లోని ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో డీసీ శ్రీనివాస్, ఈఎస్ శ్రీనివాసరావు, ఏఈఎ స్ రామ్‌శివ కార్యాలయాన్ని శుభ్రం చేశారు. చెత్తను తొలగించి, బూజుల ను తొలగించారు. జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్లను ఇన్‌స్పెక్టర్లు శుభ్రం చేశారు.



అనాథ పిల్లలకు స్వర్గధామం!

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే వసతులు ‘హీల్ ప్యారడైజ్’ సొంతం

- ఉన్నత వర్గాల పిల్లలకు దీటుగా పూర్తి ఉచితంగా విద్య, వైద్యం
- ఈ స్వర్గధామానికి కర్త, కర్మ క్రియ డాక్టర్ కోనేరు సత్యప్రసాద్
- ఎల్‌కేజీ నుంచి డీమ్డ్ వర్సిటీ దిశగా విజయవంతమైన పదేళ్ల ప్రస్థానం
- గ్రామీణ ప్రాంతాలకు ఉచిత వైద్యసేవలు
- కాళ్లు లేని వారికి కృత్రిమ కాళ్ల అమరిక
- ప్రభుత్వ స్కూళ్లను హీల్ ప్యారడైజ్‌లుగా మార్చేందుకు మాస్టర్ ప్లాన్

ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం: అనాథ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పడిన ‘హీల్ ప్యారడైజ్’ దశాబ్దకాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగు పెట్టింది. తల్లిదండ్రులు లేకపోవటం, పేదరికం సమస్యలతో బాల్యం నిర్వీర్యం కాకూడదని దశాబ్దంగా వారికి బంగారు భవిష్యత్తును కల్పిస్తోంది హీల్ ప్యారడైజ్. దేశంలో పెరుగుతున్న స్కూల్ డ్రాపవుట్లు, బాలకార్మికుల సంఖ్య పెరగటం వంటివి ప్రమాద ఘంటికలను మోగిస్తున్న తరుణంలో తమ వంతు ప్రయత్నంగా నెలకొల్పిన హీల్ ప్యారడైజ్ ఇంతింతై వటుడింతై అన్న చందాన ఎందరికో ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలుస్తోంది. అనాథ శరణాలయాలు ఎన్ని ఉన్నా వీటన్నింటికన్నా భిన్నంగా పనిచేయాలన్న విధానంతో హీల్ సంస్థ అంకురించింది. ధనవంతుల ఇళ్లల్లో పిల్లలకు, అనాథలకు చదువు, ఆరోగ్యం విషయంలో తేడా ఉండకూడదన్నది హీల్ సిద్ధాంతం. ఉన్నత వర్గాల పిల్లలు ఏ స్థాయిలో చదువుకుంటున్నారో ఈ పిల్లలు కూడా అంతే ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని కృష్ణా, ఏలూరు జిల్లాల సరిహద్దున ఉన్న తోటపల్లిలో 2012లో బ్రహ్మయ్యలింగం చెరువు చెంతన ఈ హీల్ ప్యారడైజ్ ఆవిర్భవించింది. ప్రశాంతమైన ప్రకృతి నడుమ, కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే భవనాలతో కూడిన పాఠశాల, కళాశాలలను నిర్వహిస్తూ విస్తరిస్తోంది.

కర్త, కర్మ, క్రియ కోనేరు సత్యప్రసాద్



హీల్ ప్యారడైజ్ ఆవిర్భావానికి కర్త, కర్మ, క్రియ ఎవరంటే కోనేరు సత్యప్రసాద్ అనే చెప్పాలి. చిన్నప్పటి నుంచి తండ్రి అందించిన స్ఫూర్తితో సమాజానికి సేవచేయాలన్న అభిలాషతో సత్యప్రసాద్ హీల్ ప్యారడైజ్ స్థాపించారు. తొలుత 1967లో గుంటూరులో తాను చదువుకున్న రోజుల్లోనే స్నేహితుల సాయంతో సమాజ సేవకు ప్రజా సేవ సమితిని ఏర్పాటు చేశారు. విద్యాభ్యాసం తర్వాత యూకేలో డాక్టర్‌గా స్థిరపడ్డారు. కొన్నాళ్లకు తనలోని సమాజ సేవ కాంక్షను ఆచరణ రూపంలోకి తేవడానికి యూకేలోనే హీల్ చారిటీని ఏర్పాటు చేశారు. తర్వాత మన దేశం వచ్చి గుంటూరు జిల్లాలో 200 మంది పేద పిల్లల బాగోగులను చేపట్టారు. తర్వాత హీల్ ప్యారడైజ్‌ను తోటపల్లిలో 2012లో ఏర్పాటు చేశారు.



అనాథ, ఆర్థిక ఆసరా లేని పిల్లలకు ధైర్యం

ఎలాంటి ఆసరా లేని పిల్లలకు బలవర్థకమైన ఆహారాన్ని అందించి వారు ఆరోగ్యంగా ఉండేలా తీర్చిదిద్దటం, చక్కటి విద్యాబుద్ధులు నేర్పించటం, మంచి నడవడికను అలవరచుకునేలా చేయటం, భవిష్యత్తుకు బాటలు వేయటం ఇక్కడ జరుగుతున్నాయి. ఎల్‌కేజీ నుంచి యూనివర్సిటీ దిశగా విద్యాబోధన అందించేలా హీల్ ప్యారడైజ్ ఉన్నత శిఖరాలకు చేరుకుంది. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా మరో స్కూల్ ఏర్పాటు చేశారు. వారు తేలిగ్గా సంభాషించుకునేలా శిక్షణ ఇస్తారు. నైపుణ్యాన్ని పెంపొందించటానికి మరో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచే కెరీర్ వైపు సాగే విధానాలు కొనసాగుతాయి. అత్యున్నత ప్రమాణాలతో హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్లే స్కూల్ నుంచి టెన్త్ వరకు చదువుకునే అవకాశాన్ని కల్పించిన ఈ సంస్థ క్రమేణా ఇంటర్ విద్య కూడా ఉచితంగా అభ్యసించేలా ఏర్పాటు చేసింది. కాలేజీ విద్యార్థులకు ఉచిత వసతి ఉంటుంది. ఇంటర్ విద్యార్థుల కెరీర్‌ను తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో ఇంజనీరింగ్ విద్యలో అభ్యసించే కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఇంటర్‌దశలోనే పలు కంపెనీలు నైపుణ్యం ఆధారంగా ఉద్యోగాలిస్తున్నాయి. కోడింగ్-ఏఐ ల్యాబ్ సత్ఫలితాలనిస్తుండటంతో నిర్వాహకులు ఏకంగా డీమ్డ్ వర్సిటీనే ఏర్పాటు చేయాలని శ్రీకారం చుట్టి యూజీసీకి దరఖాస్తు చేశారు.

వలంటీర్లకు, దాతలకు ఆహ్వానం

హీల్ ప్యారడైజ్ పురోభివృద్ధికి నిర్వాహకులు దాతల సాయాన్ని స్వీకరిస్తున్నారు. వారిపేరుతోనే భవన నిర్మాణాలు చేపడుతున్నారు. పిల్లల సేవలకు వలంటీర్ల సేవలను తీసుకుంటున్నారు. ఎవరైనా స్వచ్ఛందంగా వచ్చి పిల్లలకు సేవలందించే మహాభాగ్యాన్ని కల్పిస్తున్నారు. పెద్ద సంఖ్యలో వలంటీర్లు సేవలందిస్తున్నారు.

హీల్ సేవలు విస్తృతం

హీల్ ప్యారడైజ్‌గా ఒకేచోట కేంద్రీకృతం కాకుండా సమాజంలో సేవలను విస్తరించాలన్న ఉద్దేశంతో గన్నవరంలో ఎయిర్‌పోర్టు వద్ద హీల్ ప్యారడైజ్ విలేజ్‌ను నిర్వహిస్తోంది. చోడవరంలో హీల్ సెంటర్, గుంటూరు దగ్గర హీల్ చిల్డ్రన్స్ విలేజ్, భద్రాచలంలో హీల్ స్కూల్‌ను నిర్వహిస్తోంది. ఏపీ, తెలంగాణలో 100 మోడల్ స్కూళ్లను నిర్వహిస్తోంది.

వెలకట్టలేని సేవలు.. కృత్రిమ కాళ్ల తయారీ కేంద్రం



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు హీల్ ప్యారడైజ్ ఎన్నో సేవలందిస్తోంది. ప్రతి వారం సగటున 2, 3 ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తోంది. కృత్రిమ కాళ్ల అమరిక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఎక్కడి వారికైనా సరే ఇక్కడ కృత్రిమ కాళ్ల కోసం రిజిస్టర్ చేసుకుంటే కొలతలు తీసుకుని కృత్రిమ కాళ్లను తయారుచేసి ఇస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కేంద్రానికి మంచి పేరు ఉంది. అంధ పిల్లలకు ప్రత్యేకంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నేతృత్వంలో పరీక్షలు నిర్వహించటంతో పాటు వారికి ఒకేషనల్ ట్రైనింగ్ కల్పిస్తోంది.

ప్రభుత్వ స్కూళ్లను ప్యారడైజ్‌గా మార్చేలా మాస్టర్ ప్లాన్

ప్రభుత్వం పాఠశాలలపై పెడుతున్న బడ్జెట్‌కు అనుగుణంగా తాము నిర్వహిస్తున్న హీల్ ప్యారడైజ్ మాదిరిగా ప్రతి స్కూల్‌ను తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించుకుని దాతల సాయంతో ముందుకు వెళ్లేందుకు నిర్దేశించుకుంది. ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను హీల్ ప్యారడైజ్‌లుగా తీర్చిదిద్దేలా అనుమతులిస్తే వాటి స్వరూప, స్వభావాలను మార్చివేస్తామని హీల్ ధృఢంగా విశ్వసిస్తోంది.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

పాలకుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- చర్చాగోష్టిలో వక్తలు

ధర్నాచౌక్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని పాలకుల నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాంగంలోని ప్రజల హక్కులు హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ‘రాజ్యాంగానికి ప్రమాదం-కాపాడుకోవాలి ప్రజలందరు’ అనే అంశంపై చర్చాగోష్టి స్థానిక హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న పలు సంఘటనలు తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యక్తులు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. దేశంలో అత్యధిక జనాభాకు ఉపాధి కల్పించే వ్యవసాయ రంగాన్ని కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ 56 రోజులుగా ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమంపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. విశాఖ ఉక్కుకు ఇనుప గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీఎం చంద్రబాబుకు సూచించారు. ఐలా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా మార్చేందుకు మనువాదులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌ఎస్ఎస్ భావజాలంతో బీజేపీ ప్రభుత్వం పాలన చేస్తుందన్నారు. న్యాయ, విద్యా వ్యవస్థలను మనువాదులతో నింపేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాజ్యాంగంపై దాడి జరుగుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన దేశం ఎటుపోతోంది? రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు, ప్రజలు ఏ నాటికి అభివృద్ధి అయ్యేను? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, ఐఏటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, భాస్కరరావు ప్రసంగించారు.

రూ. 50 లక్షలతో తారక రామమందిరం

- ఉంగుటూరులో ఆవిష్కరించిన దాసరి సోదరులు



ఉంగుటూరులో ఎన్టీఆర్, బసవతారకం దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, పారిశ్రామికవేత్త దాసరి జైరమేష్


ఉంగుటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తారక రామ మందిరం పేరిట స్వర్గీయ ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలను రూ. 50 లక్షల వ్యయంతో భారీగా ఏర్పాటు చేశారు. కృష్ణా జిల్లా, గన్నవరం నియోజకవర్గం, ఉంగుటూరు సెంటర్ (పుట్టగుంట వెళ్లే రోడ్డు)లో స్వర్గీయ ఎన్టీఆర్, బసవతారకం దంపతుల కాంస్య విగ్రహాలను శనివారం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, ఆయన సోదరుడు, పారిశ్రామికవేత్త జైరమేష్ కలిసి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చనిపోయిన ముహూర్త సమయంలోనే(తెల్లవారు జాము గం.4.20ని.లకు)విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఆ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఉంగుటూరు నాలుగురోడ్ల కూడలిలో ఆముదాలపల్లి వెళ్లే రోడ్డుకు ఆనుకుని వున్న 5 సెంట్ల సొంత స్థలంలో సుమారు 50 లక్షల వ్యయంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తారక రామమందిరం నిర్మాణం చేపట్టి అందులో ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలను ఏర్పాటుచేశారు. చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం పరిఢవిల్లేలా వివిధ రకాల పూలమొక్కలతో గార్డెన్, పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. కోనసీమ జిల్లా, కొత్తపేటలో ప్రముఖ శిల్పాచార్యులు వడయార్ చేతులమీదుగా రూపుదిద్దుకున్న విగ్రహాలను ఏడాది క్రితమే తెప్పించి తారకరామ మందిరంలో నెలకొల్పారు. ఎన్టీఆర్ కుటుంబసభ్యులు, వారసులతో అప్పట్లో విగ్రహాలను ఆవిష్కరించాలని భావించారు. వారసులకు డేట్‌లు కుదరకపోవటం, ఆ తర్వాత ఎన్నికలు రావటం, తదనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో వాయిదాపడుతూ వచ్చిన విగ్రహావిష్కరణ కార్యక్రమం చివరకు దాసరి సోదరుల చేతులమీదుగా జరగటంతో స్థానికులు, ఎన్టీఆర్ అభిమానులు హర్షం వ్యక్తంచేశారు. విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా దాసరి సోదరులు మాట్లాడుతూ విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా, మహానాయకుడిగా తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ కారణజన్ముడని ప్రశంసించారు. ఆ యుగపురుషుని విగ్రహాలను ఆవిష్కరించటం తమ పూర్వజన్మ సుకృతమన్నారు. తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తంచేసిన మహనీయుడు, తెలుగుప్రజల ఆరాధ్య దేవుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అంటే తమకు ఎనలేని అభిమానమని, ఆయన కుటుంబసభ్యులతో తమకు ఎన్నో ఏళ్లుగా సన్నిహిత సంబంధాలున్నాయని అన్నారు. సినీపరిశ్రమలో రారాజుగా, రాజకీయాల్లో మహానాయకుడిగా వెలుగొందిన ఎన్టీఆర్ కీర్తి సూర్యచంద్రులు ఉన్నంతకాలం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆ మహనీయుని జ్ఞాపకానికి గుర్తుగా హైదరాబాద్ అబిడ్స్‌లో ఎన్టీఆర్ నివసించిన ఇంటిని కొనుగోలుచేసి కొన్నేళ్లుగా నివాసముంటున్నట్లు జైరమేష్ తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు గుత్తా అనిల్‌కుమార్, దాసరి చంటి, పోతినేని రామకృష్ణ, దాసరి శ్రీకృష్ణ, దాసరి నాగేంద్ర, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఎన్‌బీఎం మురళీ, గొంది సాంబశివరావు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.


GOKULAM GOPALAN
CONFIDENT
RAGAM MOVIES
SVM
MOVIE MAXX
24TH JAN 2025
TOVINO THOMAS
IDENTITY
తెలుగులో
WRITTEN & DIRECTED BY
AKHIL PAUL – ANAS KHAN
PRODUCER
RAJU MALLIATH
PRODUCE
DR ROY C
2025 లో విడుదలైన తొలి మలయాళ సూపర్ హిట్ చిత్రం 40 కోట్లు వసూలు చేసి తెలుగులో యాక్షన్ థ్రిల్లర్ మూవీగా విడుదలవుతోంది.


యాక్షన్, ఎమోషన్, సెంటిమెంట్ అన్నీ కలిసిన అద్భుత చిత్రం
SRI HANUMAN MOVIE MAKERS
జనవరి 24 వస్తున్నారు
హాంగ్ కాంగ్ వారియర్స్
FROM DIRECTOR SOI CHEANG
IN TELUGU ENGLISH HINDI & TAMIL
TWILIGHT OF THE WARRIORS WALLED IN
FROM THE DIRECTOR OF MONKEY KING FRANCHISE
AVAILABLE IN ALL DIGITAL FORMATS
నైజాం: మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ LLP, మరట్వాడ, ఒరిస్సా: రాజశ్రీ ప్రొడక్షన్స్, సీడెడ్: N సినిమాస్, వైజాగ్: విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్,
ఈస్ట్, వెస్ట్: శ్రీ కనకదుర్గా ఫిలిమ్స్ - 9701399557, నెల్లూరు: UR సినిమాస్, కృష్ణ, గుంటూరు సంప్రదించండి: NVR సినిమా - 99669 63111, 79895 67742


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
BLOCKBUSTER HUNTING
A BOBBY KOLLI FILM
DAAKU MAHARAAJ
PRODUCED BY
SURYADEVARA NAGA VAMSI - SAI SOUJANYA
A THAMAN S MUSICAL
IN CINEMAS NOW


MEGA SANKRANTHI
PART 2
VALUE ZONE
AN aha ORIGINAL
MANSION HOUSE
UNSTOPPABLE 4
WITH NBK
ప్రభాస్ పెళ్లి ఎప్పుడు ?
గణపవరం అమ్మాయి ...
WATCH NOW
₹499/YEAR
SUBSCRIBE NOW
aha
MANA TELUGU APP
realme


SMT ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
GLOBAL STAR
RAM CHARAN
SANKRANTI BLOCKBUSTER
SHANKAR'S
GAME CHANGER
PRODUCED BY RAJU - SHIRISH
A THAMAN S MUSICAL
TELUGU - TAMIL - HINDI - KANNADA - MALAYALAM
NOW IN CINEMAS


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
#VENKYANIL03
BLOCKBUSTER PONGALUU
సంక్రాంతికి వస్తున్నాం
AN ANIL RAVIPUDI FILM
PRODUCER SHIRISH

బిజినెస్

విజయవాడ ● ఆదివారం 19 జనవరి 2025

సాపిజెన్ బయోలాజిక్స్ ప్లాంట్‌లో సింగపూర్ ప్రెసిడెంట్


హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ అనుబంధ విభాగమైన సాపిజెన్ బయోలాజిక్స్ వ్యాక్సిన్ల తయారీ ప్లాంట్‌ను సింగపూర్ అధ్యక్షులు థర్మన్ షణ్ముగరత్నం శనివారం సందర్శించారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా ఆయనకు స్వాగతం పలికారు. ఒడిశా, భువనేశ్వర్‌లోని బయోటెక్ పార్క్‌లో రూ.1,500 కోట్ల పెట్టుబడులతో, ఏటా 800 కోట్ల డోసుల వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కలరా, మలేరియా, పోలియో సహా 10 రకాల వ్యాక్సిన్లను ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నట్లు సాపిజెన్ బయోలాజిక్స్ తెలిపింది.

- గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్.. ఆటో ఎక్స్‌పోలో రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఈబ్లూ ఫియో జెడ్, ఫియో డీఎక్స్ సహా ఎలక్ట్రిక్ ఆటో ఈబ్లూ రోజీని ఆవిష్కరించింది. వీటితో పాటు కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ కోసం ఈబ్లూ కేర్ పేరుతో యాప్‌ను విడుదల చేసింది.
- బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో పెయింట్ ప్రొటెక్షన్ కంపెనీ గర్వారే హై-టెక్ ఫిల్మ్స్ జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా పెయింట్ ప్రొటెక్షన్ ఫిల్మ్స్ (పీపీఎఫ్) కోసం రిటైల్ ఫైనాన్స్ పథకాన్ని బజాజ్ ఫైనాన్స్ అందుబాటులోకి తీసుకురానుంది.

2030 నాటికి రూ.52 లక్షల కోట్లు

భారత ఆటోమొబైల్ రంగంపై గూగుల్-బీసీజీ నివేదిక అంచనా

న్యూఢిల్లీ: భారత వాహన పరిశ్రమ పరిమాణం 2030 నాటికి రెట్టింపు స్థాయి 60,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.52 లక్షల కోట్లు)కు చేరుకోవచ్చని టెక్నాలజీ దిగ్గజం గూగుల్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక అంచనా వేసింది. ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ ఆటో ఎక్స్‌పోలో ఈ నివేదికను విడుదల చేశారు. అంతర్జాతీయ ట్రెండ్‌కు భిన్నంగా భారత ఆటోమొబైల్ రంగం తనదైన వినూత్న మార్గంలో దూసుకెళ్తోందని నివేదిక పేర్కొంది. "భారత్ ఇప్పటికే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ పరిశ్రమగా ఎదిగింది. వచ్చే కొన్నేళ్లలో ఇండస్ట్రీ విప్లవాత్మక మార్పులకు లోనుకానున్నది. విద్యుత్ వాహనాల్లో అంతర్జాతీయ ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక వినియోగం వాహన తయారీదారులకు అత్యంత కీలకంగా మారింది. ఈ రంగంలో విజయం సాధించాలంటే, మారుతున్న వినియోగదారుల అభిరుచులు, అవసరాలకు అనుగుణమైన వాహనాలను మార్కెట్లోకి తీసుకురావాల్సి ఉంటుందని" బీసీజీ ఎండీ, పార్ట్‌నర్ నటరాజన్ శంకర్ అన్నారు. ప్రీ-పర్చేజ్ నుంచి ఇన్ వెహికిల్ ఎక్స్‌పీరియెన్స్, ఆఫ్టర్ సేల్స్ సర్వీస్ వరకు ఏఐ ద్వారా వినియోగదారులకు మంచి అనుభూతిని కలిగించడంతో పాటు వాహన విలువను పెంచేందుకు వీలుంటుందని గూగుల్ ఇండియా ఓమ్నీ చానల్ బిజినెస్ డైరెక్టర్ భాస్కర్ రమేశ్ అన్నారు. ఆటో రంగంలో ఆవిష్కరణలు, వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఇండస్ట్రీతో భాగస్వామ్యానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామన్నారు. నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..



వచ్చే ఐదేళ్లలో ప్రపంచ నం.1

భారత వాహన పరిశ్రమపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

- భారత్‌లో విద్యుత్ వాహనాల (ఈవీ)కు గిరాకీ వేగంగా పెరుగుతోంది. ప్రతి ముగ్గురు కొనుగోలుదారుల్లో ఒకరు ఈవీ కొనుగోలు ఆలోచనలో ఉన్నారు. ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలుదారులు ఆధునిక హంగులు, ఆధునిక టెక్నాలజీ, సమగ్రతకు ప్రాధాన్యమిస్తుండగా.. ఎలక్ట్రిక్ టూ వీలర్ వినియోగదారులు సౌకర్యం, అందుబాటు ధరలో లభిస్తుందా..?, వాస్తవికత అంశాలపై దృష్టి సారిస్తున్నారు.
- ఈవీల కొనుగోలు నిర్ణయంలో ఆ ఇంటి మహిళల ప్రభావం 52 శాతంగా ఉంది. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ ఇంజన్ వాహనాల కొనుగోలు విషయంలో ఇది 38 శాతంగా ఉంది.
- ఎలక్ట్రిక్, షేర్డ్, కనెక్టెడ్ మొబిలిటీ విభాగాల ఆదాయం 10,000 కోట్ల డాలర్ల (రూ.8.66 లక్షల కోట్లు) స్థాయికి చేరవచ్చని అంచనా.
- భారత వాహన వినియోగదారుల వినూత్న, వేగంగా మారుతున్న ప్రాధాన్యాలను ఇండస్ట్రీ వర్గాలు గుర్తించాల్సిన అవసరం ఉంది.

భారత వాహన పరిశ్రమ వచ్చే ఐదేళ్లలో ప్రపంచ నంబర్ వన్‌గా అవతరించనుందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. దేశీయ ఆటోమొబైల్ ఇండస్ట్రీ ఇప్పటివరకు 4.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించిందని, మిగతా రంగాలతో పోలిస్తే ఇదే అత్యధికమని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు, జీఎస్‌టీ రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక ఆదాయం పంచుతున్న రంగం కూడా ఇదేనన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) ఆధ్వర్యంలో శనివారం జరిగిన సదస్సులో మంత్రి ప్రసంగించారు. భారత్‌లో తయారైన వాహనాలకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉందన్నారు. దేశంలో తయారవుతున్న మొత్తం మోటార్ సైకిళ్లలో 50 శాతం విదేశాలకు ఎగుమతవుతున్నాయని అన్నారు. 2014లో తాను కేంద్ర రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు దేశీయ వాహన పరిశ్రమ సైజు రూ.7.5 లక్షల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం దేశీయ ఆటోమొబైల్ రంగ పరిశ్రమ సైజు రూ.22 లక్షల కోట్ల స్థాయికి చేరుకుందన్నారు. కాగా, యూఎస్ ఆటోమొబైల్ ఇండస్ట్రీ సైజు రూ.78 లక్షల కోట్లు, చైనా వాహన మార్కెట్ రూ.47 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయి.

ఎక్స్‌పోలో ఈవీలదే హవా

దేశ రాజధాని ఢిల్లీలో 'భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025' పేరుతో ప్రారంభమైన వాహనాల ప్రదర్శన పండగ సందడిగా సాగుతోంది. ఈ ఎక్స్‌పోలో రెండో రోజూ ఎలక్ట్రిక్ వాహనాలే ప్రధానంగా సందర్శకుల దృష్టిని ఆకర్షించాయి.



ప్యాసింజర్ వెహికిల్స్ సెగ్మెంట్లో వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్, చైనాకు చెందిన బీవైడీ తమ కొత్త వాహనాలను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించాయి. విన్‌ఫాస్ట్ తన లగ్జరీ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ లైన వీఎఫ్ 7, వీఎఫ్ 6ను ప్రదర్శించింది. ఈ రెండు మోడళ్లను ఈ ఏడాదిలోనే భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. బీవైడీ సైతం తన ఈఎస్‌యూవీ 'సీలియన్ 7'ను పరిచయం చేసింది.





ఎక్స్‌పో తొలిరోజున క్రెటా ఈవీని ఆవిష్కరించిన దక్షిణ కొరియా కంపెనీ హ్యుండయ్.. శనివారం ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌తో పాటు మైక్రో ఫోర్ వీలర్‌లో ఆధునిక కాన్సెప్ట్ మోడళ్లను పరిష్కరించింది.



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ దేశంలో తొలి డీ ప్లస్ సెగ్మెంట్ ఎస్‌యూవీ మజెస్టర్‌ను ఆవిష్కరించింది. బీఎండబ్ల్యూ దేశీయంగా తయారు చేసిన సరికొత్త ఎక్స్3 మోడల్‌ను విడుదల చేసింది. దీని ధర రూ.75.8 లక్షలుగా ఉంది.



ఎలక్ట్రిక్ బస్‌ల తయారీదారైన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఈ ఎక్స్‌పోలో 12 మీటర్ల బ్లేడ్ బస్ ప్లాట్‌ఫామ్‌పై రీడిజైన్ చేసిన బ్లేడ్ బ్యాటరీ చాసిస్‌తో పాటు 9 మీటర్ల సిటీ, 12 మీటర్ల కోచ్ బస్సులను ప్రదర్శించింది.

ఎక్స్ వర్క్స్ కాంట్రాక్టుల్లో ఐటీసీ ఎప్పుడు తీసుకోవాలి ?



ఇదీ GST

రాంబాబు గొండాల

నిర్మాణ రంగంలో ఉన్న ఒక ప్రముఖ కంపెనీ తాను నిర్మించబోయే వాణిజ్య సముదాయానికి కావాల్సిన సిమెంట్, స్టీల్, ఇతర ఇన్‌పుట్స్‌ను నేరుగా ఉత్పత్తిదారుల నుంచి కొనుగోలు చేయాలని భావించింది. దీనివల్ల స్థానిక మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకే తనకు కావాల్సిన ఇన్‌పుట్స్‌ను కొనవచ్చని భావించింది. అనుకున్న విధంగానే ఆయా కంపెనీలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కావాల్సిన సరుకును ఆయా ఫ్యాక్టరీల నుంచి నేరుగా పొందేట్లుగా ఎక్స్ వర్క్స్ కాంట్రాక్టు రాసుకున్నారు. దీని ప్రకారం ఫ్యాక్టరీ నుంచి నిర్మాణ స్థలానికి మధ్య జరిగే రవాణా, బీమా ఇతరత్రా ఖర్చులను కొనుగోలుదారుడే భరించాలి.

ఎక్స్‌వర్క్స్ అంటే అమ్మకపుదారుడు తన ఉత్పత్తిని కొనుగోలుదారునికి తన ఫ్యాక్టరీ గేటు దగ్గరే అందిస్తున్నట్లు లెక్క. కాబట్టి తదుపరి ఖర్చు మొత్తం కొనుగోలుదారుడే భరించాలి. ఇక్కడ ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే.. ఎక్స్ వర్క్స్ అంటే కేవలం రవాణా లాంటి ఖర్చు మాత్రమే కాదు. ఆ సరుకుకు సంబంధించిన పూర్తి యాజమాన్య హక్కులు కూడా కొనుగోలుదారునికి ఫ్యాక్టరీ గేటు దగ్గరే బదిలీ అవుతాయి. అంటే, ఒకసారి ఆ సరుకు ఫ్యాక్టరీ గేటు దాటితే.. ఆ సరుకుకు సంబంధించిన పూర్తి బాధ్యత కొనుగోలుదారునిదే. అమ్మకందారునికి ఎలాంటి బాధ్యత ఉండదు.

పైన చెప్పిన ఉదాహరణలో ఆ నిర్మాణ సంస్థ తనకు కావాల్సిన ఉత్పత్తులు స్థానికంగా లభ్యమైనప్పటికీ తక్కువ ధరకు పొందాలనే ఉద్దేశంతో నేరుగా ఫ్యాక్టరీ నుంచి కాంట్రాక్టు కుదుర్చుకుంది. నిజానికి ఇక్కడ ఎక్స్ వర్క్స్ అనేది తప్పనిసరి కాదు. రవాణా, ఇతర ఖర్చులు కలిపినా తనకు స్థానిక ధరలతో పోలిస్తే తక్కువకు వస్తుంది. కాబట్టి ఆ విధంగా కాంట్రాక్టు కుదుర్చుకుంది.

కొన్ని వ్యాపారాలకు తప్పనిసరి

అయితే, కొన్ని రకాల వ్యాపారాల్లో ఎక్స్ వర్క్స్ కాంట్రాక్ట్ అనేది తప్పనిసరి. ఉదాహరణకు ఆటోమొబైల్ రంగం. ఒక కారు డీలర్ తనకు కావాల్సిన కార్లను తప్పనిసరిగా ఎక్స్ వర్క్స్ ప్రాతిపదికనే కొనాలి. అంటే, కార్ల తయారీదారు, ఆ కారు డీలర్ కొనుగోలు చేసిన కార్లను ఎక్స్ వర్క్స్ ప్రాతిపదికన అంటే ఫ్యాక్టరీ గేటు దగ్గరే అందిస్తాడు. ఇలాంటి సందర్భాల్లో కొనుగోలు చేసిన కార్ల తాలూకు యాజమాన్య హక్కులు.. డీలర్ వేర్ హౌస్‌కో, షోరూమ్‌కో కార్లు చేరుకున్నప్పుడు కాకుండా కార్ల తయారీ స్థలంలోనే అంటే ఫ్యాక్టరీ గేటు దగ్గరే ఆ డీలర్ పొందుతాడు. ఉదాహరణకు హైదరాబాద్‌లో ఉన్న డీలర్ చెన్నైలోని ప్లాంట్‌లో కార్లు కొనుగోలు చేశాడు. రవాణాకు ఒక ఐదారు రోజుల సమయం పడుతుందని అనుకుందాం. అంటే జనవరి నెలాఖరులో కార్లు కొనుగోలు చేస్తే.. ఆ కార్లు డీలర్ దగ్గరకు చేరే సరికి జనవరి నెల పూర్తయి ఫిబ్రవరి మొదలవుతుంది. ఇలాంటి సందర్భాల్లో జీఎస్‌టీకి సంబంధించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందటానికి కొంత ఇబ్బంది ఎదురవుతుంది. ఐటీసీ నిబంధనల ప్రకారం ఒక వస్తువు మీద క్రెడిట్ తీసుకోవాలంటే ఆ వస్తువును కొనుగోలుదారుడు కచ్చితంగా పొంది ఉండాలి. అంటే, రిసీవ్ చేసుకుని ఉండాలి. మరి అలాంటప్పుడు ఈ కారు డీలర్ తాను కొనుగోలు చేసిన కార్లను ఎప్పుడు రిసీవ్ చేసుకున్నట్లు భావించాలి? వాటి మీద ఎప్పుడు క్రెడిట్ తీసుకోవాలి? కారు భౌతికంగా తన షోరూమ్‌లో పొందినది ఫిబ్రవరిలో కాబట్టి కార్లను అదే నెలలో పొందినట్లు భావించి ఫిబ్రవరి నెల రిటర్న్‌లో క్రెడిట్ తీసుకోవాలా? లేదా తనకు యాజమాన్య హక్కులు జనవరిలోనే బదిలీ అయ్యాయి కాబట్టి, జనవరిలోనే తాను కార్లు పొందినట్లు భావించి సంబంధిత ఐటీసీ జనవరి నెల రిటర్న్‌లో తీసుకోవాలా ? ఇలాంటి గందరగోళం ఎక్స్ వర్క్స్ లావాదేవీల్లో ఉండేది.

స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

ఈ గందరగోళాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల ఒక సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం, వస్తువులను రిసీవ్ చేసుకోవటం అంటే భౌతికంగా వస్తువులను పొంది ఉండాల్సిన అవసరం లేదు. ఎక్స్ వర్క్స్ ప్రాతిపదికన వస్తువులను కొనుగోలు చేసినప్పుడు.. ఆ వస్తువుల మీద సర్వ హక్కులు కొనుగోలుదారునికి ఫ్యాక్టరీ గేటు దగ్గరే సంక్రమిస్తాయి. కాబట్టి ఆ క్షణమే అతను ఆ వస్తువులను రిసీవ్ చేసుకున్నట్లు భావించాలి. ఐటీసీకి సంబంధించిన ఇతర నియమ నిబంధనలు సరిగ్గా ఉన్నట్లయితే, పైన చెప్పిన ఉదాహరణలో కారు డీలర్ తాను కొనుగోలు చేసిన కార్ల తాలూకు క్రెడిట్ జనవరి నెల రిటర్నులోనే తీసుకోవచ్చు. ప్రభుత్వం ఇచ్చిన ఈ వివరణతో ఎక్స్ వర్క్స్ కాంట్రాక్టుల్లో ఐటీసీ తీసుకోవటానికి స్పష్టత లభించింది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	136
వరంగల్	117	గుంటూరు	135
కరీంనగర్	117	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	104
కర్నూలు	117	నెల్లూరు	109
విశాఖపట్నం	132	అనంతపురం	109
గోదావరి	136		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ

హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	503
చిత్తూరు	503	విశాఖపట్నం	505

డజను గుడ్లు రూ. 72

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,110 ▼	74,350 ▼	1,04,000 ▲
విజయవాడ	81,800 ▼	77,000 ▲	93,000 ▼
విశాఖపట్నం	79,340 ▲	72,730 ▲	91,660 ▼
రాజమండ్రి	84,110 ▼	74,350 ▼	94,600 ▲
ప్రొద్దుటూరు	80,300 ▼	74,360 ▼	93,000 ▼
ముంబై	79,239	72,583	90,820

స్పోర్ట్స్

స్వియటెక్, సిన్నర్ దూకుడు

- టేలర్, పోలిని పరాజయం
- ఆస్ట్రేలియన్ ఓపెన్

ప్రీ క్వార్టర్స్‌లో ప్రవేశం



స్వియటెక్

మెల్‌బోర్న్: ప్రపంచ నెం.1 సిన్నర్, రెండో సీడ్ స్వియటెక్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ముందంజవేశారు. అయితే పురుషులు, మహిళల విభాగంలో నాలుగో సీడ్‌లు టేలర్ ఫ్రిట్జ్, జాస్మిన్ పోలిని, 10వ సీడ్ డానిలి కొలిన్స్‌కు మూడో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో..ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ స్వియటెక్ (పోలెండ్) 6-1, 6-0తో ఎమ్మా రదుకాను (బ్రిటన్)ను చిత్తు చేసి ప్రీక్వార్టర్స్‌కు చేరింది. టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 6-3, 6-4, 6-2తో గిరోన్ (అమెరికా)పై గెలిచి నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించాడు. నాలుగో సీడ్ ఫ్రిట్జ్ (అమెరికా)కు 3-6, 7-5, 7-6 (1), 6-4తో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) షాకిచ్చాడు. దిగ్గజం రోజర్ ఫెడరర్ తర్వాత 38 అంతకుమించి ఏళ్ల వయస్సులో ఆస్ట్రేలియన్ ఓపెన్ నాలుగో రౌండ్‌కు చేరిన ఆటగాడిగా మోన్‌ఫిల్స్ రికార్డు నెలకొల్పాడు. 28వ సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్) 2-6, 6-4, 6-0తో నాలుగో సీడ్ పోలిని (ఇటలీ)పై, 19వ సీడ్ కీస్ (అమెరికా) 6-4, 6-4తో తన దేశానికే చెందిన 10వ సీడ్ కొలిన్స్‌పై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో అడుగు పెట్టారు. ఆరో సీడ్ రిబకినా 6-3, 6-4తో యాస్ట్రెంస్కాపై, ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో 6-4, 3-6, 6-4తో జెబ్యూర్‌పై నెగ్గారు.పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో భారత ఆటగాడు బాలాజీ/రేయస్ వరేలా (మెక్సికో) 6-7 (7), 6-4, 3-6తో బోర్గెస్/కాబ్రల్ చేతిలో ఓడారు.

టైటిల్‌కు ఒకే అడుగు

- ఫైనల్లో భారత జట్లు
- నేడు నేపాల్‌తో పురుషులు, మహిళల ఢీ
- ఖోఖో వరల్డ్ కప్





న్యూఢిల్లీ: మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్‌లో ఆతిథ్య భారత జట్లు టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాయి. మహిళలు, పురుషుల విభాగాలలో మనోళ్లు ఫైనల్‌కు దూసుకుపోయారు. శనివారం జరిగిన మహిళల సెమీఫైనల్లో భారత్ 66-16 పాయింట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ఆదివారం జరిగే ఫైనల్లో నేపాల్‌తో భారత మహిళలు అమీతుమీ తేల్చుకుంటారు. మరో సెమీస్‌లో నేపాల్ 89-18 పాయింట్ల తేడాతో ఉగాండాపై గెలుపొందింది. హోరాహోరీగా సాగిన పురుషుల సెమీఫైనల్లో భారత్ 62-42 పాయింట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయంతో ఊపిరి పీల్చుకుంది. అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో అద్భుత ప్రదర్శన చేసిన సఫారీలు ఓ దశలో భారత్‌కు షాకిచ్చేలా కనిపించారు. నాలుగో టర్న్‌లో జూలు విదిలిచ్చిన మనోళ్లు దక్షిణాఫ్రికాకు చెక్ పెట్టారు. ఫైనల్లో నేపాల్‌ను భారత పురుషులు ఎదుర్కొంటారు. రెండో సెమీస్‌లో నేపాల్ 72-20 పాయింట్ల తేడాతో ఇరాన్‌ను ఓడించింది.

గుకేష్ శుభారంభం

విక్‌ఆన్ జీ (నెదర్లాండ్స్): వరల్డ్ చాంపియన్ డి.గుకేష్ టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ విభాగంలో శుభారంభం చేశాడు. శనివారం ప్రారంభమైన ఈ పోటీల్లో తొలి గేమ్‌లో స్థానిక జీఎం అనీష్ గిరితో తలపడిన గుకేష్ 41వ ఎత్తులో అతడికి చెక్ చెప్పి, బోణీ కొట్టాడు. ఉజ్బెకిస్థాన్ జీఎం అబ్దుసట్టోరోవ్‌తో పోటీపడిన ప్రజ్ఞానంద 46వ ఎత్తు దగ్గర డ్రా చేసుకున్నాడు. మరో భారత జీఎం లియోన్ లూక్ మెండోంకా 31 ఎత్తులో కీమెర్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

చాంపియన్స్ సైన్యమిదే



బుమ్రా



జైస్వాల్

జైస్వాల్‌కు పిలుపు ● సిరాజ్‌పై వేటు

- షమి, శ్రేయా‌స్‌కు దక్కిన చోటు
- బుమ్రాకూ బెర్త్ ● వైస్ కెప్టెన్‌గా గిల్
- చాంపియన్స్ ట్రోఫీ భారత జట్టు



మహ్మద్ షమి

ముంబై: పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా ఫిబ్రవరి 19 నుంచి జరిగే ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత వన్డే జట్టును ప్రకటించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును శనివారం వెల్లడించింది. విలేకరుల సమావేశంలో అగార్కర్‌తో పాటు కెప్టెన్ రోహిత్ పాల్గొన్నాడు. ఈ జాబితాలో మార్పు చేర్పులకు వచ్చే నెల 13 వరకు గడువుంటుంది. మరోవైపు ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు సైతం ఇదే జట్టు కొనసాగనుంది. ఇక రోహిత్ నేతృత్వంలోని ఈ టీమ్‌లో ఊహించినట్టుగానే వెటరన్ పేసర్ మహ్మద్ షమికి చోటు దక్కింది. అలాగే దేశవాళీల్లో ఫామ్ చాటుకున్న మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఏడాది తర్వాత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఓవరాల్‌గా జట్టులో ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, ఇద్దరు కీపర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు, నలుగురు బౌలర్లు ఉన్నారు.

బుమ్రాకు ఐదు వారాల విశ్రాంతి: ఆస్ట్రేలియా టూర్‌లో గాయపడిన స్టార్ పేసర్ బుమ్రాను కూడా జట్టులోకి తీసుకున్నారు. అతనికి ఐదు వారాల పాటు విశ్రాంతి అవసరమని, ఫిబ్రవరి మొదటి వారానికల్లా కోలుకోగలడని బోర్డు ఆశిస్తోంది. అయితే ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లకు తను సందేహమే కాబట్టి పేసర్ హర్షిత్ రాణాను బ్యాకప్ పేసర్‌గా తీసుకున్నారు.

జైస్వాల్‌కు చాన్స్: యశస్వీ జైస్వాల్ తొలిసారిగా భారత వన్డే జట్టులోకి వచ్చాడు. ఇప్పటిదాకా 23 టీ20, 19 టెస్టులు ఆడినా 50 ఓవర్ల మ్యాచ్ ఆడలేదు. అయితే రెండు ఫార్మాట్లలో అతడి భీకర ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుని జట్టు రిజర్వ్ ఓపెనర్‌గా ఎంపిక చేశారు. ఇక వికెట్ కీపర్లుగా పంత్, రాహుల్ వ్యవహరించనున్నారు. అలాగే విజయ్ హజారే ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో ఐదు శతకాలు, 779 రన్స్‌తో అదరగొట్టిన కరుణ్ నాయర్‌ను సెలెక్టర్లు పట్టించుకోలేదు.

పేస్ ఆల్‌రౌండర్ ఒక్కడే..: హార్దిక్, జడేజా, అక్షర్, సుందర్‌ల రూపంలో నలుగురు ఆల్‌రౌండర్లున్నారు. అయితే వీరిలో పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ ఒక్కడే. ఒకవేళ తను గాయపడితే బ్యాకప్ ప్లేయర్ లేడు. తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్‌కు చాన్స్ ఇచ్చి ఉంటే బావుండేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

భారత జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, యశస్వీ జైస్వాల్, కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, బుమ్రా, మహ్మద్ షమి, అర్ష్‌దీప్ సింగ్.

సిరాజ్‌పై వేటెందుకు?

ఇటీవలి కాలంలో భారత జట్టుకు రెగ్యులర్‌గా ఆడుతున్న హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ సెలెక్టర్ల నమ్మకం కోల్పోయాడు. ఆసీస్ టూర్‌లో తను అంచనాలను అందుకోలేకపోయాడు. దీంతో అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకున్నారు. 'బుమ్రా ఆడే విషయంలో స్పష్టత లేదు కాబట్టి మాకు కొత్త బంతితో ప్రభావం చూపి, డెత్ ఓవర్లలోనూ ఆకట్టుకునే బౌలర్ అవసరం. అందుకే మేం అర్ష్‌దీప్‌ను తీసుకున్నాం. దురదృష్టవశాత్తూ సిరాజ్‌కు చోటు దక్కలేదు. ఎందుకంటే తను కొత్త బంతితో ఆకట్టుకోలేకపోతున్నాడు' అని కెప్టెన్ రోహిత్ స్పష్టం చేశాడు.

గిల్ మరోసారి

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్, చాంపియన్స్ ట్రోఫీకి కూడా శుభ్‌మన్ గిల్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గతంలో శ్రీలంక పర్యటనలోనూ అతను వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. దీంతో గిల్‌ను పరిమిత ఓవర్లలో భవిష్యత్ కెప్టెన్‌గా సెలెక్టర్లు పరిగణిస్తున్నట్టు విశ్లేషిస్తున్నారు. గతంలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు

రంజీల్లో ఆడుతున్నా..



ముంబై: భారత కెప్టెన్ రోహిత్ శర్మ ముంబై జట్టు తరపున రంజీ ట్రోఫీలో ఆడనున్నాడు. ఈనెల 23 నుంచి జమ్మూ కశ్మీర్‌తో జరిగే మ్యాచ్‌లో తాను బరిలోకి దిగనున్నట్టు రోహిత్ తెలిపాడు. 2015 నవంబరులో హిట్‌మ్యాన్ చివరి రంజీ ఆడాడు. భారత ఆటగాళ్ల ఆసీస్ పర్యటనలో విఫలం కావడంతో బీసీసీఐ పలు మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా అందుబాటులో ఉండే ఆటగాళ్లంతా దేశవాళీల్లో ఆడాల్సిందేనని తేల్చింది. ఆసీస్ టూర్‌లో రోహిత్ నాలుగు టెస్టుల్లో 31 పరుగులే చేసి విమర్శల పాలయ్యాడు. అయితే ఎవరూ కావాలని రంజీలకు దూరంగా ఉండరని, తమ బిజీ షెడ్యూల్ కారణంగా తగిన విశ్రాంతిని కోరుకుంటామని రోహిత్ వివరించాడు.



కర్ణాటక పాంచ్ పటాకా

ఐదోసారి విజయ్ హజారే టైటిల్

ఫైనల్లో విదర్భ చిత్తు

వడోదర: టోర్నీ ఆసాంతం అదరగొట్టిన కర్ణాటక ఫైనల్లోనూ అదే జోరును కనబరచి విజయ్ హజారే ట్రోఫీని కైవసం చేసుకుంది. రవిచంద్రన్ స్మరణ్ (92 బంతుల్లో 101) శతకంతో కదం తొక్కడంతో శనివారం జరిగిన ఫైనల్లో మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని కర్ణాటక 36 పరుగులతో విదర్భపై నెగ్గింది. తొలుత కర్ణాటక 50 ఓవర్లలో 348/6 స్కోరు చేసింది. అభినవ్ (79), శ్రీజిత్ (78) సత్తా చాటారు. ఛేదనలో విదర్భ 48.2 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్ షోరే (110) సెంచరీతో పోరాడాడు. చివర్లో దూబే (63) ఆశలు రేపాడు. అయితే అభిలాష్ అతడిని అవుట్ చేసి కర్ణాటకకు ఊరట నిచ్చాడు.

సంక్షిప్తస్కోర్లు: కర్ణాటక: 50 ఓవర్లలో 348/6 (స్మరణ్ 101, అభినవ్ 79, కృష్ణన్ 78, దర్శన్ 2/67, నచికేత్ 2/70); **విదర్భ:** 50 ఓవర్లలో 312 ఆలౌట్ (ధ్రువ్ 110, దూబే 63, కౌశిక్ 3/47, అభిలాష్ 3/58, ప్రసిద్ధ్ 3/84).

పాక్‌కు ఆధిక్యం

విండీస్‌తో తొలి టెస్టు

ముల్తాన్: పాకిస్థాన్-వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టులో స్పిన్నర్లు కదం తొక్కారు. రెండో రోజు శనివారం ఆటలో ఇరు జట్ల నుంచి ఏకంగా 19 వికెట్లు నేలకూలడం విశేషం. పాక్ గడ్డపై టెస్టుల్లో ఒకే రోజు ఇన్ని వికెట్లు పడడం ఇదే తొలిసారి. ముందుగా పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 230 పరుగులకు ఆలౌటైంది. సాద్ షకీల్ (84), రిజ్వాన్ (71) మాత్రమే రాణించారు. ఆ తర్వాత విండీస్ తొలి ఇన్నింగ్స్ 137 పరుగులకే ముగిసింది. స్పిన్నర్లు నోమన్ అలీ (5/39), సాజిద్ ఖాన్ (4/65) వణికించారు. ఆట ముగిసే సమయానికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 109/3 స్కోరుతో నిలిచింది. ప్రస్తుతం జట్టు 202 పరుగుల ఆధిక్యంలో ఉంది.

సాత్విక్ జోడీకి నిరాశ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి నిరాశే మిగిలింది. శనివారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 18-21, 14-21తో నూర్ ఇజ్జుద్దీన్-గోహ్ ఫీ (మలేసియా) చేతిలో పోరాడి ఓడింది. 2022లో ఈ ట్రోఫీ నెగ్గిన సాత్విక్ జోడీ ఈసారి టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగింది. అయితే నూర్-గోహ్ ద్వయం వారి ఆశలకు గండికొట్టింది.

ఆసీస్, దక్షిణాఫ్రికా శుభారంభం

అండర్-19 టీ20 ప్రపంచ కప్

కౌలాలంపూర్: అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ శుభారంభం చేశాయి. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొమ్మిది వికెట్లతో నెగ్గింది. తొలుత స్కాట్లాండ్ 15.1 ఓవర్లలో 48 పరుగులకే కుప్పకూలగా, లక్ష్యాన్ని ఆసీస్ జట్టు 6.4 ఓవర్లలో పూర్తి చేసింది. ఇంకో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 22 పరుగులతో న్యూజిలాండ్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు నేపాల్‌పై నెగ్గింది. ఇంగ్లండ్-ఐర్లాండ్ మ్యాచ్ వర్షంతో అర్ధంతరంగా ముగిసింది. ఇక నైజీరియా-సమోవా, పాకిస్థాన్-అమెరికా మ్యాచ్‌లు ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి.

కలబందతో కాంతివంతంగా...

ముఖం మీద చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. వాతావరణ కాలుష్యం, సూర్య కిరణాలు, చలి గాలులవల్ల ముఖం నిగారింపు కోల్పోతుంటుంది. కలబంద గుజ్జుతో చిన్న చిట్కాలు పాటిస్తే మెరిసే చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు.

- ఒక చెంచా కలబంద (అలోవెరా) గుజ్జులో అర చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖమంతా పట్టించాలి. పది నిమిషాలు ఆరిన తరవాత మంచి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తూ ఉంటే ఎండ వల్ల వచ్చిన నలుపుదనం తగ్గుతుంది. చర్మానికి తేమ అంది ముఖం నున్నగా మెరుస్తుంది.
- రెండు చెంచాల కలబంద గుజ్జులో మూడు చెంచాల కీర గుజ్జు వేసి కలపాలి. దీనిని ముఖానికి పట్టించాలి. కళ్ల మీద కీర చక్రాలు పెట్టుకోవాలి. అరగంట విశ్రాంతి తీసుకున్న తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఓసారి చేస్తూ ఉంటే ముఖం కాంతివంతంగా మారుతుంది.



- ఒక అంగుళం కలబంద ముక్క నుంచి గుజ్జును తీసి దానికి రెండు చెంచాల గ్రీన్ టీ నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో కొద్దిగా తీసుకుంటూ నుదుటి మీద, కళ్ల కింద, బుగ్గల మీద రాయాలి. ఇరవై నిమిషాలు ఆరిన తరవాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారం రోజులు చేస్తే నుదుటి మీద గీతలు, కళ్ల కింద వలయాలు, మూతి చుట్టూ ముడతలు తగ్గిపోతాయి. చర్మం బిగుతుగా మారుతుంది.
- అర చెంచా కలబంద గుజ్జులో ఒక ఇ విటమిన్ క్యాప్సూల్ లోని నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పలుచగా ముఖమంతా రాయాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తూ ఉంటే ముఖం మీద మొటిమలు, గుల్లలు రావు. ఈ చిట్కా పొడి చర్మం ఉన్న వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.
- ఒక చెంచా కలబంద గుజ్జులో రెండు చెంచాల నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. పది నిమిషాల తరవాత మంచి నీళ్లతో కడిగేసుకుంటే ముఖం మీద ఉండే జిడ్డు, మురికి తొలగిపోయి ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఈ చిట్కా జిడ్డు చర్మం ఉన్నవారికి బాగా పనిచేస్తుంది.

ఈ గింజలు ఔషధంలా పని చేస్తాయి

చియా గింజలను సాధారణంగా సలాడ్స్, స్మూతీలు, పండ్ల రసాలు, పాలు, కొబ్బరి నీళ్లలో కలుపుకుని తీసుకుంటూ ఉంటారు. ఇవి శరీరాన్ని నాజూగ్గా ఉంచడంతోపాటు అంతర్గత అవయవాలను శుద్ధి చేసి జీవక్రియలు సక్రమంగా జరిగేలా చేస్తాయి. రాత్రి పూట చియా గింజలను నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే అనారోగ్య సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు.



జీర్ణక్రియకు: చియా గింజల్లో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. తరచూ చియా గింజలను తీసుకోవడం వల్ల పేగు కదలికలు మెరుగుపడి జీర్ణాశయం పరిశుభ్రమవుతుంది. మలబద్ధకం లాంటి సమస్యలు రావు.

బరువుకు: ఈ గింజలను నీటిలో నానబెట్టినపుడు అవి అధికంగా నీటిని పీల్చుకుని జెల్లీ రూపంలోకి మారతాయి. వీటిని ఆహారంలో చేర్చుకుంటే కడుపులో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో ఏదో ఒకటి తినాలనే కోరిక తగ్గి ఆకలి అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది.

కండరాలకు: చియా గింజల్లో అత్యధికంగా ప్రొటీన్లు, అమైనో యాసిడ్లు ఉంటాయి. ఇవి కండరాలను బలోపేతం చేస్తాయి. కండరాల నొప్పి, నరాల బలహీనత, మోకాళ్ల నొప్పులు తదితర సమస్యలను నివారిస్తాయి.

గుండెకు: చియా గింజలు తినడం వల్ల శరీరానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఆల్ఫాలినోలెనిక్ యాసిడ్ లభిస్తాయి. దీని వల్ల రక్తంలో లిపిడ్ ప్రొఫైల్ పెరిగి గుండె జబ్బులు దరిచేరవు.

ఎముకలకు: చియా గింజల్లో కాల్షియం, మెగ్నీషియం, పాస్ఫరస్ ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజూ చియా గింజలను తీసుకోవడం వల్ల ఎముకల్లో సాంద్రత పెరుగుతుంది. ఎముకలు పెళుసుగా మారడం, ఆర్థరైటిస్ లాంటి సమస్యలు తగ్గుతాయి.

సినిమా బాగుంటే ఏదీ ఆపలేదు...



మూడేళ్లుగా సంక్రాంతికి వరుస విజయాలు అందుకుంటున్న దర్శకుడు అనిల్ రావిపూడి. తాజాగా ఆయన తీసిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం కూడా విజయం సాధించింది. ఈ నేపథ్యంలో అనిల్ రావిపూడిని 'నవ్య' పలుకరించింది.

» సినిమా విజయాన్ని మీరు ఎలా ఆస్వాదిస్తున్నారు?

ఇది నాకు మూడో సంక్రాంతి... మూడో విజయం... అంటే హ్యాట్రిక్. ఇది దిల్ రాజుగారితో ఆరో సినిమా. ప్రేక్షకులు మేము అనుకున్న దానికన్నా ఎక్కువ విజయాన్ని ఇచ్చారు. అన్ని వర్గాలవారు ఈ సినిమాకు వస్తున్నారు. నవ్వుకుంటున్నారు. నిన్న రాత్రి మహేష్ బాబు గారిని కలిశాం. ఆయనకు సినిమా బాగా నచ్చింది. మహేష్‌గారికి ఈ తరహా కామెడీ చాలా నచ్చుతుంది. ఆయనకు సెకండాఫ్ స్క్రీన్‌ప్లే, బుడ్డాడు, ఉపేంద్ర లమ్మేల కామెడీ ఎంతో నచ్చాయి. సినిమా చూస్తున్నంతసేపూ ఆయన పిల్లలు సితార, గౌతమ్ నవ్వుతూనే ఉన్నారట!

» ఈ మధ్యకాలంలో సినిమాల విజయాలను సోషల్ మీడియా ప్రభావితం చేస్తోందనే వాదన వినిపిస్తోంది..!

సోషల్ మీడియా సినిమా ఫలితాలను ప్రభావితం చేస్తుందంటే నేను నమ్మను. సినిమాలో విషయం ఉంటే ఏ సోషల్ మీడియా ఆపలేదు. ప్రేక్షకులకు నచ్చిన కంటెంట్ ఇవ్వగలిగితే వాళ్లే ఆ సినిమాను నెత్తిమీద పెట్టుకొని తీసుకువెళ్తారు. బావుంటే ఆడకుండా ఉండదు. సోషల్ మీడియాలో ఎంత నెగిటివ్ చేసినా విజయాన్ని ఆపలేరు. సినిమా బావుంటే- దాన్ని ఆపే శక్తి దేనికీ లేదు.

» మీరు సోషల్ మీడియాలో ట్రోల్స్‌ను, ప్రచారాలను పట్టించుకొంటారా?

సోషల్ మీడియాలో ట్రోల్స్ నా మీదే కాదు... అందరి మీద వస్తున్నాయి. వీటివల్ల ప్రభావితం అవుతున్నారు. అయితే ట్రోల్స్‌తో పాటుగా కొన్నిసార్లు ప్రశంసలు కూడా వస్తున్నాయి. జాగ్రత్తగా చూస్తే... సోషల్ మీడియా మన సమాజానికి ప్రతిబింబం. మంచి, చెడులు రెండూ ఉంటాయి. మంచితో పాటుగా వెళ్లిపోతే సమస్య ఉండదు. ఇక వ్యక్తిగతంగా నేను సోషల్ మీడియా ట్రోల్స్‌ను పెద్దగా పట్టించుకోను. నా ఫ్రెండ్స్ కొందరు ట్రోల్స్‌వల్ల ఇబ్బంది పడుతూ ఉంటారు. పట్టించుకోవద్దని వాళ్లకు కూడా చెబుతుంటాను. మనల్ని పొగిడేవాళ్లు ఎక్కడ ఉన్నారో అక్కడికి వెళ్లి, వాళ్ల ద్వారా ఆనందాన్ని పొందటం మంచిది. లక్ష మంది పొగుడుతున్నపుడు ఒకరిద్దరు విమర్శించినా పట్టించుకోకూడదు.

» 'ఇప్పుడు ప్రేక్షకులు కొత్తదనం కోరుకుంటున్నారు. వారు మారిపోయారు' అనే వాదనలతో మీరు ఏకీభవిస్తారా?

'ప్రేక్షకులు మారిపోయారు' అనే వాదనను నేను వేరే కోణం నుంచి చూస్తాను. ప్రతి పదేళ్లకు ప్రేక్షకుల అభిరుచుల్లో తేడాలు వస్తాయి. దీనికి తగినట్లే కథలు, స్క్రీన్‌ప్లే, నిర్మాణ పద్ధతుల్లో మార్పులు వస్తాయి. దీన్ని పట్టుకొని ముందుకు వెళ్లాలి. నా ఉద్దేశంలో హారర్, యాక్షన్, ఫ్యామిలీ, కామెడీ- ఇలా అన్ని రకాల సినిమాలనూ చూసే ప్రేక్షకులు ఎప్పుడూ ఉంటారు. వాళ్లను థియేటర్లకు రప్పించాలంతే!

» సినిమాలో ఏదో ఒక కొత్త ప్రపంచాన్ని చూపించకపోతే ప్రేక్షకులు థియేటర్‌కు రావటం లేదని కొందరు అంటున్నారు. మీరేమంటారు?

నాకు ఈ వాదన సరికాదని అనిపిస్తుంది. 'డీజే టిల్లు'ను తీసుకోండి. దానిలో కొత్త ప్రపంచమేదీ లేదు కదా! 'సంక్రాంతికి వస్తున్నాం'లో రాజమండ్రిలోని శివరాజు అనే కుటుంబంలోకి తీసుకువెళ్లగలిగాం. సినిమా నచ్చితే చాలు... చూస్తారు. అయితే ఇక్కడ ఇంకో విషయం కూడా ఉంది. కొవిడ్ తర్వాత ప్రేక్షకులు చాలా ఆలోచించి కానీ సినిమాలకు రావటం లేదు. అందువల్ల ట్రైలర్, టీజర్ దగ్గర నుంచి చాలా జాగ్రత్తగా ప్రేక్షకులకు అందించాలి. అప్పుడే వాళ్లు థియేటర్‌కు వస్తారు.

» ప్రతి సీన్‌కు ఒక ఎలివేషన్, పావుగంటకు ఒక ట్విస్ట్ లేకపోతే ప్రేక్షకులు సినిమాలు చూడటం లేదనే వాదన కూడా ఉంది కదా!

స్టార్ల సినిమాల్లో ఇవి తప్పనిసరి. ఎందుకంటే స్టార్లతో తీసే సినిమాలలో హీరోని సెలబ్రేట్ చేయాలి. కథతో పాటుగా ఇలాంటి సెలబ్రేషన్‌వల్ల ప్రేక్షకుల్లో ఉత్సుకత పెరుగుతుంది. కథ, డ్రామా కన్నా హీరోని ఎంత ఎలివేట్ చేయగలిగితే అంత విజయం సాధిస్తుంది. స్టార్ హీరో చూడటానికి వెళ్లిన ఫ్యాన్స్... క్లాప్స్ కొట్టాలి. విజిల్స్ వేయాలి. అదే దర్శకుడి మొదటి లక్ష్యం. మిగిలినదంతా ఆ తర్వాతే! ఒకవేళ ఇలాంటి ఉత్సాహం కలిగించటంలో విఫలమయితే సినిమా ఫెయిల్ అయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. ఫ్యాన్స్‌కు ఉత్సుకత కల్పించి- మంచి కథను కూడా ఇవ్వగలిగితే అది నెక్ట్స్ లెవెల్ అవుతుంది. అద్భుతం అవుతుంది.

> **మెగాస్టార్‌తో సినిమా...**
>
> చిరంజీవి గారితో సినిమా ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఒక కథ లైన్ అనుకున్నాం. అది ఆయనకు నచ్చింది. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం...' అయిపోయింది కాబట్టి దానిమీద వర్క్ చేయాలి. ఆయనకు చెప్పాలి. ఆ తర్వాత ఎప్పుడు టేకాఫ్ అవుతుందనే విషయాన్ని ప్లాన్ చేయాలి.

» ఈ సెలబ్రేషన్ మూడ్‌లో పడిపోయి నిజమైన కథను మర్చిపోతున్నామా?

పాన్ ఇండియా మార్కెట్ విస్తరించిన తర్వాత ప్రతి రెండేళ్లకో, మూడేళ్లకో హీరో సినిమా వస్తోంది. అప్పుడు దాన్ని సెలబ్రేట్ చేయాల్సిందే! ఒకప్పుడు ఒక స్టార్‌వి ఆరేడు సినిమాలు వచ్చేవి. ఇప్పుడు ఒకటే వస్తోంది. కొన్నిసార్లు రెండేళ్లకు ఒకటి వస్తోంది. మనకు ఆరుగురు పెద్ద స్టార్స్ ఉన్నారనుకుందాం. ఆరుగురి సినిమాలూ రావటం లేదు. అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. నార్త్ మార్కెట్‌ను చూసుకోవాలి. అక్కడ ఎలాంటి సినిమాలు చూస్తున్నారో గమనించి- దానికి తగినట్లుగా తీయాలి. నార్త్ ఇండియాలో ఎలివేషన్స్, మాస్ కంటెంట్‌ను బాగా చూస్తున్నారు. దీనివల్ల మిగిలిన సినిమాలకు కొంత స్పేస్ చిక్కుతోంది.



> **డ్యాన్సర్‌ని...**
>
> చిన్నప్పటి నుంచి నేను డ్యాన్సర్‌ని. స్కూల్లో ప్రైజ్‌లు కొట్టేవాడిని. మ్యూజిక్ వింటే చాలు ఊగిపోతా!

» ఈ ఉత్సాహంలో ఒకే రకం కథలు వస్తున్నాయనే విమర్శ కూడా ఉంది..!

ప్రేక్షకులు సినిమాలు చూడకపోతే అనుకోవాలి. ఇలాంటి సినిమాలకు బ్రహ్మరథం పడుతున్నప్పుడు అలాంటి కామెంట్ చేయటానికి నేను ఇష్టపడను. ఒక వర్గం ప్రేక్షకులు ఈ తరహా సినిమాలు చూడటానికి ఇష్టపడుతున్నారు. అన్ని వర్గాలు వస్తున్నారా అంటే చెప్పలేను. కానీ మొదటి వారం రోజుల్లో కలెక్షన్స్ వచ్చేస్తున్నాయి కదా! ఈ సినిమాలను ఎంత మంది ప్రేక్షకులు చూస్తున్నారనే విషయం గమనిస్తే సినిమా విజయవంతమైందో లేదో తెలుస్తుంది కదా!

» మలయాళంలో తక్కువ బడ్జెట్‌లో తీసిన సినిమాలు విజయవంతం అవుతాయి కదా...

మలయాళంలో తీసే సినిమాలు వేరుగా ఉంటాయి. వాళ్లు తక్కువ ఖర్చుతో త్వరగా తీస్తారు. కొన్ని సినిమాలైతే కోటి, రెండు కోట్ల రూపాయలతో అయిపోతాయి. మలయాళం ప్రేక్షకుల అభిరుచులు కూడా భిన్నంగా ఉంటాయి. అవి వాళ్లకు నచ్చుతాయి. మన ప్రేక్షకులు వేరు.

» అయితే ఇదంతా తెలుగు ప్రేక్షకుల అభిరుచులవల్లే అంటారా?

మన డైరక్టర్లు కొన్ని తరహా సినిమాలు తీస్తే చూడటానికి ప్రేక్షకులు ఇష్టపడరు. అదే తరహా సినిమాని ఇతర భాషా దర్శకులు తీస్తే చూస్తారు. నన్నే ఉదాహరణగా తీసుకోండి. నా దగ్గర నుంచి ప్రేక్షకులు కొన్ని రకాల సినిమాలు ఇష్టపడతారు. దానికి భిన్నంగా తీస్తే చూడరు. నాకు 'కాంతార' లాంటి సినిమా తీయాలని ఉంటుంది. కానీ తీస్తే... ప్రేక్షకులు చాచి కొడతారు. ప్రేక్షకులకు ఏం కావాలో అర్థం చేసుకొని, దానికి తగినట్లుగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ, మార్కెట్‌ను అర్థం చేసుకుంటూ సినిమా తీయగలిగితే విజయం సాధించగలుగుతాం.

> **సినిమా... ఓ లాటరీ**
>
> నా ఉద్దేశంలో ప్రతి సినిమా ఒక లాటరీ లాంటిది. నేను తీసిన 'సంక్రాంతికి వస్తున్నాం' కూడా ఒక లాటరీనే కదా! ఈ సినిమా రాజుగారికి ఊపిరి పోసింది. హిట్ అయి రెవెన్యూ వస్తోంది కాబట్టి మాట్లాడుకుంటున్నాం.. నిజం చెప్పాలంటే ఏ సినిమా ఎందుకు విజయవంతమవుతుందో మనం చెప్పలేం! అది తెలిస్తే అందరూ హిట్ సినిమాలే తీస్తారు కదా!

» దర్శకుడు బాబీ వంటివారు బాలీవుడ్‌కు వెళ్తున్నారనే వార్తలొస్తున్నాయి. మీకూ అలాంటి ఆలోచన ఉందా?

నాకు అలాంటి ఆలోచన లేదు. చక్కగా తెలుగు సినిమాలు తీసుకోవాలని ఉంది. మన ప్రేక్షకులకు ఏడాది ఒక సినిమా ఇచ్చుకుంటూ వెళ్తా!

• సివిఎల్ఎన్ ప్రసాద్

చిత్రజ్యోతి

SINCE 1965

తమన్ ఆవేదన.. చిరంజీవి ఓదార్పు



'డియర్ తమన్..నిన్న నువ్వు మాట్లాడిన మాటలు హృదయాన్ని తాకేలా ఉన్నాయి. ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ ఉండే నీలో ఇంత ఆవేదన ఉండటం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. మనసు ఎంత కలత చెందితే నువ్వు ఇంతగా స్పందించావో అని అనిపించింది' అని చిరంజీవి అన్నారు. ఇటీవలె నిర్వహించిన 'డాకు మహారాజ్' విజయోత్సవ సభలో తమన్ మాట్లాడుతూ 'నెగెటివ్ ట్రోల్స్ వల్ల తెలుగు సినిమా ఇండస్ట్రీ పరువు పోతోంది. అలాంటి వాటి వల్ల సినిమా చాలా నష్టపోతోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చిరంజీవి స్పందించారు. 'సినిమా అయినా, క్రికెట్ అయినా, మరో సామాజిక సమస్య ఏదైనా సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరు తమ మాటల ప్రభావం ఆయా వ్యక్తుల మీద ఎలా ఉంటుందోనని ఆలోచించాలి' అని 'ఎక్స్'లో పోస్టు చేశారు.


వినోదంతో పాటు సందేశం



- సుకుమార్

దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, శేష సింధూరావు నిర్మించారు. ఈ నెల 24న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ "సుకృతి నటన చూసి షాకయ్యాను. సినిమాలో వినోదంతో పాటు సందేశం కూడా ఉంది" అని అన్నారు. ఇది అందరి మనసుల్ని హత్తుకునే సినిమా అని దర్శకురాలు పద్మావతి చెప్పారు.

మాట వినాలి గురుడా!



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎమ్.రత్నం నిర్మిస్తున్నారు. 'కంగువ', 'డాకు మహారాజ్' చిత్రాలతో ప్రతినాయకుడిగా ఆకట్టుకున్న బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్, నర్గిస్ ఫక్రీ కథానాయికలు. ఈ సినిమా నుంచి మొదటి పాటను విడుదల చేశారు. ఈ పాటను పవన్ కల్యాణ్ పాడారు. 'మాట వినాలి గురుడా మాట వినాలి.. మాట వినాలి మంచి మాట వినాలి' అని సాగే ఈ గీతానికి పెంచల్ దాస్ సాహిత్యం, కీరవాణి సంగీతం అందించారు. మార్చి 28న విడుదలవుతోంది.

ఆదరిస్తే మరిన్ని మంచి చిత్రాలు వస్తాయి



- దర్శకుడు ముత్యాల సుబ్బయ్య

రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'తల్లి మనసు'. వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య తనయుడు అనంత కిశోర్ నిర్మించారు. ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ 'తల్లికి ఎన్ని నిర్వచనాలు ఇచ్చినా సరిపోవు. అలాంటి తల్లి సబ్జెక్టును తీసుకొని సినిమా చేశాం. ప్రేక్షకులు కథలో, పాత్రలలో పూర్తిగా నిమగ్నమయ్యే విధంగా సినిమా వచ్చింది. ఇలాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే మరిన్ని మంచి సినిమాలు వస్తాయి' అని అన్నారు. దర్శకుడు వి. శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఓ తల్లి ఎలాంటి సంఘర్షణలకు గురయ్యిందన్న అంశాన్ని ప్రేక్షకులకు హత్తుకునేలా వైవిధ్యంగా చెప్పాం' అని తెలిపారు.

వేసవి వినోదం



నితిన్ హీరోగా నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్ హుడ్' విడుదల తేదీ ప్రకటించారు. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాను మార్చి 28న విడుదల చేస్తున్నామనీ, వేసవిలో మంచి వినోదాన్ని అందించే సినిమా ఇదని నిర్మాతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ చెప్పారు. నితిన్‌తో ఇంతకుముందు 'భీష్మ' చిత్రాన్ని రూపొందించిన వెంకీ కుడుముల 'రాబిన్‌హుడ్'ని ఆసక్తికరంగా రూపొందించారని తెలిపారు. కేతిక శర్మ పాల్గొన్న సెకండ్ సింగిల్ కొన్ని రోజుల్లో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

నవ్వుల విందు



సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ హీరోలుగా కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. 'మ్యాడ్' చిత్రానికి సీక్వెల్‌గా సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 29న విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ పోస్టర్‌ని విడుదల చేశారు. 'మీరు హ్యాండిల్ చేయగలిగిన దానికంటే ఎక్కువ వినోదం, మీరు ఊహించిన దానికంటే ఎక్కువ మ్యాడ్‌నెస్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ సీక్వెల్‌తో మరోసారి నవ్వుల విందును అందించబోతున్నారు దర్శకుడు కల్యాణ్ శంకర్.

రెండు భాషల్లో 'రాక్షస'...



కన్నడ నటుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించిన ద్విభాషా చిత్రం 'రాక్షస'. అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. లోహిత్ హెచ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం వచ్చే నెల 26న కన్నడతో పాటు తెలుగులోనూ విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగు హక్కులను నిర్మాత ఎం.వీ.ఆర్.కృష్ణ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. మంచి కంటెంట్ ఉన్న ఈ చిత్రం తప్పకుండా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని అన్నారు.

అందుకే న్యూజిలాండ్ వెళ్లాం



'కన్నప్ప' చిత్రం షూటింగును న్యూజిలాండ్‌లో చేయడానికి ప్రధాన కారణం అక్కడి పచ్చదనంతో కూడిన రమణీయ ప్రదేశాలేనని హీరో మంచు విష్ణు అన్నారు. ఆయన హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ రూపొందించిన 'కన్నప్ప' చిత్రం తమిళ ట్రైలర్‌ను శనివారం చెన్నైలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మీడియాతో మాట్లాడుతూ "ఈ స్టోరీ 2015లోనే సిద్ధమైంది. అప్పటి నుంచి కొన్నేళ్ళపాటు పరిశోధన చేసిన తర్వాత ఈ ప్రాజెక్టును ప్రారంభించాం" అని తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మరోసారి తెలుగులో...



యోగేశ్ కల్లే హీరోగా పాన్ ఇండియా చిత్రం 'త్రిముఖ'తో తెరంగేట్రం చేస్తున్నారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి రాజేశ్ నాయుడు, శ్రీదేవి మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష కల్లే నిర్మాత. ఇందులో సన్నీ లియోన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రం మార్చిలో విడుదల కానుంది.

కృష్ణా జలాలపై ప్రభుత్వం మేల్కోవాలి

- రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ లక్ష్మీనారాయణ సూచన

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ జలాలపై రాష్ట్ర ప్రభుత్వం మేల్కొనాలని రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టీ.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ డిమాండ్‌కు ప్రధాని మోదీ తలొగ్గి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కాలపరిమితిని పొడిగించిందన్నారు. ప్రధాని మోదీ తీసుకున్న ఈ చర్య రాష్ట్ర నీటి హక్కులపై దాడి చేయడమేనని అన్నారు. కృష్ణా నదీ జలాలపై బచావత్ ట్రిబ్యునల్ తీర్పు గడువు 2000లో ముగియడంతో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను 2004 కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2013 నవంబరు 29న తుది తీర్పు నివేదికను ఇచ్చిందన్నారు. ఈ తీర్పుపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేయగా, స్టే విధించిందన్నారు. గత పదేళ్లుగా ఆ కేసు విచారణలోనే ఉన్నందున బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి రాలేదని, ఇప్పటికీ బచావత్ ట్రిబ్యునల్ తీర్పే అమల్లో ఉందని చెప్పారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు పెండింగ్‌లో ఉన్నందున తెలుగు రాష్ట్రాల మధ్య తలెత్తిన నీటి వివాదంపై విచారణ చేపట్టడం సమర్థనీయం కాదన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించలేదనడం గర్హనీయమని లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా డెల్టాకు 181.20, నాగార్జునసాగర్‌కు 281, కేసీ కెనాల్‌కు 39.90, ఇతర ప్రాజెక్టులకు 116.26 టీఎంసీలను ట్రిబ్యునల్ కేటాయించిందన్నారు. అదనంగా జూరాలకు 17.84, శ్రీశైలంకు 33 టీఎంసీలు కేటాయించిందన్నారు. రాష్ట్ర నీటి హక్కులకు ప్రమాదం ముంచుకొచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మేల్కొనాలన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ వచ్చే నెల 19 నుంచి 21 దాకా విచారణకు షెడ్యూల్ ప్రకటించిందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని, నిపుణులు, ఉద్యమకారులతో చర్చించి, కార్యాచరణ రూపొందించాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.

పోలవరం @ జూలై 2027


డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి పూజలు చేస్తున్న అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. దీంతో, కేంద్ర సాయిల్ అండ్ మినరల్ రీసెర్చ్ స్టేషనర్(సీఎస్ఎంఆర్ఎస్) సిఫారసు చేసిన టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగించాలని నిర్ణయించారు. ఇదిలావుంటే, ఈ నెల 2వ తేదీ నుంచే పనులు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. కెనడా, అమెరికాకు చెందిన అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని కేంద్ర జల సంఘం భావించింది. దీంతో పనులు 16 రోజులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.

పనులు సమీక్షించనున్న సీఎం

సీఎం చంద్రబాబు ఈ నెల 26న పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటిస్తారని జల వనరుల శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులను ఆయన సమీక్షిస్తారు. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం 650 మీటర్ల మేర నిర్మాణం పూర్తయ్యాక.. వాల్ పనులు ప్రారంభించిన చోట నుంచి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు కాంట్రాక్టు సంస్థ మేఘా ఇంజనీరింగ్‌ను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌కు అవసరమైన పెద్దపెద్ద బండరాళ్లను మేఘా సంస్థ సేకరిస్తోంది. ఇలా ఒకవైపు డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు చేపడుతూనే.. మరోవైపు ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులను కూడా చేపడుతుండడం వల్ల.. సమయం కలిసి వస్తుందని కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, రాష్ట్ర జల వనరుల శాఖ, సీఎస్ఎంఆర్ఎస్ పేర్కొంటున్నాయి. ఫలితంగా.. ఈ ఏడాది చివరినాటికి డయాఫ్రమ్‌వాల్‌ను పూర్తి చేస్తే.. 2027 జూలై నాటికి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు కూడా పూర్తయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఇలా మొదలయ్యాయి!

పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రంవాల్ పనులను ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్(సీఈ) నరసింహమూర్తి శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తొలుత లక్ష్మీ గణపతి యాగం, నరఘోష, శత్రుదోష నివారణ, నవగ్రహ శాంతి, వాస్తు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం సీఈ నరసింహమూర్తి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం ఈ నెల 2నే పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, కానీ.. అనుమతుల జాప్యం కారణంగా ఆలస్యమైందన్నారు.



ఎలా నిర్మిస్తారంటే!

గతంలో నిర్మించిన డయాఫ్రమ్‌వాల్‌కి ఎగువన 1.5 కిలోమీటర్ల పొడవున ఇరువైపుల అంచులు నదీ తీరం రెండు పక్కలా ఉన్న కొండల్లోకి వెళ్లేలా మట్టి పనులు చేశారు. ఈసీఆర్ఎఫ్ ప్రాంతంలో కొంత మేర 1.5 మీటర్ల వెడల్పున ఇరువైపులా గైడ్ వాల్ కాంక్రీట్ నిర్మాణం చేశారు. ప్రస్తుతం మిగిలిన ప్రాంతాల్లో సైతం అదేవిధంగా కాంక్రీట్ నిర్మాణం చేసి, ఆ ప్రాంతంలో ట్రెంచ్ కట్టర్ ద్వారా నదీ గర్భంలో రాతి పొరలు తగిలే వరకు తవ్వి.. ప్లాస్టిక్ కాంక్రీట్‌తో డయాఫ్రమ్‌వాల్ నిర్మిస్తారు.

ట్రెమీ పైపులు



ట్రెమీ పైపుల ద్వారా డయాఫ్రమ్ వాల్ అంతర్భాగంలో ప్లాస్టిక్ కాంక్రీట్ నింపుతారు. నదీ గర్భంలో మూడు వందల మీటర్ల మేర దిగువకు కాంక్రీట్ పంపడానికి సరిపడే రెండు సెట్లు సిద్ధం చేశారు. ఏకకాలంలో 600 మీటర్ల పనులకు సరిపడే పైపులు సిద్ధం చేశారు. ఒకేసారి ఆరు ప్యానళ్లకు సరిపడే మెటీరియల్ ప్రాజెక్టు ప్రాంతంలో సిద్ధంగా ఉంది.

ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు

దిగువ కాఫర్ డ్యాంకి సమీపంలో రామయ్యపేట ప్రాంతంలో రెండు చోట్ల రెండేసి చొప్పున నాలుగు ప్లాంట్లు సిద్ధం చేశారు. ఈ ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంటులో డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి ఉపయోగించే ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ జరుగుతుంది. ఒక్కో ప్లాంటు ద్వారా 240 క్యూబిక్ మీటర్ల ప్లాస్టిక్ కాంక్రీట్ సరఫరా అవుతుంది. 4 ప్లాంట్ల ద్వారా 960 క్యూబిక్ మీటర్ల ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ సిద్ధమవుతుంది. ప్రస్తుతం ఈ ప్లాంట్లలో ట్రెంచ్ కటింగ్ కోసం అవసరమయ్యే బెంటోనైట్ ద్రవాన్ని తయారు చేస్తున్నారు.

ట్రెంచ్ కట్టర్ పనులు ఇలా

జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న భారీ యంత్రం ట్రెంచ్ కట్టర్. దీని ద్వారా నదీ గర్భంలో రాతిపొరలు తగిలే వరకు డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతంలో చేపట్టిన కాంక్రీట్ గైడ్‌వాల్ మధ్య తవ్వకాలు చేస్తారు. ఈ యంత్రానికి అడుగు భాగాన ఉన్న భారీ కట్టర్‌లు భూమి అంతర్భాగంలోకి వేగవంతంగా చొచ్చుకుపోతాయి. ట్రెంచ్ కట్టర్‌లకు అమర్చిన భారీ పైపుల ద్వారా బెంటోనేట్ పౌడరు కలిపిన జలాలను నదీ గర్భంలో ఉన్న మట్టి, ఇసుక తవ్వకాల ప్రాంతంలో నిరంతర పంపించడం ద్వారా భూమి పొరల్లో తవ్వకాలలోకి ఇసుక జారకుండా బెంటోనైట్ గట్టిపరుస్తుంది. తద్వారా తవ్వకం పనులు సులభతరమవుతాయి. రాతి శకలాలు వచ్చిన ప్రాంతాలను గుర్తించి అక్కడ పైపులు దింపి ప్లాస్టిక్ కాంక్రీట్ నింపుతారు. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా తవ్వకాలు జరుగుతాయి. గరిష్ఠంగా 90 మీటర్ల నుంచి కనిష్ఠంగా 40 మీటర్ల వరకు ట్రెంచ్ కట్టర్ ద్వారా తవ్వకాలు జరుగుతాయి.


ప్లాస్టిక్ కాంక్రీటు ప్లాంటు

మధ్యవర్తిత్వం ద్వారా కేసులకు సత్వర పరిష్కారం

- సౌత్ జోన్-2 జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ


సదస్సులో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

విశాఖపట్నం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ పేర్కొన్నారు. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఏఐ సాయంతో వేగవంతమైన తీర్పులు ఇవ్వొచ్చని అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఆయన సౌత్ జోన్-2 జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సును ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ అనిరుద్ధ బోస్, ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావు, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జి.నరేందర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ పీఎస్ నరసింహ మాట్లాడుతూ అవసరం లేని సుదీర్ఘ వాదనలు, సంబంధం లేని ప్రక్రియలు, కాలయాపన చేయడానికి వేస్తున్న వివిధ రకాల పిటిషన్లు న్యాయ వ్యవస్థపై ఒత్తిడి పెంచుతున్నాయని అభిప్రాయపడ్డారు. వీటి నుంచి బయటపడేందుకు సాంకేతికతతో కూడిన విధానాలను పాటించాలని సూచించారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ చట్టబద్ధమైన హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కేసుల విచారణలో మానవత్వం, మానవ హక్కులు, మధ్యవర్తిత్వం, ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని సూచించారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ అనిరుద్ధ బోస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గడచిన ఏడాది 37 లక్షల కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం దేశంలో 4.5 కోట్ల కేసులు పరిష్కరించాల్సి ఉందని తెలిపారు.

'ఆదిత్య వర్సిటీ ఫీజు'పై జోక్యానికి హైకోర్టు నో

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తమ యూనివర్సిటీ ఫీజును రూ.63 వేలుగా ఖరారు చేయడాన్ని సవాల్ చేస్తూ కాకినాడ ఆదిత్య వర్సిటీ దాఖలు చేసిన పిటిషన్‌లో జోక్యానికి హైకోర్టు విముఖత చూపింది. ఫీజు పునఃపరిశీలన కోసం తిరిగి కమిషన్‌కు పంపించేందుకు నిరాకరించింది. తర్వాత బ్లాక్ పీరియడ్‌కు ఫీజు ఖరారు చేసే సమయంలో వర్సిటీ సమర్పించే వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని కమిషన్‌ను ఆదేశించింది. కాలేజీ కొత్తగా యూనివర్సిటీగా మారిన నేపథ్యంలో తగిన సమాచారం లేదని, అందుబాటులో ఉన్న వివరాలతో ఫీజులు ఖరారు చేశామన్న కమిషన్ వాదనతో ఏకీభవిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల తీర్పు చెప్పారు.

భార్యకు డీన్ పోస్టు రాలేదని హైకోర్టుకు భర్త

- పిల్‌ను తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం
- రిటైర్డ్ ప్రొఫెసర్‌కు రూ.50 వేలు జరిమానా

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ డీన్లు, డైరెక్టర్లు, రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఆ పిల్ దాఖలు చేయడం వెనుక పిటిషనర్‌కు వ్యక్తిగత ప్రయోజనాలు, కుటిలత్వము ఉన్నాయని పేర్కొంది. వర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న తన భార్యను డీన్ పోస్టుకు ఎంపిక చేయలేదనే కారణంతో నియామకాలని పిటిషనర్ సవాల్ చేశారని ఆక్షేపించింది. పిల్ వేసిన యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మౌళీకృష్ణకు రూ.50 వేలు జరిమానా విధించింది. ఈ సొమ్మును దృష్టి, వినికిడి లోపం ఉన్న వారి కోసం వినియోగించే నిమిత్తం న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఎస్వీవీయూ డీన్లు, రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఏ అధికారంతో ఆ పోస్టుల్లో కొనసాగుతున్నారో వివరణ కోరాలంటూ మౌళీకృష్ణ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు జీవో 53 విరుద్ధం

- మండల స్థాయిలో మాదాసి కురువ/మాదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకూడదు: హైకోర్టు

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మాదాసి కురువ/మాదారి కురువ సామాజికవర్గానికి చెందినవారికి కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు వీలుగా తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్‌లకు అధికారాలను కల్పిస్తూ 2022 నవంబరు 2న అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీవో 53ను హైకోర్టు రద్దు చేసింది. ఆ సామాజికవర్గానికి ఆర్డీవో, డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ కమిషనర్ స్థాయిలో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని, మండలస్థాయిలో జారీ చేయడానికి వీల్లేదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను గుర్తుచేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. జీవో 53ను సవాల్ చేస్తూ మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, మాలమహానాడు సీమ జిల్లాల అధ్యక్షుడు చలువాది రంగయ్య తదితరులు పిటిషన్ దాఖలు చేశారు.

ధాన్యం కొనుగోళ్లు నిలిచాయ్!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే రూ.6,000 కోట్లు బ్యాంకు నుంచి రుణం తీసుకుంది. మిగతా ధాన్యం కొనేందుకు ఇంకో రూ.700 కోట్లు రుణం తీసుకునేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కానీ ఇప్పటి వరకు రూ.6,469 కోట్లు రైతులకు చెల్లించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. సాంకేతిక కారణాల వల్ల కొన్ని రోజులుగా ధాన్యం సేకరణ నిలిచిపోయిందని, ఆన్‌లైన్ సిస్టమ్ ఓపెన్ కాగానే కొనుగోళ్లు చేపడతామని అధికారులు అంటున్నారు. వాస్తవానికి ఇప్పటికే కొనుగోలు చేసిన సరుకుకు, సొమ్ము చెల్లింపులకు మధ్య వ్యత్యాసం ఉండటంతో నిధులు సర్దుబాటు కాని కారణంగా కొనుగోళ్లు ఆగినట్లు విశ్వసనీయ సమాచారం. దళారులు సేకరించిన సరుకును ఆన్‌లైన్‌లోకి ఎక్కించే ప్రక్రియ సాగుతోందని, అందుకనే కొనుళ్లు నిలిపేశారని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు.

నూక సాకుతో ఎదురు వసూళ్లు

సీఎం చంద్రబాబు విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా, మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు నిత్యం సమీక్షలు జరిపినా క్షేత్ర స్థాయిలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ధాన్యం అమ్ముకోలేకపోయిన సందర్భాలూ ఉన్నాయి. అధిక తేమ శాతం, నూక శాతం పేరుతో కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు చేయలేదు. గోదావరి జిల్లాల్లో నూక శాతం కింద తూకం తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే)లో శాంపిల్స్ పరిశీలించి, 20 శాతం నూకలు ఉన్నాయని సిబ్బంది తేల్చారు. నూక శాతాన్ని మినహాయించి, తూకంలో తగ్గుదల కింద ధాన్యం విలువను నగదు రూపంలో రైతు నుంచి వసూలు చేశారు. వడ్ల బస్తాలను పూర్తి తూకంతో చూపి, కొనుగోలు చేశారు. ధాన్యం సొమ్ము చేతికందిన తర్వాత తరుగు సొమ్ము ఇస్తామన్నా ఆర్ఎస్‌కే సిబ్బంది కుదరదన్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వడ్ల బస్తాకు రూ.100-150 దాకా నూక కింద ముందుగా నగదు చెల్లించాల్సి వచ్చిందని, ఎకరాకి రెండు బస్తాల సొమ్ము నష్టపోవాల్సి వచ్చిందని గోదావరి జిల్లాల రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల ఈ-క్రాప్‌లో నమోదైనా కొందరు రైతుల సరుకును కొనుగోలు చేయకుండా పెండింగ్ పెట్టారన్న ఆరోపణలున్నాయి. ఆర్ఎస్‌కే సిబ్బంది చెప్పినట్లుగా సరుకు మిల్లుకు తీసుకెళ్లినా రెండు మూడు రోజులు నిరీక్షించాల్సి రావడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ రైతులే చూసుకోవాలని, కేవలం గన్నీ బ్యాగ్స్ మాత్రమే ఇస్తామని చాలా చోట్ల సివిల్ సప్లైస్ సిబ్బంది తెగేసి చెప్పారు. ఇన్ని ఇబ్బందులు పడ్డా... ప్రభుత్వ ధాన్య సేకరణ కేంద్రాల్లో ముమ్మరంగా కొనుగోళ్లు సాగలేదు. దీంతో రైతులు స్థానికంగా వ్యాపారులకు ధాన్యం అమ్మేశారు. ఇదే అదునుగా మిల్లర్ల మాటున దళారులు కనీస మద్దతు ధర కూడా ఇవ్వడం లేదు. క్వింటా ధాన్యానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.2,320.. నాణ్యమైన రకాలకే పరిమితమయింది. సాధారణ రకాలకు రూ.300-400 తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నాడు జగన్ పగబట్టారు బాబు పూర్తిచేయించారు

- గన్నవరంలోని కొండపావులూరులో ఎన్ఐడీఎం,ఎన్డీఆర్ఎఫ్‌ల ఏర్పాటు
- ఢిల్లీ తర్వాత జాతీయ విపత్తు కేంద్రం ఇక్కడే
- నేడు ప్రారంభించనున్న అమిత్‌షా

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

అమరావతి నిర్మాణంపై పగబట్టిన గత ప్రభుత్వం, అక్కడకు కేంద్ర ప్రభుత్వ సంస్థలు సైతం రాకుండా కక్ష పూరితంగా వ్యవహరించింది. ఇందులో ఎన్ఐడీఎం(జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ), ఎన్డీఆర్ఎఫ్(జాతీయ విపత్తు సహాయక బృందాలు) నిర్మాణాలకు అప్పటి సీఎం జగన్ సహాయ నిరాకరణ చేశారు. ఈ సంస్థలు 2019కు ముందే, అప్పటి టీడీపీ హయాంలో కృష్ణాజిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో శంకుస్థాపనలు జరుపుకొన్నాయి. ఈ సంస్థల నిర్మాణ పనులు ఐదేళ్లలో ముందుకెళ్లకుండా గత వైసీపీ ప్రభుత్వం అనేక అడ్డంకులు కల్పించింది. రహదారులు వంటి కనీస వసతులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులుపెట్టింది. దీనిపై కేంద్రం ఎన్ని లేఖలు రాసినా పట్టించుకోలేదు. ఇన్ని ఇబ్బందుల మధ్యే నిర్మాణ పనులు దాదాపు పూర్తిచేసుకున్న ఈ సంస్థలకు కూటమి ప్రభుత్వం రాగానే అండగా నిలిచింది. దీంతో చకచకా మిగతా లాంఛనాలు పూర్తిచేసుకుని ప్రారంభోత్సవం జరుపుకోడానికి ఎన్ఐడీఎం, ఎన్డీఆర్ఎఫ్ సిద్ధమయ్యాయి. ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వీటిని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన శనివారం రాత్రి ఎనిమిది గంటలకు విజయవాడ చేరుకున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు వద్ద అమిత్‌షాకు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు బ్రహ్మాండమైన రీతిలో స్వాగతం పలికారు. వీరిలో.. కేంద్ర సహాయ మంత్రులు బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనిత, పార్థసారథి, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాశ్, సత్యకుమార్ యాదవ్, కింజరపు అచ్చెన్నాయుడు, అనగాని సత్య ప్రసాద్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్, సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బోడే ప్రసాద్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, సీబీడీ చీఫ్ రవిశంకర్ అయ్యర్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎన్డీఆర్ఎఫ్ డీజీ పీయూశ్ ఆనంద్, ఐజీ నరేంద్ర సింగ్, డీఐజీ హరి ఓం గాంధీ, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు తదితరులున్నారు. అనంతరం అమిత్‌షా రోడ్డు మార్గాన తాడేపల్లి సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్లారు. అమిత్ షా రాక సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగే గన్నవరంలోని విమానాశ్రయం చుట్టు పక్కల 1200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫలించిన బాబు కష్టం..

రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రకు కేంద్ర సంస్థలను తీసుకురావాలని ఆనాడు చంద్రబాబు తపించారు. కొండపావులూరును ఆనుకుని సరిహద్దున ఉండే సూరంపల్లికు ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సులను అందించే 'సీపెట్' సంస్థను తెచ్చారు. దానికి సమీపంలోకి మరిన్ని కేంద్ర సంస్థలు వచ్చేందుకు వీలుగా ఆనాడే భూములు కేటాయించారు. ఈ భూముల్లోనే ఇప్పుడు ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంలు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నాయి. ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్‌ను 2012లో ఉమ్మడి ఏపీకి కేంద్రం మంజూరు చేసింది. అప్పట్లో తగిన స్థలం చూపించకపోవటం వల్ల క్యాంపస్ ఏర్పాటుకాలేదు. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన టీడీపీ హయాంలో కొండపావులూరు ప్రాంతాన్ని ఎంపిక చేసి 50 ఎకరాల భూములను దీనికోసం కేటాయించింది. 2017లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శంకుస్థాపన చేశారు. ఇది ఏపీ, కర్ణాటక పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఇక.. ఎన్ఐడీఎం ఏర్పాటుకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వం 10 ఎకరాలను కేటాయించింది. దీనికి 2018, మేలో అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు శంకుస్థాపన జరిపారు.

ఎన్నెన్నో ప్రత్యేకతలు

ఢిల్లీ తర్వాత జాతీయ విపత్తు నిర్వహణ సంస్థను కలిగిన ఘనత మన రాష్ట్రానికే దక్కింది. సువిశాల సముద్ర తీర ప్రాంతాన్ని కలిగిన రాష్ట్రం మనది. ఈ నేపథ్యంలో జాతీయ విపత్తులను పరిశీలించి, విశ్లేషించి, అధ్యయనం చేసి, శిక్షణ ఇచ్చే రెండు జాతీయ సంస్థలూ మన దగ్గరే ఏర్పాటు కావడం విశేషం.


కొండపావులూరులో ఎన్ఐడీఎం భవనం

బీఆర్ఎస్‌కు రూ.41 కోట్లు ఎందుకిచ్చారు?

- ఫార్ములా రేసులో ప్రమోటర్‌గా చాన్స్ లభిస్తుందని తెలిసే సంస్థను నెలకొల్పారా?
- కేటీఆరే మిమ్మల్ని ఆహ్వానించారా?
- ఏస్ నెక్స్‌జెన్ ఎండీ అనిల్‌కుమార్‌కు ఏసీబీ ప్రశ్నలు
- మూడున్నర గంటలపాటు కొనసాగిన విచారణ

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు ప్రమోటర్‌గా వ్యవహరించిన ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ ప్రతినిధులు శనివారం ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. వీరిలో ఆ సంస్థ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు. వారి నుంచి వివరాలు రాబట్టేందుకు ఏసీబీ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. క్రీడల్లో ఏమాత్రం అనుభవం లేని మీ కంపెనీ ఇందులోకి ఎందుకు దిగింది? ఎవరు మిమ్మల్ని ఆహ్వానించారు? ఆ సమయంలో మీకేవిధమైన హామీలిచ్చారు? ఒప్పందానికి ముందే బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.41 కోట్ల మొత్తం ఎందుకు ఇచ్చారు? రేసు ద్వారా మీ కంపెనీకి లాభం వచ్చిందా? నష్టం వచ్చిందా? ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ రెండో సెషన్ పూర్తి చేయకుండానే ఎందుకు వైదొలిగారు? తదితర ప్రశ్నలు అడిగారు. మూడున్నర గంటలు కొనసాగిన విచారణలో మాజీమంత్రి కేటీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యంపైనా ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఫార్ములా-ఈ కారు రేసులో ప్రమోటర్‌గా ఉండ బోతున్న విషయం మీకు ఎప్పుడు తెలిసింది? విమ్మల్ని ప్రమోటర్‌గా ఆహ్వానించింది కేటీఆరేనా? ప్రమోటర్‌గా అవకాశం లభించనున్న సంగతి తెలిసే.. రేసు ప్రారంభం అవడానికి ముందు ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలను ప్రారంభించారా? అప్పట్లో మీకు, రాష్ట్ర పురపాలకశాఖకు, అప్పటి మంత్రి కేటీఆర్‌కు మధ్య జరిగిన సంభాషణలేమిటి?' అంటూ అనిల్ కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కాగా, ఎలక్టోరల్ బాండ్లను అన్ని రాజకీయపార్టీలకు ఇచ్చినట్లే బీఆర్ఎస్‌కు ఇచ్చామని ఆయన సమాధానమిచ్చినట్లు సమాచారం. మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని, మళ్లీ నోటీసు ఇస్తామని ఏసీబీ అధికారులు అనిల్ కుమార్ బృందానికి చెప్పినట్లు తెలిసింది.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య 18

- 12 మందేనని పోలీసుల ప్రకటన
- 18 మంది అంటూ నక్సల్స్ లేఖ

చర్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ బస్తర్ మారేడుబాక అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల సంఖ్య 12 కాదా? మొత్తం 18 మంది చనిపోయారా? వీరిలో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారా? ఈ ప్రశ్నలకు మావోయిస్టు పార్టీ ఔననే పేర్కొంటూ దక్షిణ బస్తర్ కార్యదర్శి గంగా పేరుతో శనివారం మీడియాకు ఓ లేఖ పంపింది. అంతేకాదు.. ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసుల వైపు కూడా మరణాలు నమోదయ్యాయని, దామోదర్ వీరోచితంగా పోరాడి, అమరుడయ్యారని పేర్కొన్నారు. అయితే.. అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ పోలీసులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. చనిపోయిన మావోయిస్టుల్లో పెద్ద నాయకులెవరూ లేరని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. శనివారం మధ్యాహ్నం దక్షిణ బస్తర్ కమిటీ కార్యదర్శి గంగా పేరుతో మీడియాకు ప్రెస్‌నోట్ విడుదలైంది. "మొత్తం 18 మంది చనిపోయారు. ఆరు మృతదేహాలను మా వెంట తీసుకెళ్లాం. మృతుల్లో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చొక్కారావు అలియాస్ దామోదర్, హంగి, దేవే, జోగా, నర్సింహారావు ఉన్నారు. దామోదర్‌పై రూ.50 లక్షల రివార్డు ఉంది" అని ఆ లేఖలో పేర్కొన్నారు. శనివారం బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ కూడా ప్రకటన విడుదల చేశారు. అయితే.. నక్సల్స్ లేఖను ధ్రువీకరించకుండా.. "18 మంది చనిపోయారని మావోయిస్టులు చెబుతున్నారు. వారిలో దామోదర్ ఉన్నట్లు చెబుతున్నారు" అని పేర్కొన్నారు. కానీ, ఆ వివరాలను ధ్రువీకరించలేదు.

త్రుటిలో తప్పించుకున్న హిడ్మా

ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసులు గుర్తించిన 12 మంది మృతుల్లో సింహభాగం హిడ్మా పీఎల్‌జీఏ ఒకటో బెటాలియన్‌కు చెందినవారే ఉన్నారు. "హిడ్మా భద్రతా వలయానికి చెందిన వారే తాజా ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు తెలుస్తోంది. హిడ్మా, మిగతా మావోయిస్టులు అడవిలో తప్పించుకున్నారు. కూంబింగ్ కొనసాగుతోంది" అని ఛత్తీస్‌గఢ్ పోలీసు వర్గాలు తెలిపాయి. మరోవైపు సుకుమా జిల్లాకు చెందిన 22 మంది మిలీషియా సభ్యులు లొంగిపోయారు.

బియ్యం మాయం కేసులో మరో ముగ్గురికి బెయిల్

మచిలీపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ నుంచి బియ్యం మాయం కేసులో అరెస్టు చేసిన నలుగురు నిందితులలో ముగ్గురికి స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి శనివారం బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో వీరిని ఈ నెల 12వ తేదీన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఏ7గా ఉన్న మాతా వెంకటేశ్వరరావు (ధాన్యం వ్యాపారి), ఏ9 గోపిశెట్టి నాంచారయ్య (ఆటోడ్రైవర్), ఏ11 కందుల బాపూజీలకు (బియ్యం వ్యాపారి) బెయిల్ మంజూరైంది. మరో నిందితుడు, ఈ కేసులో ఏ8గా ఉన్న పంతగాని నాగేశ్వరరావు శనివారం బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నాగాయలంక ఎంఎల్ఎస్ (మల్టీ లెవల్ స్టాక్) పాయింట్‌లో నాగేశ్వరరావు గతంలో పనిచేశారు. ఇక... ఏ10గా ఉన్న డొక్కు నాగరాజు ఇటీవల మరణించారు.



లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కార గ్రహీత అందెశ్రీ, ఖాదర్ మొహియుద్దీన్‌లకు జ్ఞాపిక అందజేస్తున్న త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, బ్రహ్మానందం. చిత్రంలో వైవీఎస్ చౌదరి, గంటా శ్రీనివాసరావు, అశ్వనీదత్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, లావు రాణి రుద్రమదేవి

తెలుగు సినీరంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు

- ప్రజలు ఎన్టీఆర్‌ను దైవంలా కొలిచేవారు: త్రిపుర గవర్నర్ ఇంద్రసేన
- ఏయూలో లోక్ నాయక్ ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవం
- కవి అందెశ్రీ, సాహితీవేత్త ఖాదర్ మొహియుద్దీన్‌కు పురస్కారాలు

సిరిపురం(విశాఖపట్నం), జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగు చలన చిత్ర రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు అని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి అన్నారు. లోక్ నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి, ఏఎన్నార్ శత జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పౌరాణిక పాత్రల్లో ఎన్టీఆర్‌ను మించిన నటుడు లేరని, ప్రజలు ఆయన్ను దైవంలా కొలిచేవారని గుర్తు చేసుకున్నారు. రూ.2కు కిలో బియ్యం, ఆస్తిలో మహిళలకు సమాన హక్కును కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని తెలిపారు. సాంఘిక చిత్రాల్లో అక్కినేని నాగేశ్వరరావు చేసిన పాత్రలు చిరకాలం గుర్తుండిపోతాయన్నారు. గౌరవ అతిథి సినీనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ శ్రీకృష్ణుడు అంటే మనందరికీ ఎన్టీఆరే గుర్తొస్తారని తెలిపారు. మరో గొప్ప నటుడు ఏఎన్నార్ పెద్దగా చదువుకోలేదని, అయినప్పటికీ ఆయన జీవితాన్ని సంపూర్ణంగా చదువుకున్నారని వివరించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ సభలో నిర్మాత అశ్వనీదత్, దర్శకుడు వై.వి.ఎస్.చౌదరి, విజ్ఞాన్ విద్యాసంస్థల ఉపాధ్యక్షురాలు లావు రాణి రుద్రమదేవి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కవి అందెశ్రీ, సాహితీవేత్త ఖాదర్ మొహియుద్దీన్‌కు లోక్‌నాయక్ సాహిత్య పురస్కారం, ఒక్కొక్కరికి రూ.2లక్షల నగదు, జ్ఞాపిక అందజేశారు. అలాగే స్వర్ణభారతి ట్రస్ట్ ఛైర్మన్ ఇమ్మణ్ణి దీపా వెంకట్‌కు, స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమ నిర్వాహకులు డి.ఆర్.కె.ప్రసాద్, పద్మావతి దంపతులకు, వైద్య ప్రముఖులు పోలిచర్ల హరినాథ్ (అమెరికా)కు లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు.

లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలి

- చంద్రబాబుకు పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి వినతి

మైదుకూరు, జనవరి 18: మంత్రి నారా లోకేశ్‌ను ఉప ముఖ్యమంత్రిని చేయాలని సీఎం చంద్రబాబును ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి కోరారు. పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు లోకేశ్ అలుపెరగని సుదీర్ఘ పాదయాత్ర చేశారని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని తెలిపారు. "పార్టీ ఆవిర్భవించి 42ఏళ్లు అయింది. ఇప్పుడు మూడోతరం నడుస్తోంది. భవిష్యత్తు కోసం, పార్టీని నమ్ముకున్న యువత కోసం లోకేశ్‌ను డిప్యూటీ సీఎంను చేయాలి. దీనివల్ల యువతరానికి పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుంది" అన్నారు. మైదుకూరులో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబును శ్రీనివాసరెడ్డి కోరారు.

రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్

- ఏపీలో అభివృద్ధిని పట్టాలెక్కించాం
- మైదుకూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

కడప, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కార్యకర్తలంతా కష్టపడి 21 పార్లమెంటు సీట్లు గెలిపించారని, ఇంకొంచెం కష్టపడి ఉంటే 25కు 25 సీట్లూ గెలిచేవాళ్లమని సీఎం చంద్రబాబు అన్నారు. ఆ 21 సీట్లు సంజీవనిగా మారాయని, వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. కష్టాలన్నీ తీరిపోయే పరిస్థితికి వస్తున్నామని, కానీ పూర్తిగా తొలగిపోలేదన్నారు. రాజధాని అమరావతిని గట్టెక్కించామని, పోలవరం ప్రాజెక్టుకు ప్రాణం పోశామని పేర్కొన్నారు. కేంద్రం విశాఖ రైల్వే జోన్ ఇచ్చిందని, విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.13వేల కోట్లు ఇచ్చి ఆదుకుంటోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు నాంది పలికామన్నారు. తనను, మోదీని, పవన్ కల్యాణ్‌ను నమ్మి ఓట్లు వేసిన ప్రజల రుణం తీర్చుకొనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. శనివారం కడప జిల్లా మైదుకూరులో విద్యార్థులతో కలసి స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మైదుకూరులోనే ఎన్టీఆర్ 29వ వర్ధంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 'ఎన్నికల ముందు నవ్వుతూ మాట్లాడే పరిస్థితి లేదు. కూర్చోవాలంటే భయం, నవ్వాలంటే భయం, బయటకు రావాలంటే భయం. ప్రెస్‌వాళ్లు ఏదైనా ఆర్టికల్ రాయాలంటే వణుకు. కానీ ఈరోజు స్వేచ్ఛగా ఉండగలుగుతున్నారంటే అది ప్రజాస్వామ్యం. విర్రవీగిన నియంతలంతా కాలగర్భంలో కలిసిపోయారు. రాష్ట్రంలో అభివృద్ధిని పట్టాలెక్కించాం. రాయలసీమతో పాటు రాష్ట్రంలో జాతీయ రహదారులకు రూ.50 వేలకోట్లు ఖర్చు పెట్టి మూడేళ్లలో పూర్తిచేస్తున్నాం. రూ.70 వేల కోట్లతో రైల్వే లేన్లు, రైల్వే స్టేషన్లు పూర్తిచేసే బాధ్యత తీసుకున్నాం. స్వర్ణాంధ్ర విజన్ తయారుచేశాం. 64 లక్షల మంది పింఛన్లను పర్యవేక్షిస్తున్నానంటే అది టెక్నాలజీ మహిమ' అని చంద్రబాబు అన్నారు.

> కేంద్రం, రాష్ట్రంలో ఎప్పుడూ ఎన్డీయే ఉండాలి. అప్పుడే అభివృద్ధి పరుగులు పెడుతుంది. డబుల్ ఇంజన్ సర్కార్‌తో డబుల్ గ్రోత్ రేట్ ఉంటుంది. 13 శాతం అభివృద్ధి సాధించాం. 15-16 శాతం వస్తే పేదరికం అనేది ఉండదు. తెలుగుజాతి ప్రపంచంలో నెంబర్ వన్‌గా ఉండాలనేది నా సంకల్పం.
>
> - చంద్రబాబు

రెండేళ్లలో పోలవరం పూర్తి చేస్తాం

'పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. నీళ్లన్నీ సముద్రంలోకి పోతున్నాయి. ఈ ఏడాది 4 వేల టీఎంసీలు వృథా అయ్యాయి. కానీ ముందు జాగ్రత్త చేసి శ్రీశైలంతో పాటు రాయలసీమలో రిజర్వాయర్లన్నీ నీటితో కళకళలాడుతున్నాయంటే అది టీడీపీ చూపిన చొరవ. పోలవరం నుంచి 200-300 టీఎంసీలు రాయలసీమకు వస్తే ప్రగతి వైపు పరుగు పెడుతుంది. అందుకే పోలవరాన్ని పట్టాలెక్కించాం. గత ప్రభుత్వం డయాఫ్రం వాల్‌ను ముంచేసి పోలవరం ప్రాజెక్టును గోదావరిలో ముంచేసింది. ఈరోజు మళ్లీ కేంద్ర సహకారంతో ఫేజ్-1కింద రూ.12,200కోట్లు ఇస్తే డయాఫ్రం వాల్ ప్రారంభిస్తున్నాం. రెండేళ్లలో పోలవరం పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నా. పోలవరం-కృష్ణా అనుసంధానం చేశాం. కృష్ణాడెల్టాలో వాడే నీళ్ల శ్రీశైలం ద్వారా రాయలసీమకు ఇచ్చాం. రాబోయే రోజుల్లో గోదావరి-పెన్నా, పోలవరం-బనకచెర్ల వరకు అనుసంధానం చేయగలిగితే గేమ్ చేంజర్‌గా తయారవుతుంది. రాయలసీమ రైతాంగం మీసం తిప్పి బతికే రోజు వస్తుంది. బనకచెర్లకు నీరు తెస్తే అక్కడి నుంచి తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి వీటితో పాటు సోమశిలకు వెళ్తాయి. అక్కడ నుంచి కండలేరుకు వెళ్లి మళ్లీ తిరుపతికి వచ్చి వేంకటేశ్వరస్వామి పాదాల చెంత ఉన్న బాలాజీ రిజర్వాయర్‌కు వచ్చే పరిస్థితి ఉంటుంది. ఇది నా కల' అని చంద్రబాబు అన్నారు.

సీమ అభివృద్ధి బాధ్యత మాది

'రాయలసీమ రుణం ఎలా తీర్చుకోవాలా అని అనుక్షణం ఆలోచిస్తుంటా. కరువు జిల్లాలైన సీమను అభివృద్ధి చేసే బాధ్యత మాది. బాగా వర్షాలు వచ్చినపుడు నీళ్ల సముద్రంలోకి పోతున్నాయి. వర్షాలు లేనపుడు కరువుబారిన పడుతున్నాం. కరువు రహిత రాష్ట్రంగా తయారు కావాలంటే నదుల అనుసంధానమే ఏకైక మార్గం. ఇది సాధ్యం. ఒకప్పుడు ఇంత టెక్నాలజీ లేదు. ఇది చేసి చూపిస్తాం. ఒకప్పుడు రాయలు ఏలిన రతనాల సీమలో తర్వాత కరువు వచ్చి నీళ్ల కూడా లేవు. అనంతపురం లాంటి జిల్లా ఎడారిగా మారుతుందని శాస్త్రవేత్తలు చెప్పారు. రాయదుర్గం ప్రాంతం ఎడారిగా మారే సూచనలు వచ్చాయి. తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరునగరి ప్రాజెక్టులు ప్రారంభించి రాయలసీమ మళ్లీ రతనాల సీమ కావాలని పునాది వేసిన వ్యక్తి ఎన్టీఆర్. రాజోలి బండ ఆనకట్ట అభివృద్ధి చేసి 90 వేల ఎకరాలకు నీరు అందించి నీటిఎద్దడి లేకుండా చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.



స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ వేదికపై తన పక్కన కూర్చున్న మహిళలతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

10కి 10 సీట్లు గెలవాలి

'తెలుగుదేశం పార్టీ పెట్టినప్పటి నుంచి ఎప్పుడూ రాని విజయం మొన్నటి ఎన్నికల్లో వచ్చింది. బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేశాం. 93 శాతం సీట్లు మనమే గెలిచాం. కడప జిల్లాలో పదికి ఏడు గెలిచాం. కడప పార్లమెంటులో ఏడుకు ఐదు గెలిచాం. ఇంకొంచెం కష్టపడి ఉంటే కడప పార్లమెంటును గెలిచేవారం. గత ఐదేళ్లలో ఏం జరిగిందో చూశారు. ఈ ఐదేళ్లలో ఏ విధంగా వెలుగులు వస్తాయో మీరే చూడబోతున్నారు. ఆ తర్వాత ఏడుకు ఏడు గెలిపించాలి, పదికి పది గెలవాలి. పార్లమెంటు స్థానాలు గెలవాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం' అని అన్నారు.

టీడీపీలో కోటి సభ్యత్వాలు

'టీడీపీకి ఒక చరిత్ర ఉంది. ఒకప్పుడు నేషనల్ ఫ్రంట్‌ను అధికారంలోకి తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. తర్వాత యునైటెడ్ ఫ్రంట్‌కు నేను కన్వీనర్‌గా ఉండి ఇద్దరిని ప్రధానులుగా చేశాం. ఎన్డీయే-1లో వాజ్‌పేయికి సహకరించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాం. ఎన్డీయే-2లో మోదీ నాయకత్వంలో 2014-19లో పనిచేశాం. ఇపుడు పనిచేస్తున్నాం. మోదీ నాయకత్వంలో 2047కల్లా దేశం నం-1గా కాని, నం-2గా కాని ఎదుగుతుంది. టీడీపీ ప్రాంతీయ పార్టీ అనే కానీ జాతీయ భావాలతో పనిచేసిన పార్టీ. కోటి సభ్యత్వాలు టీడీపీలో ఉన్నాయి. ఇటీవల మంత్రి లోకేశ్ కార్యకర్తల సంక్షేమానికి రూ.130కోట్లతో పెద్దపీట వేశారు. కార్యకర్తలు ఎవరైనా చనిపోతే వారికి రూ.5లక్షలు బీమా ఇచ్చే ఏకైక పార్టీ దేశంలో తెలుగుదేశం పార్టీ' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఎన్టీఆర్.. తెలుగువారి ఆత్మగౌరవం

'ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు.. తెలుగువారి ఆత్మగౌరవం. పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం. తెలుగుజాతి ఉన్నంత వరకు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారు. తెలుగుజాతి కోసం పుట్టిన, తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం తపించిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలన్నది ఎన్టీఆర్ ఆశయం. ఆయన స్ఫూర్తితో ముందుకు వెళుతున్నాం. పార్టీ పెట్టిన 9 నెలల్లో ప్రపంచంలో ఎవరూ అధికారంలోకి రాలేదు. అది ఒక్క ఎన్టీఆర్‌కే సాధ్యమైంది. తెలుగువారికి గుర్తింపు తెచ్చిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. సంక్షేమానికి అర్థం తెచ్చారు. అభివృద్ధి అంటే చేసి చూపించారు. సంస్కరణలకు నాంది పలికారు. ప్రభుత్వం అంటే పాలకులు కాదు సేవకులు అని చెప్పారు. దేశ చరిత్రలోనే రాజకీయాలకు కొత్త రూపాన్ని ఇచ్చారు. ఆరోజు ఆయన ఇచ్చిన పింఛన్ రూ.35.. ఈరోజు రూ.4,000 ఇస్తున్నామంటే అది టీడీపీ చరిత్ర. ఈరోజు మైదుకూరులో బీసీ గెలిచాడంటే అది ఎన్టీఆర్ వేసిన పునాది. ఎన్టీఆర్ వర్ధంతి సభలో ఒక సంకల్పం చేయాలి. మీ ప్రాంతంలో జీరో పావర్టీని సాధించాలి. ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం సంకల్పం చేసి ముందుకెళ్లాలి' అని చంద్రబాబు అన్నారు.

పారిశ్రామిక కేంద్రంగా కొప్పర్తి

'కడప జిల్లాలో కొప్పర్తికి కేంద్రం రూ.2300 కోట్లు ఇచ్చింది. కొప్పర్తిని ఒక పారిశ్రామిక కేంద్రంగా తయారు చేసి, ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత మాది. స్టీల్‌ప్లాంట్ కూడా వస్తే జిల్లా ప్రగతి జరుగుతుంది. ఎంఎస్ఎంఈ పార్క్ ఇక్కడే ఉంటుంది. గండికోట ఆరోజు ఎన్టీఆర్ కట్టిందే. ప్రపంచంలోనే పది అందమైన ప్రదేశాల్లో గండికోట ఒకటి. కడప జిల్లా హార్టికల్చర్ హబ్‌గా తయారవుతుంది. వరి పంట కంటే పండ్ల తోటలు వేసుకుంటే రెండు మూడురెట్లు ఆదాయం వస్తుంది. రాయలసీమలో ఎక్కువగా ఆదాయం వచ్చే జిల్లాలు కడప, అనంతపురం. కడప జిల్లాలో ఒకప్పుడు ముఠాకక్షలు, చంపుకొనే పరిస్థితి ఉండేది. వాటిని అణచివేసిన పార్టీ టీడీపీ' అని చంద్రబాబు అన్నారు.

దావోస్‌లో 'బ్రాండ్ ఏపీ'



- 3 రోజులపాటు చంద్రబాబు పర్యటన
- రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లు దెబ్బతిన్న 'బ్రాండ్ ఏపీ'ని అంతర్జాతీయ స్థాయిలో పునరుద్ధరించేందుకు కూటమి సర్కారు రంగం సిద్ధం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ కంపెనీల ప్రతినిధులు ఒకేచోట చేరే దావోస్ ఆర్థిక సదస్సును దీనికి వేదికగా మార్చుకోనుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు... ఆదివారం రాత్రి 1.30 గంటలకు ఢిల్లీ నుంచి జ్యూరిచ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం బయలు దేరివెళ్లనున్నది. రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా మూడు రోజులు వరుస సమావేశాలు నిర్వహిస్తారు. ఒకే చోట పలువురు దేశాధినేతలతోపాటు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంస్థల అధిపతులను కలిసే అవకాశం దావోస్‌లో లభిస్తుంది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇదొక అద్భుత అవకాశం. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ఒకేఒక్కసారి ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్నారు. అది కూడా... అయిష్టంగా, అన్యమనస్కంగానే! దీంతో... అంతర్జాతీయ యవనికపై 'బ్రాండ్ ఏపీ' గురించి ప్రచారం చేసే అవకాశమే లభించలేదు. ఇప్పుడు... చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కాగానే దావోస్ ఆర్థిక సదస్సులో ఏపీ పెవిలియన్ కొలువు తీరుతోంది. ఈ మూడు రోజుల్లో చంద్రబాబు కనీసం 30 మంది ప్రముఖ సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యేలా ప్రణాళిక రచించారు. ముందే ఖరారైన భేటీలతోపాటు... అప్పటికప్పుడు అవకాశాన్నిబట్టి ఇతరులతోనూ సమావేశమవుతారు.

తొలి రోజు... దావోస్ పర్యటనలో తొలిరోజున చంద్రబాబు స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారితో సమావేశమవుతారు. ఆ తర్వాత హిల్టన్ హోటల్‌లో పది మంది పారిశ్రామికవేత్తలతో చర్చలు జరుపుతారు. స్విట్జర్లాండ్‌లోని ప్రవాసాంధ్రులతో 'మీట్ అండ్ గ్రీట్'తో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారు. రాత్రి పలువురు పారిశ్రామిక, వాణిజ్యవేత్తలతో డిన్నర్‌లో పాల్గొంటారు.

రెండో రోజు ఇలా... దావోస్‌లో రెండో రోజున సీఐఐ సెషన్‌లో గ్రీన్ హైడ్రోజన్ అంశంపై జరిగే చర్చల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. తర్వాత సోలార్ ఇంపల్స్ కోకోకోలా, వెల్‌స్పన్, ఎల్‌జీ , కార్ల్స్ బర్గ్, సిస్కో, వాల్‌మార్ట్ ఇంటర్నేషనల్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో భేటీ అవుతారు. యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్‌తో చర్చలు జరుపుతారు. అనంతరం వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నిర్వహించే 'ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ వేర్ పబ్లిక్ పాలసీ మీట్స్ ప్రైవేట్ గోల్స్' అనే అంశంపై చర్చలో చంద్రబాబు పాల్గొంటారు. అనంతరం పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు మాట్లాడతారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అనుకూల విధానాలను వివరిస్తారు.

మూడో రోజు...

దావోస్‌లో మూడోరోజున పలు దిగ్గజ సంస్థల అధినేతలతో చంద్రబాబు సమావేశమవుతారు. నాలుగోరోజు ఉదయం దావోస్ నుంచి జ్యూరిచ్‌కు చేరుకుని అక్కడి నుంచి స్వదేశానికి చేరుకుంటారు. సీఎం బృందంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తోపాటు పరిశ్రమల శాఖ, ఈడీబీ అధికారులు ఉంటారు.

పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత

- నంబూరులో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'
- పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్

పెదకాకాని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛత అనేది ప్రజల జీవన విధానంలో ఓ భాగం కావాలి. శుభ్రత అనేది ప్రజల ఆలోచనకు ప్రతిరూపం కావాలి. పారిశుధ్య కార్మికులు, క్లాప్ మిత్రలకు మాత్రమే బాధ్యత ఉందని అనుకోవద్దు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛతను కాపాడటం మన అందరి బాధ్యత' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా నంబూరు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత వివిధ రకాల స్టాళ్లు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త రవాణా వాహనాన్ని ప్రారంభించి, ట్రాక్టర్ నడిపారు. అనంతరం పవన్ కల్యాణ్ విలేకర్లతో మాట్లాడుతూ వికసిత్ భారత్-2047 లక్ష్యంలో స్వచ్ఛత ప్రధానమైందన్నారు. కరోనా సమయంలో ఉన్నట్లుగా పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛత విషయంలో క్రమశిక్షణ రావాలన్నారు. స్వచ్ఛత, పరిశుభ్రత అనేది మనందరి జీవితంలో ఒక భాగమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. భవిష్యత్తులో చెత్త కనిపించని భారతదేశం సాకారం కావాలని తెలిపారు. ఇంట్లోనే చెత్తను వేరు చేయాలని, దాని పునర్వినియోగం ద్వారా సంపద సృష్టించవచ్చన్నారు. చెత్త ద్వారా విద్యుత్ ప్లాంటు నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు స్థానిక సంస్థలు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఇంట్లోనే చెత్తను వేరుచేయడం, దానిని నిర్మూలించినప్పుడే చెత్త ఉత్పత్తి తగ్గుతుందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతినెలా మూడో శనివారం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని చేపట్టాలని ఆదేశించారు. ప్రజలను సైతం భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆస్పత్రుల నుంచి వచ్చే బయో వ్యర్థాల నిర్వహణపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో మాట్లాడి వాటి నిర్వహణపై దృష్టి పెడతామన్నారు. బయో వ్యర్థాల నిర్వహణ అనేది స్వచ్ఛతలో కీలకమైనదని తెలిపారు.



గుంటూరు జిల్లా నంబూరులో పారిశుధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

క్లాప్ సిబ్బంది వేతనాల పెంపునకు ప్రయత్నిస్తా

క్లాప్ సిబ్బందికి వేతనాల విషయం తన దృష్టికి వచ్చిందని, దీన్ని కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి వేతనాలు పెంచేలా ప్రయత్నిస్తానని డిప్యూటీ సీఎం పవన్ చెప్పారు. ఇటీవల విజయవాడ వరదల సమయంలో ఎంతో కష్టపడి పని చేసి, ప్రజల మన్ననలు అందుకున్న 35మంది పారిశుధ్య సిబ్బందిని సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పారిశుధ్య సిబ్బంది సేవలు అమూల్యమైనవని, వారిని గౌరవించుకోవడం ప్రజలందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషణ్‌కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి కార్యాలయంపై డ్రోన్!

పోలీసుల దర్యాప్తు

అమరావతి, మంగళగిరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంపై గుర్తుతెలియని డ్రోన్ చక్కర్లు కొట్టింది. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంపై శనివారం మధ్యాహ్నం 1.30 నుంచి 1.50 గంటల వరకు దాదాపు 20 నిమిషాల పాటు ఆ డ్రోన్ సంచరించింది. డ్రోన్‌ను గుర్తించిన జనసేన నేతలు వెంటనే ఉపముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందికి తెలియజేశారు. దీంతో డిప్యూటీ సీఎం కార్యాలయ సిబ్బంది డీజీపీ కార్యాలయం, జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విషయాన్ని తెలియజేశారు. పార్టీ కార్యాలయానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను డ్రోన్ చిత్రీకరించినట్టు పార్టీ సిబ్బంది అనుమానిస్తున్నారు. జనసేన కార్యాలయం ముందుభాగంలో కొత్త కార్యాలయాన్ని ఆ పార్టీ నిర్మిస్తోంది. వెనుక భాగంలో పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్యాంప్ కార్యాలయం ఉంది. క్యాంప్ కార్యాలయం వెనుక భాగాన ఉన్న చిన్న నివాసంలోనే ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉంటున్నారు. ప్రభుత్వ శాఖల సమీక్షా సమావేశాలను ఈ క్యాంప్ కార్యాలయంలోనే ఆయన నిర్వహిస్తున్నారు. పార్టీ కొత్త కార్యాలయం పైనా, క్యాంప్ కార్యాలయంపైనా కూడా డ్రోన్ సంచరించినట్టు సిబ్బంది గుర్తించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు వెంటనే ఆ పార్టీ కార్యాలయానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. జాతీయ రహదారిపైన, సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా, ఇటీవల పవన్ కల్యాణ్ మన్యం జిల్లా పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి హల్‌చల్ చేశారు. అలాగే, విజయవాడలోని బుక్ ఫెస్టివల్‌లో ఉండగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

'విపత్తు' అధికారి అతి!

తిరుమల పర్యటన కోసం హల్‌చల్

- అమిత్‌షా పర్యటనకు వచ్చి హైడ్రామా
- టీటీడీ అధికారులతో సమీక్ష అంటూ లేఖ.. చైర్మన్‌కు సమాచారం
- కేంద్రం రంగంలోకి దిగడంపై రాష్ట్ర ప్రభుత్వ విస్మయం
- కేంద్ర హోంశాఖకు అభ్యంతరం.. తమకే సంబంధంలేదన్న అధికారులు
- విపత్తు అధికారి పర్యటన రద్దు

(అమరావతి/తిరుపతి - ఆంధ్రజ్యోతి)

'తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురి మరణం... తిరుమలలో అగ్ని ప్రమాదంపై విపత్తు నిర్వహణ విభాగం అదనపు డైరెక్టర్ సంజీవ్ కుమార్ జిందాల్ ఈనెల 20వ తేదీన తిరుమలలో సమీక్ష నిర్వహిస్తారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయండి"... అంటూ కేంద్ర విపత్తు నిర్వహణ డైరెక్టర్ ఆశిష్ గవాయ్ రాసిన లేఖ రాష్ట్ర యంత్రాంగంలో పెను దుమారం రేపింది. ఎందుకీ సమీక్ష... ఎవరీ అధికారి... అని ఆరా తీయడంతో ఇదంతా సదరు అధికారి 'ఓవర్ యాక్షన్' అని స్పష్టమైంది. దీనిపై కేంద్ర హోంశాఖకు తన అభ్యంతరం వ్యక్తం చేయడం... ఆ అధికారి 'సమీక్ష' రద్దు కావడం జరిగిపోయింది. అత్యంత నాటకీయంగా సాగిన ఈ పరిణామం వివరాలివి...

వైకుంఠ ఏకాదశి దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత... 13వ తేదీన తిరుమలలో ఆలయం వెలుపల ఉన్న లడ్డూ కౌంటర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా చిన్నపాటి అగ్నిప్రమాదం జరిగింది. తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. దీనిపై న్యాయ విచారణకు కూడా ఆదేశించింది. కానీ... ఈ ఘటనలపై తమ కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదులు వచ్చాయని, ఈ నేపథ్యంలో మొత్తంగా టీటీడీలో రద్దీ నిర్వహణ (క్రౌడ్ మేనేజ్‌మెంట్), భద్రతా ఏర్పాట్లపై కేంద్ర హోంశాఖ పరిధిలోని విపత్తు నిర్వహణ అదనపు డైరెక్టర్ సంజీవ్ కుమార్ జిందాల్ సమీక్ష జరుపుతారని చెబుతూ డైరెక్టర్ ఆశిష్ గవాయ్ శుక్రవారం ఒక అధికారిక లేఖ రాశారు. నిజానికి... టీటీడీ కేంద్రం పరిధిలోకి రాదు. అతి భారీ విషాదం చోటు చేసుకుని సీబీఐ విచారణకు లేదా కోర్టు ఆదేశిస్తే కేంద్రం జోక్యం చేసుకోవచ్చు. ఇక్కడ అవేవీ జరగలేదు. కేంద్రంలోని ఏ విభాగమైనా సరే... నేరుగా రాష్ట్ర పరిధిలోని సంస్థలకు లేఖలు రాయకూడదు. ఏదైనా, ఏమైనా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికే సమాచారం పంపించాలి. ఇక్కడ ఈ నిబంధన కూడా పాటించలేదు. కనీసం... టీటీడీ కార్యనిర్వహణాధికారికైనా లేఖ రాశారా అంటే అదీ లేదు. 'మా అధికారి వస్తున్నారు. సమీక్షిస్తారు' అంటూ టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుకు లేఖ రాశారు. నిజంగానే టీటీడీలో భద్రతా ఏర్పాట్లను కేంద్రం సమీక్షించాలనుకుంటే... ప్రత్యేక నిపుణుల బృందాన్ని పంపిస్తుంది. అదనపు డైరెక్టర్ స్థాయి అధికారి ఒక్కరే వచ్చి ఏం చూస్తారు? ఏం చేస్తారు? దీంతో ఈ వ్యవహారంపై అనేక సందేహాలు తలెత్తాయి. పైగా... తొక్కిసలాట ఘటనపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించింది. ఇలాంటి సమయంలో కేంద్రం రంగంలోకి దిగితే తప్పుడు సంకేతాలు వెళతాయని, టీటీడీతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠకూ భంగకరమనే అభిప్రాయంతో... దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు నేరుగా కేంద్ర హోంశాఖ ముఖ్యులతో చర్చించారు. అదనపు డైరెక్టర్ సంజీవ్ కుమార్ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో... అసలు విషయం బయటపడింది. తిరుమలలో సమీక్ష కోసం తాము ఎలాంటి నిర్ణయం తీసుకోలేదంటూ... సంజీవ్ కుమార్ సమీక్షపై వచ్చిన లేఖను ఉపసంహరించుకుంటున్నట్లుగా కేంద్ర హోంశాఖ శనివారం రాత్రి టీటీడీ ఈవోకు అధికారిక సమాచారం పంపింది.

ఇదీ అసలు విషయం...

విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం భవన సముదాయాలను ప్రారంభించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం రాష్ట్రానికి చేరుకున్నారు. విపత్తు నిర్వహణ విభాగానికి సంబంధించిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సంజీవ్ కుమార్ కూడా విజయవాడకు వచ్చారు. పనిలోపనిగా తిరుమల వేంకటేశ్వరస్వామినీ దర్శించుకోవాలని ఆయన భావించినట్లుంది. ఈ పర్యటనపై అధికారిక ముద్ర వేసుకునేందుకే... 'క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై సమీక్ష' పేరుతో డైరెక్టర్ స్థాయి అధికారితో లేఖ పంపినట్లు తెలుస్తోంది. అయితే... రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలతో ఆయన ప్రయత్నం బెడిసి కొట్టింది.

లంచం ఇచ్చినోళ్లకే పనులు, పదవులు

ఇందుకేనా లోకేశ్ పాదయాత్ర.. చంద్రబాబు జైలుకు వెళ్లింది?: తిక్కారెడ్డి



కర్నూలు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో టీడీపీ జెండా కోసం జైలుకు వెళ్లినోళ్లు, రోడ్డుపై పోరాడినోళ్లు, ఆర్థికంగా నష్టపోయినోళ్లు అక్కడే ఉన్నారు. నిన్న మొన్న వచ్చిన వైసీపోళ్లు బాగుపడుతున్నారు. వారికే పదవులు, పనులు ఇస్తున్నారు. ఇందుకోసమేనా యువనేత లోకేశ్ పాదయాత్ర చేసింది? ఇందుకోసమేనా అధినేత చంద్రబాబు అవమానాలు భరించింది? అక్రమ కేసులో జైలుకు వెళ్లింది?' అని కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని కర్నూలు నగరంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'అంత కష్టపడి అధికారంలోకి వస్తే జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలుగా చెప్పుకొనే వాళ్లు చేస్తున్నదేమిటి? టీడీపీ జెండాలు మోసిన కార్యకర్తల దగ్గర రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పైగా లంచాలు తీసుకుని రేషన్ షాపుల డీలర్‌షిప్‌లు, ఇతర పనులు ఇస్తున్నారు. మన కార్యకర్తల దగ్గరే లంచం తీసుకుంటున్న వారిని ఏమనాలి? టీడీపీ కార్యకర్తలకు తీరని అన్యాయం జరుగుతోంది. లంచం ఎవడిస్తే వారికే పనులు చేస్తారా? పదవులు ఇస్తారా?' అంటూ ఘాటుగా స్పందించారు. "వైసీపీ నాయకుల అరాచకాలపై ప్రాణాలకు తెగించి పోరాడి, బుల్లెట్ గాయాల పాలయ్యాను. ఓడిపోయి ఇన్‌చార్జిలుగా చెప్పుకునేవాళ్లు ఎంపీని కట్టడి చేస్తారా..? చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌కు తెలిస్తే బాధపడతారు. ఎన్నికల్లో ఏ లీడరు ఎలా పనిచేశాడు..? ఏ కార్యకర్త ఎలా కష్టపడ్డారు..? పని చేసినోళ్లకు గుర్తింపు ఇస్తున్నామా..? ఆత్మపరిశీలన చేసుకోవాలి. జిల్లాలో వాస్తవ పరిస్థితులను చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్తా. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా అది నా బాధ్యత. లేదంటే పార్టీని మోసం చేసిన వ్యక్తిగా మిగిలిపోతా' అని తిక్కారెడ్డి పేర్కొన్నారు.

ఏపీకి 'ఎయిర్‌బస్ హెలికాప్టర్'!?

(మొదటి పేజీ తరువాయి)

'కియా'తో అంతర్జాతీయ గుర్తింపు పొందిన అనంతపురం జిల్లాలోనే హెచ్125 హెలికాప్టర్ల యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసే అవకాశముందని చెబుతున్నాయి. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిగాయని... అనంతపురంలో అనువైన భూమిని కేటాయించాలంటూ జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదనలు అందాయని వార్తలు వస్తున్నాయి.

ఇదీ హెచ్125 హెలికాప్టర్...

ఫ్రాన్స్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక విమాన కంపెనీ 'ఎయిర్ బస్' హెచ్125 హెలికాప్టర్లను తయారు చేస్తోంది. ఇది సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్. గరిష్ఠంగా ఆరుగురు ప్రయాణించగలరు. పర్యాటకం, సరిహద్దుల్లో పహారా, విపత్తు సమయంలో సహాయ చర్యల్లో చక్కగా వినియోగించవచ్చు. దీని గరిష్ఠ వేగం గంటకు 289 కిలోమీటర్లు. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడవుతున్న హెలికాప్టర్ ఇదే. భారత్‌లో హెలికాప్టర్ల మార్కెట్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని... 'మేడిన్ ఇండియా హెచ్125 హెలికాప్టర్' తయారు చేయాలని యోచిస్తున్నట్లు 'ఎయిర్‌బస్' ఇదివరకే ప్రకటించింది.

సీఎన్‌బీసీ చానల్ 18కు దావోస్‌లో ప్రచార బాధ్యత

- డిజిటల్ ప్రచార బాధ్యతలు బిజినెస్ టుడేకు

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ అత్యంత అనువైన, స్నేహపూర్వకమైన రాష్ట్రంగా దావోస్‌లో ప్రచారం కల్పించేందుకు నెట్‌వర్క్ 18 గ్రూప్‌నకు చెందిన సీఎన్‌బీసీ టీవీ-18కు ప్రభుత్వం రూ.1,15,64,000 మంజూరు చేసింది. కాగా, డిజిటల్, సోషల్ మీడియాల్లో ప్రచారం బాధ్యతను బిజినెస్ టుడేకు ఇచ్చారు. అందుకోసం సదరు సంస్థకు రూ.61,50,280 చెల్లించడానికి డిజిటల్ కార్పొరేషన్ ఎండీకి అనుమతిస్తూ జీవో నంబరు 101 జారీ అయింది. శనివారం సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసులకు చిక్కిన దోపిడీ దొంగలు?

హైదరాబాద్ సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నడిబొడ్డున కాల్పులు జరిపి తప్పించుకున్న దోపిడీ దొంగలను పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాల్పుల అనంతరం దొంగలు అఫ్జల్‌గంజ్‌లో ఆటో ఎక్కి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు పారిపోయినట్లు గుర్తించిన పోలీసులు.. ఆ మార్గంలోని సీసీటీవీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు సేకరించారు. దొంగలు ఆ రోజు రాత్రి 8 గంటలకు రైల్వే స్టేషన్ పరిసరాల్లో తిరిగినట్లు ఆధారాలు లభించాయి. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఎక్కడ దిగారు? ఆటోలో ఏం మాట్లాడుకున్నారు? ఎటు వెళ్లారు? అనే పలు కీలక విషయాలు తెలిసినట్లు సమాచారం. దోపిడీ దొంగలు బిహార్‌కు చెందిన అమిత్‌కుమార్, అనీశ్ గ్యాంగ్‌గా ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు..ఈ ముఠా బీదర్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌లో కూడా బ్యాంకులో రూ.70 లక్షలు దోచుకుని పరారైనట్లు గుర్తించారు. ముఠాలో ఎంతమంది ఉన్నారు? వారి కార్యకలాపాలు తదితర అంశాలపై రహస్య ప్రదేశంలో విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించడంలేదు.

పర్యాటకంతో అభివృద్ధి పథం



జ్యోతి ప్రజ్వలనతో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

- రాష్ట్రంలో పీపీపీ విధానంలో టూరిజం అభివృద్ధికి కృషి
- ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్
- సూళ్లూరుపేటలో అట్టహాసంగా పక్షుల పండుగ


భీములవారిపాళెం ఓడరేవులో పడవ షికారు చేస్తున్న పర్యాటకులు

తడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ విధానం) పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు దేశాలు పర్యాటక రంగంతోనే అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. మన రాష్ట్రంలో ముఖ్యంగా పులికాట్ పరివాహక ప్రాంతం పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో అనువైన ప్రాంతమని గుర్తించామన్నారు. అందులో భాగంగా సూళ్లూరుపేటను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామని, తద్వారా యువతకు ఉపాధి కల్పిస్తామని మంత్రి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2020 తర్వాత పక్షుల పండుగను నిలిపివేయడంతో పర్యాటక అభివృద్ధి మూలన పడిపోయిందని విమర్శించారు. పర్యాటకం, పరిశ్రమలతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం త్వరలో విజయవాడ, విశాఖలలో పెట్టుబడిదారులతో సమావేశం ఏర్పాటు చేస్తుందన్నారు. పక్షుల పండుగతోపాటు విశాఖ, కాకినాడ, తిరుపతిలో ఉత్సవాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సాల్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పరసా రత్నం, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, టీడీపీ నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్, తానంకి నానాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పక్షుల పండుగ

పక్షుల పండుగ అట్టహాసంగా మొదలైంది. సూళ్లూరుపేట హోలీక్రాస్ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అతిథులు ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన ఫ్లెమింగో పాట అందరినీ అలరించింది. నేలపట్టు, అటకానితిప్పల వద్ద పక్షుల వీక్షణకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. ఇక భీములవారిపాళెం రేవులో పడవ షికారుకు పర్యాటకులు ఉత్సాహం చూపారు. సినీనటుడు శివారెడ్డి మిమిక్రీతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

టీటీడీలో కల్తీ నెయ్యికి కళ్లెం!

- వంద శాతం కల్తీని గుర్తించే నూతన పరికరాలు సిద్ధం
- జర్మనీ నుంచి రూ.70లక్షల విలువైన రెండు యంత్రాలు
- విరాళంగా ఇచ్చిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు
- తిరుమలలోని టీటీడీ ల్యాబ్‌లో ఏర్పాటుచేసిన అధికారులు
- వచ్చేనెల నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు



తిరుమలలోని ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన గ్యాస్ క్రోమాటోగ్రాఫ్ యంత్ర పరికరం

తిరుమల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల్లో వినియోగించే నెయ్యిలో కల్తీని వందశాతం గుర్తించేలా నూతన పరికరాలతో టీటీడీ ల్యాబ్ సిద్ధమైంది. లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యి కల్తీపై ఆరోపణలు రావడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. 2024 జూలై 8న నమూనాలు ఎన్డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్‌కు పంపగా, అదేనెల 17న ఈ మేరకు నివేదిక రావడం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. తిరుమలలోని ల్యాబ్‌కు నెయ్యిని వందశాతం పరీక్షించే సామర్థ్యం లేదని, అక్కడ ఉన్న యంత్రాలతో మాయిశ్చరైజ్, కెమికల్ అనాలసిస్, ఆర్ఐ(రిఫ్రాక్ట్ ఇండెక్స్) వంటి ప్రాథమిక పరీక్షలు మాత్రమే చేయగలమని పలువురు నిపుణులు నివేదిక ఇచ్చారు. దీంతో ఇక్కడి ల్యాబ్‌లో అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు టీటీడీ ఈవో శ్యామలరావు నిర్ణయించారు. నెయ్యిని సూక్ష్మస్థాయిలో పరీక్షించేందుకు కావాల్సిన యంత్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనికోసం ఫ్యాటీ ఆసిడ్ మైథెల్ ఎస్టర్, బీటా-సిటోస్టెరాల్ వంటి పరీక్షలకు గ్యాస్ క్రోమాటోగ్రాఫ్ (జీసీ), హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రాఫ్ (హెచ్‌పీఎల్‌సీ) అనే రెండు యంత్ర పరికరాలు అవసరమని నేషనల్ ల్యాబ్ నిపుణులు టీటీడీకి సూచించారు. దాదాపు రూ.70 లక్షల విలువైన ఈ రెండు పరికరాలను విరాళంగా ఇచ్చేందుకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో వీటిని ఇటీవల జర్మనీ నుంచి తిరుమలకు తీసుకువచ్చి ల్యాబ్‌లో అమర్చారు. వీటిద్వారా నెయ్యి నమూనాలను పరీక్షించేందుకు ఇప్పటికే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. దీంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్ (ఎఫ్ఎస్ఎస్ఆర్) నిబంధనల ప్రకారం నెయ్యిని పూర్తిస్థాయిలో పరీక్షించే స్థాయికి టీటీడీ ల్యాబ్ వచ్చింది. వచ్చేనెల నుంచి ఈ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా టీటీడీ సన్నాహాలు చేస్తోంది.

సీఆర్‌డీఏకు రండి!

డిప్యుటేషన్‌పై పనిచేయండి

- పీఎస్‌యూలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీఆర్‌డీఏ ఆహ్వానం
- మూడు నోటిఫికేషన్లు విడుదల

విజయవాడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాజధానిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ తదితర విభాగాలను బలోపేతం చేసేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే వారి సేవలను వినియోగించుకోవాలని భావిస్తోంది. దీనికోసం శనివారం సీఆర్‌డీఏ 3 నోటిఫికేషన్లను విడుదల చేసింది. ఇంజనీరింగ్ విభాగంలో చీఫ్ ఇంజనీర్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈ)ల వరకు మొత్తం 114 పోస్టులకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అలాగే ఇదే విభాగంలో విడిగా మరో 8 పోస్టులను డిప్యుటేషన్ విధానంలో తీసుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. పర్యావరణ విభాగంలో పనిచేసేందుకు కూడా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అకౌంట్స్ విభాగంలో 25 పోస్టులకు సంబంధించి డిప్యుటేషన్ విధానంలో తీసుకునేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.


హైదరాబాద్‌లోని ఘాట్‌లో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి నారా లోకేశ్, భువనేశ్వరి, నందమూరి బాలకృష్ణ, జూ.ఎన్టీఆర్


టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన పార్టీ నేతలు అచ్చెన్నాయుడు, అశోక్‌బాబు తదితరులు

ప్రజలిచ్చిన తీర్పు గౌరవం పెరిగేలా పనిచేద్దాం

- పార్టీ ఎమ్మెల్యేలకు అచ్చెన్నాయుడు పిలుపు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కూటమి పార్టీలకు కనీవినీ ఎరుగని తీర్పిచ్చారని, ఆ తీర్పునకు గౌరవం పెరిగేలా పనిచేద్దామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో హోంమంత్రి అనిత, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్సీలు అశోక్ బాబు, ఇతర పార్టీ నేతలతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 'రాజకీయం కొన్ని వర్గాలకు, కొందరు వ్యక్తులకు మాత్రమే పరిమితమైన రోజుల్లో ఎన్టీఆర్ దానిని ప్రజల్లోకి తెచ్చారు. కనుచూపు మేర కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం లేని రోజుల్లో దానిని కూకటివేళ్లతో పెకిలించారు' అని అన్నారు. '42 ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో టీడీపీ చెక్కు చెదరకుండా నిలిచి ఉండటానికి చంద్రబాబు నాయుడు శ్రమ, కార్యకర్తల కష్టం కారణమన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ తెలుగునేలలో సామాన్యులకు కూడా రాజకీయ చైతన్యం కలిగించిన ఘనత ఎన్టీ రామారావుకే దక్కుతుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దువ్వారపు రామారావు, ఏఎస్ రామకృష్ణ, ఉండవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అంటే ఒక వైబ్రేషన్:పెమ్మసాని

కాంగ్రెస్ కంచుకోటను కూల్చి సంచలనం సృష్టించిన యుగ పురుషుడు నందమూరి తారక రామారావు అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఎన్టీఆర్ అంటే పేరు కాదని, ఒక వైబ్రేషన్ అని, కాంగ్రెస్ కంచుకోటను కూల్చిన సెన్సేషన్ అని, తెలుగువారి గుండెల్లో నిలిచిన ఒక ఎమోషన్ అని అన్నారు.

టీడీపీ కోటి సభ్యత్వాలతోనే

ఎన్టీఆర్‌కు ఘన నివాళి: రామ్మోహన్‌నాయుడు

యుగ పురుషుడు నందమూరి తారక రామారావు అని కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు కొనియాడారు. శనివారం, మాజీ సీఎం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కేంద్ర మంత్రి తన కార్యాలయంలో పూలమాల వేసి, నివాళులర్పించారు. లోకేశ్ నాయకత్వంలో కోటి మంది సభ్యత్వాలతో టీడీపీ అతిపెద్ద కుటుంబంగా ఆవిర్భవించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఇదే నిజమైన నివాళి అని అన్నారు.

మరణం లేని మహానేత : పురందేశ్వరి

విజయవాడ(పటమట), జనవరి 18(ఆంధ్రజ్యోతి): జనమే తప్ప మరణం లేని మహానాయకుడు ఎన్టీఆర్ అని ఆయన కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లోని విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఎన్టీఆర్ పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలనే లక్ష్యంతో జనతా వస్త్రాలు, రూ.2లకే కిలో బియ్యం, పక్కా గృహాలు అందించి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాముడు, కృష్ణుడు అంటే ఇప్పటికీ ఎన్టీఆర్ గుర్తుండి పోతారని పేర్కొంటూ.. ఎప్పటికీ నీ కడుపునే పుట్టాలని ఉంది నాన్న' అంటూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరామ్, కిలారు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం : పవన్ కల్యాణ్

అమరావతి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ నటుడుగా స్ఫురణకు వస్తే ఆయన అభినయించిన పాత్రలే కళ్ల ముందు మెదులుతాయని, రాజకీయ నేతగా తలంపుకొస్తే ఆయన ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పవన్ ఒక ప్రకటన ద్వారా ఆయనకు నివాళులర్పించారు. 'సినీ, రాజకీయ రంగాల్లో బలీయమైన ముద్ర వేసిన ఎన్టీఆర్ తెలుగు వారైనందుకు తెలుగువారందరికీ గర్వకారణం. ఆ మహాపురుషుడి వర్ధంతి సందర్భంగా నీరాజనాలర్పిస్తున్నాను. ఆయన నట జీవితం, రాజకీయ జీవితం నేటి తరానికి ఆదర్శనీయం, ఆచరణీయం' అని కొనియాడారు.

ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై లోకేశ్ అసంతృప్తి

- ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడంపై అసహనం
- సొంత నిధులతో మరమ్మతులకు ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ లోపంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం ఎన్టీఆర్ ఘాట్‌లో తల్లి భువనేశ్వరితో కలిసి ఆయన నివాళులర్పించారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని చూసి లోకేశ్ అసహనం వ్యక్తం చేశారు. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా ఘాట్ మరమ్మతులు పూర్తి చేయాలని ఆయన తన సిబ్బందిని ఆదేశించారు. 'ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించే విషయమై కేంద్రంతో చర్చలు జరుపుతున్నామని.. కచ్చితంగా వస్తుందని ఆశిస్తున్నామన్నారు. తెలంగాణలో టీడీపీని పునర్నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. తెల్లవారుజాము నుంచే ఎన్టీఆర్ ఘాట్‌కు కుటుంబసభ్యులు, అభిమానులు, టీడీపీ నేతల రాక మొదలైంది. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌తో కలసి వచ్చి నివాళులర్పించి కొంత సమయం ఘాట్ వద్ద కూర్చున్నారు. అనంతరం సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ తన సోదరుడు రామకృష్ణ, ఇతర నాయకులతో కలసి వచ్చి ఘాట్ వద్ద నివాళులర్పించారు.

ఎన్టీఆర్ పథకాలే వేరేపేర్లతో అమలు: బాలకృష్ణ

ప్రపంచంలోనే ఎన్టీఆర్‌ను మించిన నటనాచార్యులు ఎవరూ లేరని బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ పెట్టిన పథకాలు ఇప్పటికీ పేర్లు మార్చి కొనసాగిస్తున్నారని చెప్పారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను ఆయన అభిమానులు, టీడీపీ నేతలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రుల్లో రక్తదానంతో పాటు రోగులకు పండ్ల పంపిణీ, అన్నదానం చేపట్టారు.

మంచు కుటుంబ వివాదంలో కొత్త మలుపు

- ఇల్లు ఖాళీ చేయించాలని జిల్లా మెజిస్ట్రేట్‌కు మోహన్‌బాబు ఫిర్యాదు
- మనోజ్‌కు నోటీసులు జారీ.. అదనపు కలెక్టర్ ఎదుట హాజరైన నటుడు
- నేను తప్పు చేయలేదు.. మావి ఆస్తి గొడవలు కాదు.. విద్యార్థుల కోసం పోరాటం
- న్యాయం దక్కేంతవరకు వెనక్కు తగ్గను: మంచు మనోజ్


రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ వద్దకు వెళుతున్న మనోజ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబ వివాదం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. కేసులు, పోలీసు విచారణలు, కోర్టులో వాయిదాల తర్వాత కొంత శాంతించినట్లు కనిపించినా మరో వివాదం తెరమీదకు వచ్చింది. హైదరాబాద్ శివారు జల్‌పల్లిలోని తన ఇంట్లో ఉంటున్న చిన్న కుమారుడు మనోజ్‌ను ఖాళీ చేయించాలని కొన్ని రోజుల క్రితం జిల్లా మెజిస్ట్రేట్‌ను మోహన్‌బాబు ఆశ్రయించారు. దీంతో తాజాగా మోహన్‌బాబు నివాసంలో ఉంటున్న మనోజ్‌కు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నోటీసులు పంపించారు. వాటికి వివరణ ఇచ్చేందుకు మనోజ్ శనివారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుట హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. "నాన్నగారిని నేను ఎప్పుడూ వ్యతిరేకించను. కేవలం నా అన్న.. నాన్నను ముందుకునెట్టి వెనుకనుంచి ఆడుతున్న నాటకం ఇది" అని ఆరోపించారు. నివాసం ఖాళీ చేయమని కలెక్టర్ ఇచ్చిన నోటీసులపై లిఖితపూర్వకంగా స్పందిస్తానని, దాన్ని మీడియాకు కూడా విడుదల చేస్తానని తెలిపారు. తమవి ఆస్తి గొడవలు కాదని, తమ విద్యాసంస్థలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించినదుందుకు ఆస్తి గొడవలుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు జరుగుతున్న నష్టంపై తాను మెసేజ్ రూపంలో తెలిపినా పట్టించుకోలేదన్నారు. కుటుంబ సభ్యులందరూ కూర్చొని మాట్లాడుకుందాం అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ రావడం లేదని పేర్కొన్నారు. జల్‌పల్లిలోని నివాసంలో తన కూతురు ఉందని చెప్పినా పంపకపోవడంతోనే గొడవలు జరిగాయన్నారు. ఈ పోరాటం అంతా విద్యార్థులు, తన కుటుంబం, బంధువుల కోసమని.. ఎన్ని కేసులు పెట్టినా ఆపేది లేదని, న్యాయం జరిగేవరకు కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,**
RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.